



# పెన్ పవర్


తెలుగు దిన పత్రిక
ప్రశ్నించడం మన హక్కు








సంపుటి : 1 సంచిక : 124 పేజీలు : 12 సంపాదకులు : జి.ఎ.రావు ( ఆనంద్ గంట్యాడ) ప్రచురణ : హైదరాబాద్ సోమవారం 16 మార్చి 2026 వెల : 1/-రూ ॥

VOLUME :1 ISSUE : 124 PAGES : 12 EDITOR : G. A. RAO ( ANAND GANTYADA ) PUBLISHED : HYDERABAD MON 16 MARCH 2026 PRICE : 1/- RS

Simultaneously Published form : Hyderabad, Thadepalligudem, Dr. B.R. Ambedkar Konasema Dist, Narasarao Peta,Bapatla,Visakhapatnam,Kakinada,Ongole, Kadapa,,SPSR Nellore, Circulated by :Srikakulam,manyam,Vizianagaram,East Godavari, Eluru,Guntur, Tirupati,Chittor,Kurnool,Anantapur


## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు..
# కానీ కదలలేని స్థితిలో!
## భారత ఇంటెలిజెన్స్ సంచలన నివేదిక!



- ఫిబ్రవరి 28న ఇరాన్ పై ఇజ్రాయెల్, అమెరికా భీకర దాడులు
- సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేని మృతి
- మొజ్తబాకు తీవ్ర గాయాలు అంటూ భారత ఇంటెలిజెన్స్ రిపోర్ట్!
- మొజ్తబా తరఫున ఐఆర్జీసీనే పాలన సాగిస్తోందని వెల్లడి
- ఇటీవల ట్రంప్ చేసిన వ్యాఖ్యలకు మరింత బలం చేకూర్చేలా ఇంటెలిజెన్స్ నివేదిక!

**హైదరాబాద్ పెన్ పవర్:**ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ మొజ్తబా ఖమేనీ బ్రతికే ఉన్నప్పటికీ, తీవ్ర గాయాలతో కదలలేని (ఇమ్మొబైల్) స్థితిలో ఉన్నారని భారత ఇంటెలిజెన్స్ వర్గాలను ఉటంకిస్తూ జాతీయ మీడియాలో ఓ కథనం వెలువడింది. ఆయన సంభాషణలు, బహిరంగ ప్రకటనలన్నీ ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) కట్టుదిట్టమైన నియంత్రణలో ఉన్నాయని ఆ కథనం స్పష్టం చేసింది. ఈ పరిణామం ఇరాన్ నాయకత్వంపై, దేశ స్థిరత్వంపై అంతర్జాతీయంగా తీవ్ర

- మిగతా 2లో



## విజయ్‌కి డిప్యూటీ సీఎం పోస్టు ఆఫర్..?

**పెన్ పవర్ డెస్క్:**తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలన నేపథ్యంలో రాష్ట్రంలో భాజపా, టీవీకే పార్టీల మధ్య పొత్తు విషయంలో మరోసారి వార్తలు చక్కర్లు కొడుతున్నాయి. పొత్తులో భాగంగా టీవీకే అధినేత విజయ్ కు డిప్యూటీ సీఎం పదవి ఇస్తామని భాజపా ఆఫర్ చేసిందని ఆంగ్ల మీడియాలో కథనాలు వస్తున్నాయి. టీవీకేతో పొత్తుకు సంబంధించి చర్చలు తుది దశకు చేరుకున్నాయని భాజపా వర్గాలు తెలిపాయి. ఆ పార్టీకి 80 సీట్లు ఇచ్చేందుకు ముందుకొచ్చినట్లు పేర్కొన్నాయి. విజయ్‌కు డిప్యూటీ సీఎం పదవిని కూడా ఆఫర్ చేసినట్లు వెల్లడించాయి. ముఖ్యమంత్రి పదవిపై విజయ్ దృష్టి పెట్టారని.. చర్చల్లో ఈ విషయం కీలకంగా మారిందని చెప్పాయి. అయితే, ఈ విషయంపై ఇప్పటివరకు ఇరుపార్టీల నుంచి ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు. భాజపా, డీఎంకేలతో తమకు పొత్తులు ఉండవని విజయ్ గతంలోనే తేల్చి చెప్పిన సంగతి తెలిసిందే. అయినా.. వీటికి సంబంధించిన వార్తలు వస్తూనే ఉండటం గమనార్హం.

# దేశంలోనే తొలి కారుణ్య మరణం..


ఎయిమ్స్ లోని పెయిన్ అండ్ పాలియేటివ్ కేర్ విభాగానికి మాజీ అధిపతి అయిన డాక్టర్ సుష్మా భట్నాగర్ ఇలాంటి కేసులను ఎలా ట్రీట్ చేస్తారో వివరించారు:

- పాలియేటివ్ కేర్‌లో డాక్టర్లు రోగిని సహజంగా మరణించేందుకు అనుమతిస్తారు.
- వారు జీవితాన్ని కృత్రిమంగా పొడిగించరు.
- అలాగే ఉద్దేశపూర్వకంగా మరణాన్ని వేగవంతం చేయరు.
- ఇలాంటి రోగులకు మాత్రం ప్రాథమిక వైద్య సేవలు కొనసాగుతాయి.

**ఉదాహరణకు:**

- నొప్పి నియంత్రణ
- శుభ్రత, నర్సింగ్ సేవలు
- సౌకర్యం కోసం అవసరమైన మందులు
- భావోద్వేగ పరమైన మద్దతు

అయితే ఇలాంటి రోగులను ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ICU) కు మార్చడం లేదా తీవ్రమైన చికిత్సలు అందించడం చేయరు.



**హైదరాబాద్ పెన్ పవర్:**గత 13 ఏళ్లుగా కోమాలో బాధపడుతున్న 31 ఏళ్ల హరీష్ రానాను కారుణ్య మరణానికి అనుమతిస్తూ సుప్రీం కోర్టు తీర్పు వెల్లడించిన సంగతి తెలిసిందే. దీనికి అనుగుణంగా ఘజియాబాద్‌లో ఉంటున్న హరీష్ రానాను..
ఢిల్లీలోని ఎయిమ్స్ (AIIMS) కి తరలించారు. హరీష్ రానా తల్లిదండ్రులు అత్యంత రహస్యంగా ఈ ప్రక్రియను పూర్తి చేశారు. దీని గురించి పొరుగువారికి, సొసైటీ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. శనివారం హరీష్ రానాను ఘజియాబాద్‌లోని తన ఫ్లాట్ నుండి ఎయిమ్స్ కు చేర్చారు. ఈ సమయంలో అతడి సోదరి, బావమరిది, తల్లిదండ్రులు మాత్రమే ఉన్నారు. ప్రత్యేక వాహనంలో హరీష్ రానాను తరలించారు. హరీష్ రానాను తరలించే ముందు బ్రహ్మ కుమారీలకు చెందిన ఓ దీదీ వారి ఇంటికి వచ్చారు. హరీష్ తల మీద చేయి వేసి నిమురుతూ.. అందరినీ క్షమించి.. అందరికీ క్షమాపణలు చెప్పి వెళ్లు అని చెప్పారు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. 31 ఏళ్ల వయసులో మరణానికి చేరువవుతున్న హరీష్ రానా ముఖం చూసిన ప్రతి ఒక్కరూ కన్నీరు



పెట్టుకుంటున్నారు. వైద్య నిపుణుల ప్రకారం, హరీష్ రానాను ఎయిమ్స్ లోని పాలియేటివ్ కేర్ యూనిట్‌కు తరలించే అవకాశం ఉంది. పాలియేటివ్ కేర్ అంటే తీవ్రమైన, చివరి దశ వ్యాధులతో బాధపడుతున్న రోగులకు సౌకర్యం, గౌరవంతో జీవించేందుకు సహాయం చేసే వైద్య విధానం. ఈ విభాగంలో డాక్టర్లు జీవితం ఎక్కువ కాలం కొనసాగించడానికి తీవ్రమైన చికిత్సలు చేయరు. దాని బదులుగా, రోగి బాధను తగ్గించడం పై దృష్టి పెడతారు.

## మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసు...
## ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సహా ఆరుగురికి పాజిటివ్



- ర్యాపిడ్ టెస్ట్‌లో నెగిటివ్.. బ్లడ్ టెస్ట్‌లో ఎంపీకి పాజిటివ్
- ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ గిరిధర్
- 11 మంది ప్రముఖులను అదుపులోకి తీసుకున్న ఈగల్ టీమ్

**హైదరాబాద్ పెన్ పవర్:**మొయినాబాద్ లోని అజీజ్ నగర్ ఫామ్‌హౌస్ పై జరిగిన 'ఈగల్' బృందం దాడుల కేసులో సంచలన విషయాలు వెలుగులోకి వచ్చాయి. శనివారం రాత్రి జరిగిన డ్రగ్స్ పార్టీలో పాల్గొన్న వారికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు ఈగల్ బృందం ఎస్పీ గిరిధర్ ధృవీకరించారు. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌తో పాటు రితేష్ రెడ్డి, నమిత్, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు పాజిటివ్ వచ్చిందని

- మిగతా 2లో



## నెతన్యాహుకు ఇరాన్ 'డెత్ వార్నింగ్'!

- వెంటాడి, వేటాడి చంపుతామని ఐఆర్ జీసీ హెచ్చరిక
- బాగ్దాద్ అమెరికా ఎంబసీపై క్షిపణి దాడి
- ఖర్గ్ ఐలాండ్‌ను ధ్వంసం చేసిన అమెరికా

**పెన్ పవర్ డెస్క్:**ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా కూటమి మధ్య జరుగు తున్న యుద్ధం అత్యంత ప్రమాదకర స్థాయికి చేరు కుంది. తమ సుప్రీం లీడర్ అయతొల్లా అలీ ఖమేనీ మరణానికి ప్రతీకారంగా ఇజ్రాయెల్ ప్రధాన మంత్రి బెంజమిన్ నెతన్యాహును 'వేటాడి చంపుతామని' ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) శనివారం ప్రతిజ్ఞ చేశాయి. నెతన్యాహు ఆచూకీపై సామాజిక మాధ్యమాల్లో పుకార్లు వస్తున్న తరుణంలో ఆయన ఎక్కడ ఉన్నా వదిలిపెట్టబోమని ఇరాన్ సైన్యం హెచ్చరించింది.

- మిగతా 2లో

## ఆధారాలు బయటపెడితే బద్నాం చేస్తరా...?
## ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్త

- ప్రపంచ బ్యాంక్కు మూసీ భూములను కట్టబెట్టే ప్రయత్నం
- తెలంగాణలో చిన్న మోదీలా రేవంత్ రెడ్డి వ్యవహారం
- ఇష్టమొచ్చినట్లుగా వీడియోలు పెట్టడానికి మీరు కంటెంట్ రైటర్లా?




- మిగతా 2లో




## నాలుగు రాష్ట్రాలు మోగిన ఎన్నికల నగారా..

- నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాంతానికి ఎన్నికల షెడ్యూల్ విడుదల
- పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అసోం, పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు
- పశ్చిమ బెంగాల్‌లో రెండు దశల్లో, మిగిలిన చోట్ల ఒకే విడతలో పోలింగ్
- ఏప్రిల్ నెలలో ఎన్నికల పోలింగ్ ప్రక్రియ పూర్తి
- అన్ని ప్రాంతాల ఓట్ల లెక్కింపు మే 4వ తేదీన..

- మిగతా 2లో

## ఇది మీ ప్రభుత్వం, నేను మీ సోదరుడిని
## ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి



- హైదరాబాద్ ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ కీలక వ్యాఖ్యలు
- ముస్లింల సంక్షేమానికి మా ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తుందని వెల్లడి
- మతాల మధ్య చిచ్చు పెట్టే శక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచన
- మైనారిటీ నేతలకు కీలక పదవులు ఇచ్చామని స్పష్టీకరణ

**హైదరాబాద్ పెన్ పవర్:**ముస్లిం సమాజ సంక్షేమం, అభివృద్ధికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కొన్ని రాజకీయ శక్తులు మతాల పేరిట సమాజాన్ని విభజించి, ఉద్రిక్తతలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని,

- మిగతా 2లో



## బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి
## పుంగనూరులో విషాదం..

- బైక్ నుంచి వెలువడిన పొగ పీల్చి తాత, ముగ్గురు చిన్నారుల దుర్మరణం
- మెకానిక్ సలహాతో బైక్‌ను రాత్రంతా ఆన్‌లో ఉంచిన యజమాని
- పైగదిలో నిద్రించడంతో ప్రాణాలతో బయటపడ్డ దంపతులు

- మిగతా 2లో

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం...
## కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్



- మొయినాబాద్ ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ కలకలం
- పట్టుబడిన బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి
- కేటీఆర్ కూడా డ్రగ్స్ టెస్టు చేయించుకోవాలన్న టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్
- ఏ టెస్టుకైనా తాను సిద్ధమంటూ కేటీఆర్ ట్వీట్
- మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నానని వెల్లడి

- మిగతా 2లో

## ఎడిటర్ వ్యూ

## మూసీని మురికి కూపంగా మార్చారా? పదేళ్లు మనమేం చేశాం కేటీఆర్?

అధికారంలో ఉన్న వారిపై విపక్షంలో ఉన్నోళ్లు విరుచుకుపడటం కామన్. అందులో తప్పేం లేదు. కాకుంటే.. తాము అధికారంలో ఉన్నప్పుడు ఏం చేశామన్న విషయాన్ని చెబుతూ.. ప్రస్తుతం అధికారంలో ఉన్నోళ్లు ఏం చేయలేదో చెబితే బాగుంటుంది. కానీ.. గులాబీ యువరాజు కేటీఆర్ మాత్రం అందుకు భిన్నం. తాము అధికారంలో ఉన్న పదేళ్లలో ఏం చేయని అంశాలను సైతం.. చాలా చేసినట్లుగా చెబుతూ.. ప్రస్తుత ప్రభుత్వం చేస్తామని చెప్పే ప్రాజెక్టులను ప్రశ్నించే తీరు చూస్తే.. ఇంతకు మించిన సెల్ఫ్ గోల్ ఇంకేమైనా ఉంటుందా? అన్నది ప్రశ్న.

రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన నాటి నుంచి మూసీ సంగతి తేల్చేయాలని.. ఇప్పటివరకు మరే పాలకుడు చేయలేని.. చేయటం సాధ్యం కాని మూసీ ప్రాజెక్టును చేపట్టటమే కాదు.. దాన్ని ఒక కొలిక్కి తీసుకొస్తానని చెప్పే ఆయన తీరు కొత్త ఆశల్ని రేకెత్తేలా చేస్తుందని చెప్పాలి. ఇప్పటికే మూసీ ప్రాజెక్టు మీద పెద్ద ఎత్తున నెగిటివ్ ప్రచారం జరుగుతున్న వేళ.. శుక్రవారం సాయంత్రం మూసీ అంశంపై తాజ్ క్రిష్ణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వివిధ రంగాలకు చెందిన దాదాపు 500 మందితో కూడిన పెద్ద మనుషులతో కార్యక్రమాన్ని నిర్వహించటం.. మూసీ పునరుద్ధరణ ప్రాజెక్టులో భాగంగా తామేం చేయనున్న విషయాన్ని పవర్ పాయింట్ ప్రజంటేషన ద్వారా వివరించిన సీఎం రేవంత్.. ఆ తర్వాత ప్రాజెక్టు అంశం తనకెంత కీలకమన్నఅంశాన్ని తన ప్రసంగంతో చెప్పేశారు. తమ ప్రభుత్వం మూసీ ప్రాజెక్టుకు అత్యధిక ప్రాధాన్యతను ఇవ్వటంతో పాటు.. ప్రాజెక్టులోని మొదటి దఫాకు సంబంధించిన వివరాల్ని సవివరంగా వెల్లడించారు. రెండేళ్ల కాల పరిమితితో పూర్తి చేయాలని భావిస్తున్న రేవంత్ రెడ్డి.. సరిగ్గా ఎన్నికలకు ముందు తన కలల ప్రాజెక్టును మాటల్లో కాకుండా చేతల్లో చూపించటం ద్వారా.. రెండో దఫా అధికారానికి పర్ ఫెక్టు అజెండాను ఎంచుకున్నట్లుగా చెప్పాలి. అయితే.. ఇదంతా ఆయన చెబుతున్నట్లుగా చేతల్లో చేసి చూపిస్తేనే. నిజాం తర్వాత మళ్లీ మూసీని పట్టించుకున్న నాథుడు లేదని చెప్పిన వైనాన్ని చూసినప్పుడు గతంలోని కాంగ్రెస్ ప్రభుత్వాల వైఫల్యాన్ని ఒప్పుకున్నట్లు అవుతుంది. ఇదంతా ఒక ఎత్తు అయితే.. తాజాగా మూసీ మీద పవర్ పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చిన కేటీఆర్.. మూసీని మురికి కూపంగా మార్చింది కాంగ్రెస్ పార్టీనేనని.. గత పాపాలకు ముక్కు నేలకు రాసి సీఎం.. కాంగ్రెస్ పార్టీ ప్రజలకు క్షమాపణ చెప్పాలన్న మాటల్ని చూస్తే.. కేటీఆర్ రాజకీయ అపరిపక్వత.. ప్రభుత్వాన్ని ప్రశ్నించేందుకు సరిగా ప్రిపేర్ కాని నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. తన నోటి నుంచి ఈ తరహా మాటలు వచ్చింతనే.. కాంగ్రెస్ పాపం చేసింది సరే.. పదేళ్లు నాన్ స్టాప్ అధికారంలో ఉన్నప్పుడు ఆ పాపాన్ని పూర్తిగా కడిగేసి.. ప్రక్షాళన ఎందుకు చేయలేదు? అన్నది ప్రశ్న. అంతేనా.. కేసీఆర్ హయాంలో మూసీలో స్పీడ్ బోటింగ్ చేపడతామన్న మాటల్ని చెప్పి.. అదేమీ చేయని వైఫల్యాలు ఎవరివి కేటీఆర్? అని గట్టిగా అడిగే పరిస్థితి తన మాటలతో కేటీఆర్ మరోసారి తీసుకొచ్చారని చెప్పాలి. ఇలా.. సెల్ఫ్ గోల్ తరహాలో వ్యాఖ్యలు చేయటం కేటీఆర్ కే చెల్లుతుందని చెప్పక తప్పదు. రాజకీయ చతురతతో వ్యూహాత్మకంగా ముందుకు వెళుతున్న రేవంత్ సర్కారును అంతే తెలివితోనే ఢీ కొట్టేలా చేయాలే తప్పించి.. ఇలా తన మాటలతో తానే ఆత్మరక్షణలో పడే తీరును మార్చుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. మరి.. ఈ విషయాన్ని కేటీఆర్ ఎప్పుడు గుర్తిస్తారో చూడాలి.

# ఆధారాలు బయటపెడితే బద్నాం చేస్తరా...? ప్రభుత్వంపై పరువు నష్టం దావా వేస్త

హైదరాబాద్: ప్రపంచ బ్యాంక్ కు మూసీ పరివాహక ప్రాంత భూములను కట్టబెట్టే ప్రయత్నం చేస్తున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపించారు. తాను ఆధారాలు బయ టపెడితే హైడ్రా, కాంగ్రెస్ ప్రభుత్వం బాయిలో దూకాలని సెటైర్వేశారు. తాను ప్రూఫ్స్ బయ. టపెడితే ప్రభుత్వం, ప్రతిపక్షం కలిసి తనను బదనాం చేస్తారా..? తమాషాలు చేస్తున్నారా? అని ఫైర్ అయ్యారు. హైడ్రా పెట్టిన ట్వీట్స్, డిలీట్ చేయాలని... లేకపోతే పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఇప్పటివర కు మూసీపై కాంగ్రెస్ ప్రభుత్వం డీపీఆర్ను ఎందుకు విడుదల చేయట్లేదని ప్రశ్నించా రు. తెలంగాణలో రియల్ ఎస్టేట్ ప్రభుత్వం నడుస్తోందని మండిపడ్డారు. బంజారాహిల్స్ లోని తెలంగాణ జాగృతి ఆఫీసులో కవిత మీడియాతో మాట్లాడారు. 'హైడ్రాతో సీఎం రేవంత్ రెడ్డి ఆరాచకం చేస్తున్నరు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ కు ఇప్పటి వరకు ఆరుఫి ర్యాదులు చేశాం. నాలాలు ఆక్రమించి విల్లాలు కడుతున్న సంస్థ తమ పరిధిలోకి రాదని హైడ్రాకమిషనర్ ఎలా అంటున్నరు. సిగ్గు లేకుండా రంగనాథ్ హైడ్రా వీడియోలు తీసి పెడుతు న్నరు. ఇష్టం వచ్చినట్లుగా వీడియోలు పెడు. తున్నరు.. మీరు కంటెంట్ రైటర్లు ఆఅ?" అని నిలదీశారు.

## డ్రగ్స్ టెస్టుకు నేను సిద్ధం... కాంగ్రెస్ సవాల్ స్వీకరించిన కేటీఆర్

బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తాను డ్రగ్స్ టెస్టుకు సిద్ధంగా ఉన్నానని ఆదివారం ప్రకటించారు. మొయినాబాద్ ఫామ్హౌస్లో జరిగిన డ్రగ్స్ పార్టీ వ్యవహారంలో కాంగ్రెస్ నేతలు విసిరిన సవాల్ను ఆయన స్వీకరించారు. డ్రగ్స్ వాడేవారు ఎవరైనా, ఏ పార్టీకి చెందినవారైనా చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని స్పష్టం చేశారు."ఏ టెస్టుకైనా నేను సిద్ధమని ఇప్పటికే చాలాసార్లు చెప్పాను. అన్ని రాజకీయ పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులు ఈ పరీక్ష చేయించుకోవాలన్న మహేశ్ కుమార్ గౌడ్ సూచనను స్వాగతిస్తున్నాను. మనమే ఉదాహరణగా నిలుద్దాం" అని కేటీఆర్ 'ఎక్స్'లో పోస్ట్ చేశారు.సోమవారం నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా, కాంగ్రెస్ ఎమ్మెల్యేలతో పాటు కేటీఆర్, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలందరూ డ్రగ్స్ టెస్టుకు రావాలని టీపీసీసీ అధ్యక్షుడు బి. మహేశ్ కుమార్ గౌడ్ సవాల్ విసిరారు. శనివారం రాత్రి మొయినాబాద్లోని ఓ ఫామ్హౌస్పై పోలీసులు దాడి చేయగా, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సహా ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు తేలిన నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.
ఈ పరిణామాలపై స్పందించిన కేటీఆర్.. డ్రగ్స్ కేసును అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ పార్టీపై బురద చల్లడం నీచ రాజకీయాలకు నిదర్శనమని మండిపడ్డారు. ప్రతీ డ్రగ్స్ కేసులోకి అనవసరంగా తన పేరును లాగితే చట్టపరమైన నోటీసులతో స్పందించాల్సి ఉంటుందని హెచ్చరించారు.హైదరాబాద్ శివారు మొయినాబాద్లోని ఫామ్హౌస్పై శనివారం రాత్రి ఈగిల్ బృందం దాడి చేయగా, టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ కుమార్, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డితో పాటు మొత్తం ఆరుగురికి డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్గా నిర్ధారణ అయింది. పట్టుబడిన వారిని ఈగిల్ బృందం మొయినాబాద్ పోలీసులకు అప్పగించింది.

## ఇది మీ ప్రభుత్వం, నేను మీ సోదరుడిని ఇఫ్తార్ విందులో సీఎం రేవంత్ రెడ్డి

- మొదటి పేజి తరువాయి

ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఆదివారం హైదరాబాద్లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు."ఇది మీ ప్రభుత్వం, నేను మీ సోదరుడిని. తెలంగాణను దేశంలోనే నంబర్ వన్ రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు అందరం కలిసికట్టుగా నిలబడదాం" అని రేవంత్ రెడ్డి ముస్లిం సోదరులకు పిలుపునిచ్చారు. పవిత్ర రంజాన్ మాసంలో ముస్లిం సోదరులకు ప్రభుత్వం తరపున ఇఫ్తార్ విందు ఇవ్వడం సంతోషంగా ఉందని రేవంత్ రెడ్డి అన్నారు. "మనం సోదరభావంతో కలిసిమెలిసి జీవించాలి. దేశాన్ని ముందుకు తీసుకెళ్లాలంటే అన్ని మతాల వారు ఐక్యంగా ఉండాలి. కొందరు మన మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు" అని ఆయన వ్యాఖ్యానించారు. తమ ప్రభుత్వం ముస్లిం సమాజానికి ఇచ్చిన పదవులను ఈ సందర్భంగా ఆయన గుర్తుచేశారు. మహ్మద్ అజారుద్దీన్కు కేబినెట్ మంత్రి పదవి, సీనియర్ నేత మహ్మద్ అలీ షబ్బీర్కు ప్రభుత్వ సలహాదారు పదవితో పాటు, ఎనిమిది మంది మైనారిటీ నేతలకు కార్పొరేషన్ పదవులు ఇచ్చామని తెలిపారు. క్రీడాకారులైన మహ్మద్ సిరాజ్కు డీఎస్పీ ఉద్యోగం, బాక్సింగ్ ఛాంపియన్ నిఖత్ జరీన్కు రూ.2 కోట్ల బహుమతి అందించామని చెప్పారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో వై.ఎస్. రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మైనారిటీలకు 4 శాతం రిజర్వేషన్లు కల్పించి వారి విద్యా, ఉద్యోగావకాశాలకు బాటలు వేశారని గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి మహ్మద్ అజారుద్దీన్, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ, ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, కాంగ్రెస్ నేతలు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## బైక్ పొగకు ఊపిరాడక తాత, ముగ్గురు చిన్నారుల మృతి

అన్నమయ్య జిల్లా పుంగనూరులో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. ఓ మెకానిక్ ఇచ్చిన సలహా పాటించడం వల్ల ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ప్రాణాలు కోల్పోయారు. బైక్ ఇంజిన్ నుంచి వెలువడిన పొగను పీల్చి తాత, ముగ్గురు మనవళ్లు మృతి చెందిన ఈ ఘటన పట్టణంలోని త్యాగరాజు వీధిలో శనివారం రాత్రి జరిగింది.స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం.. త్యాగరాజు వీధికి చెందిన మురళి తన ద్విచక్ర వాహనానికి మరమ్మతులు చేయించాడు. ఇంజిన్ సమస్య ఉండటంతో మెకానిక్, రాత్రంతా బైక్ను ఆన్లో ఉంచాలని సూచించాడు. దీంతో మురళి ఇంట్లోనే బైక్ను ఆన్ చేసి ఉంచి, తలుపులు మూసేశాడు. ఆ సమయంలో మురళి తండ్రి రామచంద్రయ్య, కుమారుడు కార్తీక్, కవల కుమార్తెలు చరిత, చందన కింద గదిలో నిద్రిస్తుండగా.. మురళి, అతడి భార్య రేవతి పైగదిలో పడుకున్నారు.
ఇల్లు ఇరుకుగా ఉండి, గాలి సరిగా ఆడే వీలు లేకపోవడంతో బైక్ నుంచి వెలువడిన పొగ గది మొత్తం వ్యాపించింది. ఈ పొగను పీల్చడంతో ఊపిరాడక తాత, మనవడు, మనవరాళ్లు నిద్రలోనే ప్రాణాలు విడిచారు. పైగదిలో ఉండటంతో మురళి, రేవతి దంపతులు ప్రాణాపాయం నుంచి బయటపడ్డారు. కళ్లముందే కన్నబిడ్డలు, తండ్రి విగతజీవులుగా పడి ఉండటంతో వారి రోదనలు మిన్నంటాయి. ఈ ఘటనతో ఆ ప్రాంతంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

## నాలుగు రాష్ట్రాలు మోగిన ఎన్నికల నగారా..

దేశంలోని నాలుగు రాష్ట్రాలు, ఒక కేంద్ర పాలిత ప్రాం తానికి అసెంబ్లీ ఎన్నికల నగారా మోగింది. తమిళనాడు, కేరళ, పశ్చిమ బెంగాల్, అసోంతో పాటు కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ను కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) ఆదివారం విడుదల చేసింది. ఈ మేరకు కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ మీడియా సమావేశంలో వివరాలను వెల్లడించారు. ఈ అన్ని ప్రాంతాల్లో మే 4వ తేదీన ఓట్ల లెక్కింపు జరగనుంది.వివరాల్లోకి వెళితే, పశ్చిమ బెంగాల్లోని 294 స్థానాలకు రెండు విడతల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఏప్రిల్ 23న తొలి దశ, ఏప్రిల్ 29న రెండో దశ పోలింగ్ నిర్వహిస్తారు. తమిళనాడులోని 234 అసెంబ్లీ స్థానాలకు ఒకే విడతలో ఏప్రిల్ 23న పోలింగ్ జరగనుంది. ఇక అసోం (126), కేరళ (140), పుదుచ్చేరి (30) అసెంబ్లీ స్థానాలకు ఒకే దశలో ఏప్రిల్ 9వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది.
ఎన్నికల షెడ్యూల్కు ముందు రాజకీయ పార్టీల నేతలతో, ఆయా రాష్ట్రాల ఉన్నతాధికారులతో సమావేశాలు నిర్వహించి సలహాలు స్వీకరించామని
జ్ఞానేశ్ కుమార్ వివరించారు. ఈ ఐదు ప్రాంతాల్లో మొత్తం 17.4 కోట్ల మంది ఓటర్లు ఉన్నారని, 2.18 లక్షల పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పోలింగ్ కేంద్రాల్లో దివ్యాంగులు, వృద్ధుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని, యువత పెద్ద ఎత్తున ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. మే 4న జరిగే కౌంటింగ్తో అభ్యర్థుల భవితవ్యం తేలనుంది.

## నెతన్యాహుకు ఇరాన్ 'డెత్ వార్నింగ్'!

- మొదటి పేజి తరువాయి

. "అతను బతికే ఉంటే.. అతన్ని వెంబడిస్తాం, పట్టుకుంటాం, చంపేస్తాం" అంటూ టెలిగ్రామ్ ఛానల్ వేదికగా ఐఆర్ జీసీ సంచలన ప్రకటన చేసింది.
యుద్ధం 16వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో బాగ్దాద్లోని అమెరికా రాయబార కార్యాలయంపై మరోసారి క్షిపణి దాడి జరిగింది. ఎంబసీ ఆవరణలోని హెలిప్యాడ్పై మిస్సైల్ పడటంతో పెద్ద ఎత్తున పొగలు వ్యాపించాయి. మరోవైపు, ఇరాన్లోని వ్యూహాత్మక 'ఖర్గ్ ఐలాండ్'పై అమెరికా జరిపిన బాంబు దాడులను అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సమర్థించుకున్నారు. ఖర్గ్ ఐలాండ్లోని సైనిక స్థావరాలను పూర్తిగా ధ్వంసం చేశామని, అవసరమైతే మరిన్ని దాడులు చేస్తామని ఆయన హెచ్చరించారు. ప్రపంచ దేశాలన్నీ హర్మూజ్ జలసంధిలో నౌకల రక్షణకు ముందుకు రావాలని ట్రంప్ పిలుపునిచ్చారు.ఇరాన్ సైన్యం కూడా వెనక్కి తగ్గడం లేదు. ఇప్పటికే ఇజ్రాయెల్పై ఐదు సార్లు బాలిస్టిక్ క్షిపణులతో విరుచుకుపడింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ మాట్లాడుతూ.. తమ దేశ చమురు క్షేత్రాలపై దాడి జరిగితే పశ్చిమాసియాలో అమెరికా వాటాలున్న ప్రతి చమురు కేంద్రాన్ని బూడిద చేస్తామని హెచ్చరించారు. ఈ యుద్ధ ప్రభావంతో బహ్రెయిన్, సౌదీ అరేబియాలో జరగాల్సిన ఫార్ములా-1 రేసింగ్లు కూడా రద్దయ్యాయి. ఇరు పక్షాల మధ్య దాడులు, ప్రతిదాడులు తీవ్రం కావడంతో ప్రపంచవ్యాప్తంగా చమురు సంక్షోభం ఏర్పడుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది.

## మొయినాబాద్ ఫామ్హౌస్ డ్రగ్స్ కేసు... ఎంపీ, మాజీ ఎమ్మెల్యే సహా ఆరుగురికి పాజిటివ్

- మొదటి పేజి తరువాయి

ఆయన వెల్లడించారు.శనివారం రాత్రి 11 గంటల సమయంలో విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు ఈ ఫామ్హౌస్పై దాడులు నిర్వహించారు. అక్కడ ఒక మహిళ సహా మొత్తం 11 మంది ప్రముఖులు ఉన్నట్లు గుర్తించారు. ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్కు తొలుత నిర్వహించిన ర్యాపిడ్ టెస్ట్లో నెగిటివ్ వచ్చినప్పటికీ, తదుపరి రక్త పరీక్షల్లో పాజిటివ్ అని తేలిందని ఎస్పీ చెప్పారు. ఫామ్హౌస్లో డ్రగ్స్ వినియోగించినట్లు శాస్త్రీయ ఆధారాలు లభించడంతో పోలీసులు కేసు విచారణను వేగవంతం చేశారు.

## ఇరాన్ సుప్రీం లీడర్ మొజ్తబా బ్రతికే ఉన్నాడు.. కానీ కదలలేని స్థితిలో!

- మొదటి పేజి తరువాయి

ఆందోళనలకు దారితీస్తోంది.భారత ప్రభుత్వానికి చెందిన అత్యంత విశ్వసనీయ ఇంటెలిజెన్స్ వర్గాల సమాచారం ప్రకారం... ఫిబ్రవరి 28న ఇరాన్పై అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్తంగా జరిపిన దాడుల్లో అప్పటి సుప్రీం లీడర్, మొజ్తబా తండ్రి అయిన అయతుల్లా అలీ ఖమేనీ మరణించిన విషయం తెలిసిందే. ఇదే దాడుల్లో మొజ్తబా ఖమేనీ తీవ్రంగా గాయపడ్డారు. ఆ గాయాల కారణంగా ఆయన ప్రస్తుతం కదలలేని స్థితిలో ఉన్నారు. దీంతో దేశంలో అస్థిరత ఏర్పడకుండా ఉండేందుకు ఐఆర్జీసీ రంగంలోకి దిగింది. మొజ్తబాతో పరిమిత సంప్రదింపులు జరుపుతూ, ఆయన పేరుతో సందేశాలను, సోషల్ మీడియా పోస్టులను అత్యంత జాగ్రత్తగా రూపొందించి విడుదల చేస్తోంది. దేశంలో అంతా సవ్యంగా ఉందనే భావన కల్పించేందుకే ఐఆర్జీసీ ఈ చర్యలు చేపడుతోందని నివేదిక పేర్కొంది.ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేసిన వ్యాఖ్యలు ఈ నివేదికకు బలాన్నిస్తున్నాయి. ఖమేనీ బ్రతికే ఉన్నారని, కానీ దాడుల్లో తీవ్రంగా గాయపడి రూపురేఖలు మారిపోయి ఉండొచ్చని ట్రంప్ వ్యాఖ్యానించారు. దీనికి తోడు, సుప్రీం లీడర్గా తన సొంత ప్రమాణ స్వీకార కార్యక్రమానికి కూడా మొజ్తబా ఖమేనీ హాజరు కాలేదు. వేదికపై కేవలం ఆయన ఫోటోను మాత్రమే ప్రదర్శించడం ఆయన ఆరోగ్య పరిస్థితిపై నెలకొన్న ఊహాగానాలకు మరింత ఆజ్యం పోసింది.అయితే, ఈ ఆరోపణలను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ తీవ్రంగా ఖండించారు. మొజ్తబా ఖమేనీ పూర్తి ఆరోగ్యంగా ఉన్నారని, ఇవన్నీ అమెరికా సృష్టిస్తున్న అసత్య ప్రచారాలని కొట్టిపారేశారు. కానీ, క్షేత్రస్థాయి పరిస్థితులు, భారత ఇంటెలిజెన్స్ నివేదిక మాత్రం పరిస్థితి తీవ్రంగానే ఉందని సూచిస్తున్నాయి. అమెరికా, ఇజ్రాయెల్తో ఉద్రిక్తతలు కొనసాగుతున్న వేళ, ఇరాన్లో నెలకొన్న ఈ నాయకత్వ సంక్షోభం పశ్చిమాసియా రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. ప్రస్తుతం తాత్కాలికంగా ఐఆర్జీసీయే పాలనా వ్యవహారాలను పర్యవేక్షిస్తున్నట్లు తెలుస్తోంది.

## ఖమ్మం జిల్లాలో దారుణం: HM మందలించిందని.. ఆశ్రమ పాఠశాల విద్యార్థిని ఆత్మహత్య..

ఖమ్మం జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని ముదిగొండ మండలంలో ఉన్న వల్లభి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో ఎచ్ఎం, హాస్టల్ వర్కర్ మందలించారని తొమ్మిదవ తరగతి విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. ఆదివారం ( మార్చి 15 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. ఖమ్మం న్యూ అగ్రహారానికి చెందిన చింతకాయల శ్వేత వల్లభి ప్రభుత్వ బాలికల ఆశ్రమ పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతోంది.ఎచ్ఎం, హాస్టల్ వర్కర్ మందలించడంతో మనస్తాపానికి గురై ఐరన్ టాబ్లెట్లు వేసుకొని ఆత్మహత్య చేసుకుంది శ్వేత.ఈ ఘటనపై సమాచారం అందుకున్న అధికారులు విచారణకు ఆదేశించారు. బాలిక మృతికి కారణమైన ఎచ్ఎం, హాస్టల్ వర్కర్ ను డిస్మిస్ చేసి హత్యాయత్నం కేసు నమోదు చేయలేని ఆదేశించారు. ఈ క్రమంలో బాలిక మృతదేహంతో ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి ముందు ధర్నా చేపట్టారు ఖమ్మం జిల్లా వామపక్ష విద్యార్థి సంఘాలు.


ఫామ్‌హౌస్‌లో హుక్కా పరికరం..


పోలీసులు స్వాధీనపరచుకున్న రివాల్వర్..


ఫామ్‌హౌస్‌లో ఫొటో..

# పెన్ పవర్ తెలంగాణ రౌండప్


ఫామ్‌హౌస్ గేట్..

మాజీ ఎమ్మెల్యేకు చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీపై విశ్వసనీయ సమాచారంతో పోలీసులు నిర్వహించిన దాడిలో సంచలన నిజాలు బట్టబయలు అయ్యాయి.. ఈ ఘటనలో ఓ ఎంపీకి, మాజీ ఎమ్మెల్యేకు డ్రగ్స్ పాజిటివ్ రావడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపుతోంది..

రంగారెడ్డి జిల్లా బ్యూరో, పెన్ పవర్, మార్చి 15:

## డ్రగ్స్ మత్తులో..! రాజకీయ నాయకులు

### ఎంపీకి, మాజీ ఎమ్మెల్యేకి పాజిటివ్..!


మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి.. ఫైల్‌ఫోటో..

- మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో సంచలన నిజాలు బట్టబయలు..
- మాజీ ఎమ్మెల్యే ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీపై ఈగల్ టీమ్ దాడి..
- ఎంపీకి-మాజీ ఎమ్మెల్యేకి డ్రగ్స్ టెస్ట్‌లో పాజిటివ్..ఇప్పుడు దుమారం లేపుతోంది..
- రివాల్వర్, కొకైన్ స్వాధీనం.. మొత్తం 11 మందిని అరెస్ట్ చేసి పరీక్షలు..
- మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎంపీ పుట్టా మహేష్ సహా ఆరుగురికి పాజిటివ్..
- సిమ్లా నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు పోలీసుల అనుమానం..!
- మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు..!
- డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి అనే వ్యక్తి కీలక పాత్ర..!
- శనివారం నెగిటివ్..! ఆదివారం పాజిటివ్..! డ్రగ్స్ పరీక్షలో వ్యత్యాసం..!
- శరీర మెటబాలిజం ప్రభావంతో రిపోర్టులో వ్యత్యాసం రావచ్చన్న అధికారులు..


ఎంపి పుట్టా మహేష్.. ఫైల్‌ఫొటో


హైదరాబాద్ పరిసర ప్రాంతమైన మొయినాబాద్ లోని ఓ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ నగరంలో కలకలం రేపింది.. రాజకీయ నాయకులకు చెందిన ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ పార్టీ జరుగుతోందన్న సమాచారంతో నార్కోటిక్ విభాగం ప్రత్యేక బృందం (తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో) ఈగల్ టీమ్ అధికారులు దాడులు నిర్వహించారు.. ఈ సందర్భంగా డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానిస్తున్న పలువురిని అదుపులోకి తీసుకుని వైద్య పరీక్షలు నిర్వహించారు.. పోలీసుల సమాచారం మేరకు, తాండూరు మాజీ ఎమ్మెల్యే "పైలట్ రోహిత్ రెడ్డి"కి చెందిన ఫామ్‌హౌస్‌లో ఈ డ్రగ్స్ పార్టీ జరిగినట్లు గుర్తించారు.. పార్టీ జరుగుతున్న సమయంలో యువకులు రివాల్వర్‌తో గాల్లో కాల్పులు జరిపినట్లు కూడా పోలీసులు వెల్లడించారు.. సమాచారం అందుకున్న ఈగల్ టీమ్ సోదాలకు వెళ్లగా అక్కడ ఉన్న కొందరు యువకులు వారిని అడ్డుకునేందుకు ప్రయత్నించి హంగామా సృష్టించినట్లు తెలిసింది.. దాడుల సమయంలో అధికారులు రివాల్వర్, కొకైన్‌తో పాటు మరికొన్ని డ్రగ్స్‌ను స్వాధీనం చేసుకున్నారు.. డ్రగ్స్ తీసుకున్నట్లు అనుమానిస్తున్న ఎనిమిది మందిని అదుపులోకి తీసుకుని విచారణ కొనసాగిస్తున్నారు.. ఈ పార్టీలో రాజకీయ నాయకులు, వీఐపీలు కూడా ఉన్నారన్న అనుమానంతో పోలీసులు మరింత లోతుగా విచారణ చేస్తున్నారు..

### ఎంపికి..! శనివారం నెగిటివ్..! ఆదివారం పాజిటివ్..!

ఇదిలా ఉండగా, ఈ కేసులో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌కు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చినట్లు అధికారులు తెలిపారు.. అయితే శనివారం నిర్వహించిన పరీక్షల్లో ఎంపీకి నెగెటివ్ వచ్చినప్పటికీ, ఆదివారం నిర్వహించిన పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్ వచ్చినట్లు ఈగల్ టీమ్ అధికారులు వెల్లడించారు.. శరీర మెటబాలిజం ప్రభావంతో రిపోర్టుల్లో ఈ వ్యత్యాసం రావచ్చని అధికారులు స్పష్టతను ఇచ్చారు.. ఈ ఘటనకు సంబంధించి మొయినాబాద్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు.. డ్రగ్స్ సరఫరా వ్యవహారంలో బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి అనే వ్యక్తి కీలక పాత్ర పోషించినట్లు పోలీసులు గుర్తించారు.. అతడిని అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.. సిమ్లా నుంచి డ్రగ్స్ తెచ్చినట్లు ప్రాథమిక విచారణలో బయటపడింది..

ఈ ఫామ్‌హౌస్ డ్రగ్స్ పార్టీ కేసులో మొత్తం 11 మందికి డ్రగ్స్ పరీక్షలు నిర్వహించగా, మాజీ ఎమ్మెల్యే రోహిత్ రెడ్డి, ఎంపీ పుట్టా మహేష్ సహా ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు రంగారెడ్డి జిల్లా ఎస్పీ వెల్లడించారు. గతంలో కూడా ఇదే ఫామ్‌హౌస్‌లో ఇలాంటి పార్టీలు జరిగాయా అనే కోణంలోనూ పోలీసులు విచారణ కొనసాగిస్తున్నారు.. అధికారుల ప్రకారం, ప్రజాప్రతినిధులు అయినా సరే డ్రగ్స్ వినియోగంపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరిస్తూ విచారణను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు..


ఫామ్‌హౌస్‌లో ముందు పార్క్ చేసిన వాహనాలు..


ఫామ్‌హౌస్..

## విద్యార్థిని అదృశ్యం.. ఆందోళనలో కుటుంబం..


ప్రీతీ కుమారి.. కనిపించకుండా పోయిన యువతి..ఫైల్‌ఫోటో..

- సూరారం పోలీస్ స్టేషన్ పరిధిలో నివాసం మిస్సింగ్ కేసునమోదు..
- దయానంద్ నగర్‌లో కుటుంబంతో నివాసం ఉంటున్న ప్రీతి కుమారి(19)..
- సూరారం కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 10వ తరగతి..
- 10వ తరగతి పరీక్షలకు వెళ్ళిన ప్రీతీ కనిపించకుండా పోయిందని ఫిర్యాదు..
- తమ కూతురు ఆచూకీ కోసం వెతుకుతున్న తండ్రి అభయ స్వామి..

**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 15:** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని సూరారం కాలనీ, దయానంద్ నగర్ ప్రాంతానికి చెందిన 10వ తరగతి విద్యార్థిని గత నాలుగు రోజులుగా కనిపించకపోవడం స్థానికంగా కలకలం రేపుతోంది.. కుటుంబ సభ్యులు, పోలీసుల వివరాల ప్రకారం, ప్రీతి కుమారి (19) అనే యువతి గత నాలుగు రోజుల క్రితం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదని కుటుంబ సభ్యులు తెలిపారు. దీంతో వారు వెంటనే సూరారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.. ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి యువతి కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు. సీసీ కెమెరాల ఫుటేజీ పరిశీలిస్తూ, వివిధ ప్రాంతాల్లో సమాచారం సేకరిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.. తన కుమార్తె కనిపించక పోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.. ఎవరైనా ఈ ఫోటోలో ఉన్న విద్యార్థిని గురించి సమాచారం తెలిసినట్లయితే వెంటనే సూరారం పోలీసులను సంప్రదించాలని వారు కోరుతున్నారు.. ఫోన్ నెంబర్:8712663299-9160374060..

## ఏలూరు ఎంపీ పుట్టా మహేశ్ కు స్టేషన్ బెయిల్ మంజూరు



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 15:** తెలుగు రాష్ట్రాల్లో సంచలనం రేపిన మొయినాబాద్ ఫామ్‌హౌస్ డ్రగ్స్ కేసులో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో పట్టుబడిన టీడీపీ ఎంపీ పుట్టా మహేశ్ యాదవ్‌కు పోలీసులు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు. సోమవారం (మార్చి 16) పార్లమెంట్ సమావేశాలు ఉన్నందున ఆయనకు నోటీసులు ఇచ్చి వదిలేసినట్టు తెలిసింది. ఎంపీ మహేశ్ యాదవ్‌తో పాటు మరో నిందితురాలైన ప్రియాంక రెడ్డికి కూడా స్టేషన్ బెయిల్ లభించినట్లు సమాచారం. మరోవైపు, ఈ కేసు దర్యాప్తును ఈగల్ టీమ్ వేగవంతం చేసింది. మొత్తం 11 మందిపై కేసు నమోదు చేసిన పోలీసులు, వారి నుంచి కీలక వివరాలు రాబడుతున్నారు. ఈ పార్టీకి డ్రగ్స్ ఎక్కడి నుంచి సరఫరా అయ్యాయి, దీని వెనుక ఎవరున్నారు అనే కోణంలో విచారణ కొనసాగుతోంది. ఇదిలా ఉండగా, నిందితులకు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, పుట్టా మహేశ్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ అని తేలినట్లు పోలీసులు తెలిపారు.

01
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
క్లాసీఫైడ్ యాడ్స్
కేవలం
యాడ్ 100/-కే
' ఐదు రోజులకు '
'4 సెం.మీ 4 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## రైతులకు ప్రభుత్వం గుడ్ న్యూస్.. మార్చి 22న రైతు భరోసా నిధుల విడుదల




**హైదరాబాద్ పెన్ పవర్:** ఉగాది పండగ వేళ రాష్ట్ర రైతాంగానికి రేవంత్ రెడ్డి సర్కార్ గుడ్ న్యూస్ చెప్పింది. 2026, మార్చి 22న ఈ సీజన్ రైతు భరోసా తొలి విడత నిధులు విడుదల చేయనున్నట్లు తెలిపింది. సిద్దిపేట జిల్లా నర్మెట్టలో సీఎం రేవంత్ రెడ్డి తొలి విడత నిధులను విడుదల చేయనున్నారు. తొలి విడతలో భాగంగా ఎకరం లోపు భూమి ఉన్న రైతుల ఖతాల్లో నిధులు జమ చేయనున్నారు.

ఫస్ట్ ఫేజ్‌లో రూ.3,590 కోట్ల నిధులు విడుదల చేయనుండగా 70 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరనుంది. తొలి విడత నిధులు విడుదల చేసిన 20 రోజుల తర్వాత సెకండ్ ఫేజ్ నిధులు రిలీజ్ చేయనున్నారు. రెండో విడతలో భాగంగా రూ.2,650 కోట్లు రైతుల ఖాతాల్లో జమ వేయనున్నారు. ఏప్రిల్ నెలాఖరులోపు మూడో విడత నిధులు విడుదల చేయనున్నారు. మొత్తం మూడు విడతల్లో రూ.9 వేల కోట్ల నిధులు రైతుల ఖాతాల్లో ప్రభుత్వం జమ చేయనుంది. కాగా, రైతు భరోసా పథకం కింద ఎకరాకు ఏడాదికి రూ.12 వేల చొప్పున ప్రభుత్వం రైతులకు ఆర్థిక సహాయం చేస్తోన్న విషయం తెలిసిందే. పంట పెట్టుబడి సహాయం కింద ప్రభుత్వం రైతుల ఖాతాల్లో ప్రత్యక్ష నగదు బదిలీ చేస్తోంది.





# అంబీర్ చెరువు దుస్థితిపై ప్రజల ఆగ్రహం

## చెరువుల అభివృద్ధికి రూ.300 కోట్లు డిమాండ్..
## ఆకుల సతీష్ ఆధ్వర్యంలో నిరసన..



**కుత్బుల్లాపూర్, పెన్ పవర్, మార్చి 15:** నిజాంపేట్ సర్కిల్ పరిధిలోని అంబీర్ చెరువు పరిశుభ్రత, అభివృద్ధి కోసం ప్రభుత్వం తక్షణమే నిధులు కేటాయించాలని ఆకుల సతీష్ డిమాండ్ చేశారు. ప్రగతి నగర్ అంబీర్ చెరువు బతుకమ్మ ఘాట్ వద్ద స్థానిక పౌరులతో కలిసి నిరసన కార్యక్రమం నిర్వహించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అంబీర్ చెరువులోకి మురికి నీరు చేరకుండా చర్యలు తీసుకోవడంతో పాటు గుర్రపు డెక్క తొలగించి, సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ) ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే వాకింగ్ ట్రాక్ నిర్మాణం, దోమల నివారణ చర్యలు చేపట్టాలని తెలిపారు.. 2016కు ముందు ప్రగతి నగర్ పాలకులు ఇంటికి రూ.500 వసూలు చేసినప్పటికీ చెరువుల అభివృద్ధిని నిర్లక్ష్యం చేశారని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వం రెండుసార్లు అధికారంలో ఉన్నప్పటికీ 2016లో ఇచ్చిన అభివృద్ధి హామీలు అమలు కాలేదని పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే మూడు సార్లు గెలిచినా చెరువుల అభివృద్ధిపై చిత్తశుద్ధి చూపలేదని ఆరోపించారు.. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంబీర్ చెరువు అభివృద్ధికి రూ.150 కోట్లు, నిజాంపేట్ తుర్కచెరువు, పాపయ్య కుంట,
బాచుపల్లి పత్తికుంట, మేడికుంట, పెద్ద చెరువు అభివృద్ధికి మరో రూ.150 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ప్రతి నెలా ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసనలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, ప్రసాద్, అరుణ్, మురళి, ఈశ్వర్ రెడ్డి, మాధవరావు, చందు, హనుమయ్య, అంకం సతీష్, ఎల్ల స్వామి, కృష్ణ, శ్రీధర్, పాండు, రంగనాయకులు, శ్రీనివాస్, ప్రవీణ్, కళ్యాణ్, వెంకటేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు

# నేరాల నియంత్రణకు..!
## స్నేహ ఫార్మ్స్ సామాజిక బాధ్యత..!

### దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు లక్షన్నర విలువైన సీసీ కెమెరాలు విరాళం..

- సుమారు రూ.1.5 లక్షల విలువైన 20 సీసీ కెమెరాలు అందజేత..
- పాడైన కెమెరాల స్థానంలో, కొత్త ప్రాంతాల్లోనూ ఏర్పాటు..
- దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ పి.సతీష్ కుమార్, ఎస్సై రామ్మోహన్ రెడ్డికి అందజేత..



దుండిగల్ పోలీస్ స్టేషన్‌లో ఇన్‌స్పెక్టర్ సతీష్‌కు సీసీకెమెరాలు అందజేస్తున్న స్నేహా ఫార్మ్స్..

**దుండిగల్, పెన్ పవర్, మార్చి 15:** ప్రజల భద్రతను మరింత బలోపేతం చేయడానికి కార్పొరేట్ సంస్థలు కూడా ముందుకు వస్తున్నాయి.. ఇందులో భాగంగా స్నేహ ఫార్మ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు సీసీ కెమెరాలను విరాళంగా అందించింది.. సంస్థ ప్రతినిధులు దుండిగల్ పోలీస్ స్టేషన్‌కు సుమారు రూ.1.5 లక్షలు విలువైన 20 సీసీ కెమెరాలను అందజేశారు.. ఈ కెమెరాలను దుండిగల్ పరిధిలో ఇప్పటికే పాడైపోయిన కెమెరాల స్థానంలో అమర్చడంతో పాటు, అవసరమైన కొత్త ప్రాంతాల్లో కూడా ఏర్పాటు చేయనున్నట్లు పోలీసులు తెలిపారు.. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు కెమెరాలను దుండిగల్ ఎస్‌హెచ్‌ఓ పి.సతీష్ కుమార్, ఎస్సై రామ్మోహన్ రెడ్డిలకు అందజేశారు. ప్రజల భద్రత కోసం సాంకేతిక పరికరాలు ఎంతగానో ఉపయోగపడతాయని, నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని
పోలీసులు తెలిపారు.. ఇలాంటి సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చిన స్నేహ ఫార్మ్స్ సంస్థ ప్రతినిధులను ఇన్‌స్పెక్టర్ పి.సతీష్ అభినందించారు.. నేరాల నియంత్రణకు తమవంతుగా చేసిన సీసీకెమారాల విరాళానికి పోలీసులు కృతజ్ఞతలు తెలిపారు.. స్థానిక ప్రజలు, వ్యాపార సంస్థలు కూడా పోలీసులకు సహకరించి భద్రతా చర్యలను బలోపేతం చేయాలని వారు సూచించారు..

# జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపణలను ఖండించిన హైడ్రా



**హైదరాబాద్ పెన్ పవర్:** జాగృతి అధ్యక్షురాలు కవిత ఆరోపణలను హైడ్రా ఖండించింది. మూసీ పక్కన నిర్మిస్తున్న ఆదిత్య బిల్డర్స్ ప్రాజెక్టు విషయంలో హైకోర్టు అనుమతులు ఉన్నప్పటికీ మరోసారి వాస్తవాలు నిర్ధారించుకోవాలనే ఉద్దేశంతోనే తహశీల్దార్‌కు లేఖ రాసినట్టు స్పష్టం చేసింది. శాటిలైట్ చిత్రాల్లో నది గర్భంలోకి వెళ్లి ప్రహరీ నిర్మిస్తున్నట్టు అనుమానం రావడంతోనే రెవెన్యూ అధికారులను వివరణ కోరామని తెలిపింది హైడ్రా. ఆదిత్య బిల్డర్స్?కి నిర్మాణ అనుమతులు గత ప్రభుత్వ హయంలోనే ఇచ్చారని హైడ్రా క్లారిటీ ఇచ్చింది. ఈ విషయాన్ని ఇప్పటికే ఒకసారి వివరించామని, అయినప్పటికీ మరోసారి స్పష్టత ఇస్తున్నట్టు పేర్కొంది హైడ్రా.అంతకుముందు హైడ్రా కమిషనర్ రంగనాథ్?పై కవిత సీరయస్ అయిన విషయం తెలిసిందే. తన ధర్నాపై హైడ్రా తప్పుడు ప్రచారం చేస్తోందని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. కమిషనర్ రంగనాథ్?ను కోర్టుకు ఈడుస్తానని హెచ్చరించారు.

# కేటీఆర్ డ్రగ్స్ టెస్ట్‌కు సిద్ధమా?
# టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సవాల్

- మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో డ్రగ్స్ కలకలం
- బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి డ్రగ్స్ టెస్టులో పాజిటివ్
- ఇందులో ఎలాంటి రాజకీయం లేదన్న మహేశ్ గౌడ్
- డ్రగ్స్ రహిత సమాజం కోసమే ఈగల్ స్క్వాడ్ దాడులు చేస్తోందని వెల్లడి
- కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయంటూ వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్ ఫామ్‌హౌస్‌లో వెలుగుచూసిన డ్రగ్స్ కేసు వ్యవహారం తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపుతోంది. ఈ కేసుపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఆయన బృందం సమాధానం చెప్పాలని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ డిమాండ్ చేశారు. మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, డ్రగ్స్ రహిత సమాజం కోసమే 'ఈగల్' బృందం దాడులు చేస్తోందని, ఇందులో ఎలాంటి రాజకీయం లేదని స్పష్టం చేశారు. "కేటీఆర్, ఆయన అనుచరులు డ్రగ్స్ తీసుకుంటున్నట్లు అనుమానాలు ఉన్నాయి. అవసరమైతే డ్రగ్స్ పరీక్షలకు కేటీఆర్ సిద్ధం కావాలి. అసెంబ్లీ సమావేశాల సమయంలో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలందరం పరీక్షలు చేయించుకుందాం" అని ఆయన సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డ్రగ్స్ రహిత తెలంగాణ కోసం కృషి చేస్తున్నారని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రంలో డ్రగ్స్ సంస్కృతి పెరిగిపోయిందని ఆరోపించారు.

## తెలంగాణ ప్రజల తరపున విజ్ఞప్తి చేస్తున్నా..
# ఈ సారైనా కేసీఆర్ అసెంబ్లీకి రావాలి



**హైదరాబాద్ పెన్ పవర్:** ప్రతిపక్ష నేత కేసీఆర్ ఈసారైనా అసెంబ్లీకి రావాలని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. ఆదివారం (మార్చి 15) సంగారెడ్డి జిల్లాలో కోమటిరెడ్డి మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల తరపున కేసీఆర్? ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా.. ఆయన అసెంబ్లీ సమావేశాలకు వచ్చి ప్రభుత్వానికి సలహాలు, సూచనలు ఇవ్వాలన్నారు. గత అసెంబ్లీ సమావేశాల్లో కేసీఆర్ ఇలా వచ్చి అలా వెళ్లిపోయారని.. ఆయన ఈసారైనా అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామన్నారు.పక్క రాష్ట్రం ఆంధ్రప్రదేశ్?లో వైసీపీకి 11 సీట్లు వచ్చాయని.. దీంతో వారికి ప్రతిపక్ష హోదా దక్కలేదన్నారు. కానీ మేం మీకు ప్రతిపక్ష హోదా ఇచ్చామని అన్నారు. సభకు వచ్చి కేసీఆర్ ఇచ్చే సలహాలు, సూచనలు స్వీకరిస్తామని చెప్పారు. మా ప్రభుత్వం చేస్తోన్న మంచి పనులు కేసీఆర్ చెబితే ఆయనకే గౌరవం పెరుగుతోందని అన్నారు. ఇక, మూసీపై కేటీఆర్ ఇచ్చిన ప్రజెంటేషన్ చూస్తే నవ్వు వస్తోందన్నారు. మూసీతో నల్గొండ ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని.. ఫ్లోరైడ్ సమస్యతో ఇన్ని ఇబ్బందులు పడ్డామో నల్గొండ ప్రజలకు తెలుసని చురకలంటించారు. ఆనాడు కేసీఆర్ ఇచ్చిన దొడ్డు బియ్యం ఎవ్వరు తినలేదుని.. రేషన్ డీలర్లకే వాటిని అమ్ముకున్నారని విమర్శించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో తెల్ల రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికి సన్న బియ్యం ఇస్తున్నామని చెప్పారు.

# బీసీ డిక్లరేషన్‌కు అతిగతి లేకుండా పోయింది: హరీశ్ రావు

**హైదరాబాద్ పెన్ పవర్:** ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చిన రేవంత్ రెడ్డి అధికారంలోకి వచ్చాక అన్ని వర్గాలను మోసం చేసినట్లే, బీసీలకు ద్రోహం చేశాడని మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన బీసీ డిక్లరేషన్?కు అతిగతి లేకుండా పోయిందన్నారు. ఏటా 20 వేల కోట్ల చొప్పున 5 ఏళ్లలో లక్ష కోట్లు బీసీల కోసం ఖర్చు చేస్తామని మాట తప్పారన్నారని, బడ్జెట్?లో నిధులు కేటాయించకపోవడం వల్ల బీసీ వర్గాల ప్రజల అభివృద్ధి ప్రశ్నార్థకంగా మారిందన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసిన ఆయన.. స్థానిక సంస్థల్లో బీసీలకు హామీ ఇచ్చిన రిజర్వేషన్లపై కూడా ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదని, రేవంత్ రెడ్డి బీసీలను కేవలం ఓటు బ్యాంక్‌గా మాత్రమే చూస్తున్నారని మండిపడ్డారు.

**సంక్షేమం మాటల్లోనే:** బీసీ సంక్షేమం మాటల్లోనే తప్ప పనుల్లో కనిపించడం లేదనీ, రాబోయే బడ్జెట్?లో పెద్ద ఎత్తున నిధులు కేటాయించాలని సూచించారు. కాంగ్రెస్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు మోసపోయారని, వారంతా ఇప్పుడు తిరగబడే కాలం వచ్చిందన్నారు. అసెంబ్లీ సమావేశంలో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడాతామన్నారు. కాగా రేపటి నుంచి తెలంగాణ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల కోసం అధికార, ప్రతిపక్షాలు సిద్ధం అవుతున్నాయి.



02
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
శుభాకాంక్షలు యాడ్స్
కేవలం
యాడ్ 300/-
'పోస్టుకార్డు సైజు '
'పో. 12 సెం.మీ, వె.16 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఆర్యాన్ష్ వైద్యం కోసం కేంద్ర ప్రభుత్వ సాయం కోరతా...



**హైదరాబాద్ పెన్ పవర్:** స్పైనల్ మస్క్యులార్ ఆట్రోఫీ (ఎస్ఎంఏ) టైప్-2 వ్యాధితో బాధపడుతున్న ఘట్కేసర్ కు చెందిన ఆర్యాన్ష్ (2) వైద్య చికిత్స కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం కోరతానని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. ఆదివారం ఆర్యాన్ష్ తల్లిదండ్రులు ఘట్కేసర్ మాజీ ఎంపీపీ ఏనుగు సుదర్శన్ రెడ్డి ఆధ్వర్యంలో ఎంపీ ఈటల రాజేందర్ ను ఆయన నివాసంలో కలిశారు. ఆర్యాన్ష్ బాధపడుతున్న ఎస్ఎంఏ టైప్-2 వ్యాధి గురించి వివరించారు. ఇలాంటి ప్రాణాంతకమైన వ్యాధి చికిత్స రూ.కోట్లతో కూడుకోవడం బాధాకరమని, ఇదే వ్యాధి ఆంధ్రప్రదేశ్ లోని పునర్విక అనే చిన్నారికి వస్తే ప్రజలే విరివిగా విరాళాలు ఇచ్చి ఆ చిన్నారి ప్రాణాలు కాపాడిన దేవుళ్ళు అయ్యారని ఎంపీ ఈటల అన్నారు. ఆర్థిక సాయం కోసం రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాస్తానని, తన వంతుగా కూడా ఆర్థిక సాయం అందజేస్తానని అన్నారు. రాష్ట్ర ప్రజలు ఆర్యాన్ష్ కోసం విరాళాలు అందించడానికి ముందుకు రావాలని ఆయన కోరారు.

## రాను బొంబాయికి రాను.. మల్లారెడ్డి కోడలు మాస్ డ్యాన్స్ వైరల్!



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే మల్లారెడ్డి ఇంట్లో సంబరాలు అంబరాన్నంటాయి. మల్లారెడ్డి - కల్పనమ్మల 50వ వివాహ వార్షికోత్సవ (+శీశ్రీఎవఅ జీబఎఅశ్రీవవ) వేడుకలు బోయిన్‌పల్లిలోని ఆయన నివాసంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఈ వేడుకల్లో మల్లారెడ్డి కోడలు డాక్టర్ ప్రీతి రెడ్డి తన డ్యాన్స్‌తో మరోసారి అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రముఖ తెలంగాణ జానపదం 'రాను బొంబాయికి రాను' పాటకు ప్రీతి రెడ్డి అద్భుతమైన డ్యాన్స్ చేశారు. చీరకట్టులో ఉత్సాహంగా, ఒక కాలేజీ అమ్మాయిలా ఆమె వేసిన మాస్ స్టెప్పులు అతిథులను కట్టిపడేశాయి. దీనికి సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతోంది. నెటిజన్లు ఆమె డ్యాన్స్‌పై ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు.

**తగ్గేదేలే అన్న మల్లారెడ్డి!**

కోడలితో పాటు మామ మల్లారెడ్డి కూడా డ్యాన్స్‌లో ఏమాత్రం తగ్గలేదు. 70 ఏళ్ల వయసులోనూ అదే ఉత్సాహంతో బాలీవుడ్ హీరో రణ్‌వీర్ సింగ్ నటించిన 'దురంధర్' పాటకు ఆయన స్టెప్పులేశారు. కుర్రాళ్లకు పోటీ ఇచ్చేలా ఆయన చేసిన డ్యాన్స్ చూసి వేడుకకు హాజరైన రాజకీయ ప్రముఖులు, కుటుంబ సభ్యులు కేరింతలు కొట్టారు.

## రోహిత్ రెడ్డి ఫామ్‌హౌజ్ అక్రమాలకు అడ్డా.. తాండూరు ఎమ్మెల్యే కీలక వ్యాఖ్యలు

**హైదరాబాద్ పెన్ పవర్:** రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ ఫామ్‌హౌజ్ డ్రగ్స్ పార్టీపై తాండూరు ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి స్పందించారు. ఆదివారం ఉదయం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'పైలట్ రోహిత్ రెడ్డిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. మొయినాబాద్‌లోని ఆయన ఫామ్‌హౌజ్ అక్రమాలకు అడ్డాగా మారింది. అందుకే మొన్నటి ఎన్నికల్లో రోహిత్ రెడ్డిని ప్రజలు తరిమికొట్టారు. రోహిత్ రెడ్డిని బీఆర్ఎస్ పార్టీ సస్పెండ్ చేస్తుందో.. లేదో చూడాలి. తాము తెలంగాణను డ్రగ్స్ రహిత రాష్ట్రంగా మార్చాలనుకుంటున్నాం. ఈ కేసును ఇంతటితో వదిలిపెట్టం. డ్రగ్స్ తీసుకున్న అందరినీ కఠినంగా శిక్షిస్తాం. రాష్ట్రంలో బీఆర్ఎస్ డ్రగ్స్‌ను ప్రోత్సహిస్తోంది' అని మనోహర్ రెడ్డి కీలక వ్యాఖ్యలు చేశారు. కాగా, ఈ డ్రగ్స్ పార్టీలో మొత్తం 11 మంది ఉన్నారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, నవీద్ మిశ్రా, రితేష్ రెడ్డి సహా పలువురు వ్యాపారవేత్తలు, ఒక మహిళ పోలీసులకు చిక్కారు. ప్రాథమిక పరీక్షల్లో రోహిత్ రెడ్డి, నవీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి, ఎంపీ పుట్టా మహేష్‌లకు పాజిటివ్ అని తేలింది. ఓ వైపు ప్రభుత్వాలు డ్రగ్స్ వ్యతిరేక పోరాటాలు చేస్తుంటే.. ప్రజా ప్రతినిధులే డ్రగ్స్ తీసుకోవటం పట్ల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# అమిత్ షా వ్యూహం.. ఆపరేషన్ కగార్ ఫలితం: ప్రపంచానికి చాటిచెప్పాలని నిర్ణయం!

**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో దశాబ్దాల కాలంగా అంతర్గత భద్రతకు పెను సవాలుగా మారిన మావోయిజాన్ని పూర్తిగా అణచివేసినట్టు చాటిచెప్పేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోంది. ఈనెల 31 తర్వాత ఏ రోజైనా అత్యంత ప్రతిష్టాత్మకంగా 'మావోయిస్టు ముక్త్ భారత్' సభను నిర్వహించాలని కేంద్ర హోం శాఖ యోచిస్తోంది. సభకు ప్రధాని మోడీని ముఖ్య అతిథిగా ఆహ్వానించాలని చూస్తోంది. ఈ భారీ బహిరంగ సభ ద్వారా భారత్ సాధించిన ఈ చారిత్రాత్మక విజయాన్ని అంతర్జాతీయ సమాజానికి వివరించడమే లక్ష్యంగా మోడీ నాయకత్వంలోని బీజేపీ ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నది. ఈ సభలో ఇప్పటివరకు లొంగిపోయిన 3 వేలకు పైబడిన మాజీ మావోయిస్టులను, ప్రభుత్వానికి వారు అప్పగించిన వందలాది అత్యాధునిక ఆయుధాలను అంతర్జాతీయ మీడియా ప్రతినిధుల సమక్షంలో ప్రదర్శనకు ఉంచాలని కేంద్రం భావిస్తోంది. ఈ కార్యక్రమాన్ని దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహించాలా? లేక మావోయిస్టులకు కంచుకోటగా ఉండి ప్రస్తుతం ప్రశాంతంగా మారిన ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ లేదా బస్తర్ హెడ్ క్వార్టర్ అయిన జగదల్‌పూర్‌లో నిర్వహించాలా? అనే అంశంపై కసరత్తు జరుగుతోంది.

**అమిత్ షా వ్యూహం.. ఆపరేషన్ కగార్ ఫలితం..**

కేంద్ర హోం మంత్రి అమిత్ షా నేతృత్వంలో రచించిన కఠిన వ్యూహాలు మావోయిస్టు మూలాలను దెబ్బతీశాయి. 2024 జనవరిలో 'ఆపరేషన్ కగార్' ప్రారంభమైనప్పుడు 2025 చివరికల్లా బస్తర్, ప్రత్యేకించి అబూజ్‌మాడ్ ప్రాంతాల నుంచి మావోయిస్టులను పారదోలాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే మారిన పరిస్థితుల నేపథ్యంలో ఈ గడువును 2026 మార్చి 31 వరకు పొడిగించారు. 2025 మే నాటికి మావోయిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి బసవరాజుతో పాటు పలువురు కేంద్ర కమిటీ సభ్యులు, కీలక కమాండర్లు భద్రతా బలగాల దాడుల్లో మరణించడమో లేక లొంగిపోవడమో జరిగిన పరిస్థితుల్లో 'మావోయిస్టు ముక్త్ బస్తర్' లక్ష్యం కాస్తా 'మావోయిస్టు ముక్త్ భారత్'గా మారింది.

కగార్‌లో భాగంగా ఆ తర్వాత భద్రతా బలగాలు తమ కూంబింగ్‌ను,



చుట్టివేత దాడులను మరింత తీవ్రం చేసి మరిన్ని విజయాలు సాధించాయి. ఈ మార్చి 12 నాటి గణాంకాల ప్రకారం.. మావోయిస్టు పార్టీ నిర్మాణాలు, సైనిక విభాగాలు దాదాపుగా తుడిచి పెట్టుకుపోయాయి. పార్టీ పొలిట్ బ్యూరో సభ్యులు, కేంద్ర, రాష్ట్ర, జిల్లా స్థాయి కమిటీల సభ్యులు, బెటాలియన్, కంపెనీ, ప్లాటూన్ కమాండర్లు అనేక మంది మరణించడమో లేక లొంగిపోవడమో జరిగింది.

**రాజకీయ ప్రాధాన్యత..**

గతంలో 2009లో అప్పటి ప్రధాని మన్మోహన్ సింగ్ వామపక్ష తీవ్రవాదాన్ని దేశ భద్రతకు అతిపెద్ద ముప్పుగా అభివర్ణించారు. ఆ సమయంలో నిర్వహించిన ఆపరేషన్ గ్రీన్ హంట్ వంటివి ఆశించిన ఫలితాలను ఇవ్వలేదు. అయితే కాంగ్రెస్ హయాంలో సాధ్యం కాని పనిని తాము సాధించామని చెప్పుకోవడం బీజేపీకి ఇప్పుడు రాజకీయంగా కలిసివచ్చే అంశం. ఇప్పటివరకు లొంగుబాటు కార్యక్రమాలన్నీ ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు, డీజీపీలు, కింది స్థాయి అధికారుల సమక్షంలోనే జరిగాయి. ఆ క్రెడిట్ అంతా రాష్ట్రాలకే దక్కింది. ఇప్పుడు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సమక్షంలో లేదంటే హోం మంత్రి అమిత్ షా సమక్షంలో దేశస్థాయిలో ఈ భారీ కార్యక్రమం నిర్వహించడం ద్వారా, అంతర్గత భద్రత విషయంలో కేంద్రం సాధించిన విజయాన్ని ప్రపంచవ్యాప్తంగా చాటిచెప్పాలని మోదీ ప్రభుత్వం భావిస్తోంది.

# నేటి నుంచే అసెంబ్లీ.. డిప్యూటీ స్పీకర్ ఎన్నిక లేనట్టే?

**హైదరాబాద్ పెన్ పవర్:** రాష్ట్ర అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు రేపు ప్రారంభం కానున్నాయి. నెలాఖరు దాకా ఈ సెషన్ జరిగే అవకాశాలు ఉన్నాయి. మొదటి రోజు గవర్నర్ ప్రసంగంతో సభ షురూ కానుంది. ఈనెల 20న ఆర్థికశాఖ మంత్రి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క రాష్ట్ర బడ్జెట్ ను అసెంబ్లీలో ప్రవేశపెట్టనున్నారు. కాగా, ఈ దఫాలో అనేక అంశాలపైన ప్రతిపక్షాలు సంధించే ప్రశ్నలు, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న?అనేక వివాదాస్పద అంశాలపైనా ప్రజలకు స్పష్టత ఇచ్చేందుకు అధికార కాంగ్రెస్ పార్టీ సిద్ధమవుతున్నది. తాజాగా, ఇరాన్ తో ఇజ్రాయెల్, అమెరికా యుద్ధం కారణంగా తలెత్తిన అనేక సమస్యల్లో ప్రధానంగా వంటగ్యాస్, పెట్రోల్ వంటి అంశాలు తీవ్రంగా ఉన్నాయి. వీటిపై ఇప్పటికే ప్రభుత్వం స్పష్టత ఇస్తున్నది. అయితే అసెంబ్లీలో ప్రతిపక్షాల ప్రశ్నలు, సర్కారు విధానాన్ని ప్రజలకు తెలిపేలా సభలో కాంగ్రెస్ సభ్యులు మాట్లాడతారని పార్టీవర్గాలు చెబుతున్నాయి.

**చర్చకొచ్చే అంశాలివే?**

ఇటీవల గోదావరి జలాల అంశంపై కాంగ్రెస్, విపక్ష బీఆర్ఎస్, బీజేపీ మధ్య మాటలయుద్ధం చోటుచేసుకున్నది. ఏపీ ప్రభుత్వం గోదావరి నదీపైన చేపడుతున్న ప్రాజెక్టులపైన ప్రభుత్వం, అధికారపార్టీ తరపున వివరణ ఇవ్వనున్నట్టు తెలిసింది. గతంలో అసెంబ్లీలో కృష్ణా నదీజలాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. గోదావరి జలాలపైన మరింత స్పష్టత కోసం సభలో చర్చించే అవకాశాలు ఉన్నాయి. ఇక సింగరేణిలో నైనీకోల్ బ్లాక్ అంశంపై ఇటీవల వివాదం చెలరేగి రాజకీయ దుమారానికి దారితీసింది. దీంతో గనుల టెండర్లపై అవినీతి ఆరోపణలు తదితర అంశాలు అసెంబ్లీలో చర్చకొచ్చే అవకాశాలు ఉన్నాయి. దీనిపైనా తమ ఎమ్మెల్యేలు సమాధానాలు ఇచ్చేలా మాట్లాడతారని కాంగ్రెస్ వర్గాలు తెలిపాయి.

**'మూసీ'పై పొలిటికల్ వార్**

మూసీ ప్రక్షాళన, సరోవర్ ప్రాజెక్టు వంటి అంశాలు కూడా ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో అధికార, ప్రతిపక్ష బీఆర్ఎస్, బీజేపీల మధ్య పొలిటికల్ వార్ నడుస్తున్నది. దీనిపైనా సభలో చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది. ఖమ్మంలో భూదాన్ భూముల అంశం సైతం హాట్ టాపిక్ గా మారింది.




ఇది కూడా అసెంబ్లీలో చర్చకు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. దీనిపైనా విపక్షాల ఆరోపణలు, విమర్శలకు కౌంటర్ ఇచ్చేందుకు తమ సభ్యులు ప్రిపేరవుతున్నారని అధికారపార్టీ వర్గాలు తెలిపాయి. అసెంబ్లీ సమావేశాల్లో చర్చకు వచ్చే అన్ని అంశాలపైనా ధీటుగా మాట్లాడేందుకు, ఆయా అంశాలపైనా ప్రజల్లో నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసేలా కాంగ్రెస్ నుంచి స్పష్టతను ఇచ్చే ప్రసంగాలు ఉంటాయని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

**డిప్యూటీ స్పీకర్ ఎన్నిక లేనట్టే?**

అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ గా డోర్నకల్ కాంగ్రెస్ ఎమ్మెల్యే రాంచందర్ నాయక్ పేరును పార్టీ అధిష్టానం గతేడాది జూన్ లో ప్రకటించింది. ఆయన ప్రస్తుతం విప్ గా కొనసాగుతున్నారు. రాంచందర్ నాయక్ పేరు ఖరారైనా అధికారికంగా ఉపసభాపతి ఎన్నిక ప్రక్రియ చేపట్టాల్సి ఉంది. అయితే ప్రతి సమావేశంలోనూ ఈ నియామకానికి బ్రేక్ లు పడుతూ వస్తోంది. కాగా, ఈ బడ్జెట్ సమావేశాల్లోనూ డిప్యూటీ స్పీకర్ ఎన్నికపైనా స్పష్టత లేదు. డిప్యూటీ స్పీకర్ ఎన్నికకు ముందు నోటిఫికేషన్ ఇచ్చి ఎలక్షన్ జరిపించాల్సి ఉంటుంది. గత అసెంబ్లీ సమావేశాల్లో సమయం లేకపోవడంతో ఎన్నికను నిర్వహించలేదని ప్రభుత్వ వర్గాలు చెప్పాయి. అయితే రాంచందర్ నాయక్ సైతం మంత్రివర్గ విస్తరణ జరిగితే తనకు మంత్రిపదవి ఇవ్వాలని అధిష్టానాన్ని కోరుతున్నట్టు సమాచారం. దీనితో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక జాప్యానికి అది కూడా ఓ కారణమన్న ప్రచారం రాజకీయ వర్గాల్లో ఉంది. మంత్రివర్గ విస్తరణపైనా ఇప్పటివరకు ఎలాంటి క్లారిటీ లేకపోవడంతో ఈ సమావేశాల్లో డిప్యూటీ స్పీకర్ ఎన్నిక ఉండొచ్చనే ఊహాగానాలు వినిపిస్తున్నాయి. డిప్యూటీ స్పీకర్ ఎన్నికపై బీఆర్ఎస్ సైతం విమర్శలు ఎక్కుపెడుతున్నది. అసెంబ్లీలోని ప్రివిలేజ్ కమిటీకి డిప్యూటీ స్పీకరే చైర్మన్‌గా వ్యవహరిస్తారని, ఆ పదవి ఖాళీగా ఉండటం సరికాదని బీఆర్ఎస్ నేతలు గతంలో విమర్శలు గుప్పించారు. ఈ పరంపరలో అధికార కాంగ్రెస్ మదిలో ఏమున్నదో తెలియాల్సి ఉంది.

# డ్రగ్స్ కేసులో ప్రజాప్రతినిధులు.. తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్న ప్రజలు



**హైదరాబాద్ పెన్ పవర్:** హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లో ఒక మాజీ ఎమ్మెల్యేకు చెందిన ఫామ్‌హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ ఉదంతం ప్రస్తుతం తెలుగు రాష్ట్రాల్లో పెను దుమారం రేపుతోంది. పోలీసుల నిఘా విభాగం మరియు ఈగల్ బృందం నిర్వహించిన ఆకస్మిక దాడుల్లో సుమారు 2 గ్రాముల కొకైన్ పట్టుబడటమే కాకుండా, పార్టీ జరుగుతున్న సమయంలో గాల్లోకి మూడు రౌండ్లు కాల్పులు జరగడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ప్రాథమిక విచారణలో భాగంగా నిర్వహించిన డ్రగ్స్ పరీక్షల్లో ఆరుగురికి పాజిటివ్ వచ్చినట్లు నిర్ధారణ కాగా, అందులో తెలంగాణ, ఏపీకి చెందిన కీలక రాజకీయ నాయకులు, ప్రముఖ వ్యాపారవేత్తలు ఉండటం సామాన్యులను దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. బెంగళూరుకు చెందిన డ్రగ్ పెడ్లర్ కౌశిక్ రవిని అదుపులోకి తీసుకున్న పోలీసులు, ఈ నెట్‌వర్క్ వెనుక ఉన్న లోతైన మూలాలను అన్వేషిస్తున్నారు. ముఖ్యంగా నిందితుడు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి సన్నిహితుడని ఒప్పుకోవడంతో, ఈ కేసు చుట్టూ ఉన్న రాజకీయ ఉచ్చు మరింత బిగుస్తోంది.

**ప్రజాప్రతినిధుల నైతికతపై ప్రశ్నలు**

ఈ కేసులో, బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పేర్లు ప్రముఖంగా వినిపించడం రాజకీయ రణరంగాన్ని వేడెక్కించింది. మహేష్ కు నిర్వహించిన డ్రగ్స్ పరీక్షలో పాజిటివ్ వచ్చిందన్న వార్తలతో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల వంటి నేతలు రంగంలోకి దిగి, తక్షణమే ఆయన రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఇక తెలంగాణలో గులాబీ పార్టీ అగ్రనేతలపై సైతం విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రజాప్రతినిధులుగా ఉంటూ ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన వారే ఇటువంటి అసాంఘిక కార్యకలాపాల్లో పాల్గొనడంపై ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. అటు తెలంగాణలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీజేపీ ఎంపీ రఘునందన్ రావు వంటి నాయకులు కూడా ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తూ, పార్టీలకు అతీతంగా అందరూ ప్రజాప్రతినిధులు డ్రగ్స్ పరీక్షలు చేయించుకోవాలని సవాలు విసురుతున్నారు. యువతను తప్పుదోవ పట్టించేలా ప్రవర్తిస్తున్న నాయకులను కఠినంగా శిక్షించాలనే డిమాండ్ సోషల్ మీడియా వేదికగా డిమాండ్స్ వినిపిస్తున్నాయి.

**దర్యాప్తు గోప్యత.. ప్రజల ఆగ్రహం**

మొయినాబాద్ ఘటన కేవలం ఒక నేరపూరిత ఉదంతంగానే కాకుండా, సమాజంపై, ముఖ్యంగా యువతపై పడే ప్రభావం పట్ల తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. తమను నడిపించాల్సిన నాయకులే మత్తు పదార్థాలకు బానిసలైతే, దేశ భవిష్యత్తు ఏమవుతుందనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. మరోవైపు పోలీసులు అరెస్టయిన వారి పూర్తి వివరాలను, ఫొటోలను అధికారికంగా బయటపెట్టకపోవడంపై కూడా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సామాన్య పౌరుల విషయంలో చురుగ్గా వ్యవహరించే చట్టం, రాజకీయ ప్రముఖుల విషయంలో ఎందుకు వెనకాడుతోందని పౌర సమాజం నిలదీస్తోంది. రాజకీయ కక్షసాధింపు చర్యలని కొందరు ఆరోపిస్తున్నప్పటికీ, సిసిటివి ఫుటేజీ, ఈగల్ టీమ్ ఫలితాలు ఈ కేసులో కీలక ఆధారాలుగా మారనున్నాయి. ఈ వ్యవహారం ఇంకా ఎన్ని మలుపులు తిరుగుతుందో అని తెలుగు ప్రజలు ఉత్కంఠగా గమనిస్తున్నారు.

# అంగన్వాడీల్లోనూ ఒంటిపూట బడులు



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఎండల తీవ్రత రోజురోజుకూ పెరుగుతుండటంతో ప్రభుత్వం మరో కీలక నిర్ణయం తీసుకుంది. గర్భిణులు, బాలింతలు, చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని అంగన్వాడీ కేంద్రాలను ఒంటిపూట మాత్రమే నిర్వహించాలని సర్కారు ఆదేశాలు జారీ చేసింది. సాధారణంగా పాఠశాల విద్యాశాఖ మార్చి 16 నుంచి ఒంటిపూట బడులను అమలు చేస్తున్నట్లే, అదే తరహాలో అంగన్వాడీలు కూడా ఇకపై ఉదయం వేళల్లోనే పనిచేయనున్నాయి. ఈ కొత్త నిబంధనలు ఏప్రిల్ 23 వరకు అమల్లో ఉంటాయని అధికారులు స్పష్టం చేశారు. మండుతున్న ఎండల కారణంగా మధ్యాహ్నం వేళ చిన్నారులు ఇంటికి వెళ్లడం ఇబ్బందికరంగా మారుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్టు పేర్కొన్నారు.

**వేసవి సెలవులు.. పౌష్టికాహారం నిరంతరాయంగా పంపిణీ**

ఒంటిపూట బడులు ఏప్రిల్ 23తో ముగియనుండగా, ఆ తర్వాత వేసవి తీవ్రతను బట్టి సుమారు నెలరోజుల పాటు వేసవి సెలవులను ప్రకటించే ఆలోచనలో ప్రభుత్వం ఉంది. దీనిపై మరికొన్ని రోజుల్లో అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది. అయితే సెలవులు ప్రకటించినా చిన్నారులు, గర్భిణులకు అందాల్సిన పౌష్టికాహారంలో ఎటువంటి అంతరాయం కలగకుండా ప్రభుత్వం జాగ్రత్తలు తీసుకుంటోంది. అంగన్వాడీ కేంద్రాలకు వచ్చి భోజనం చేయలేని వారికి 'టేక్ హోమ్ రేషన్' (ఖుఎవ ఎశీఎవ ఞఅశీఅ – ౧౧=) పద్ధతిలో నేరుగా వారి ఇళ్లకే రేషన్‌ను చేరవేసే ప్రక్రియను మరింత పటిష్టం చేయనున్నారు. తద్వారా వేసవిలో కూడా పౌష్టికాహార పంపిణీ నిరంతరాయంగా కొనసాగుతుందని అధికారులు తెలిపారు.

# నేడు ఈ రాశుల వారికి ఆకస్మిక ధన లాభం.. నేటి రాశి ఫలాలు ఇలా




**హైదరాబాద్ పెన్ పవర్:** దినఫలాలు చూసుకుని మరీ చాలా మంది పనులు ప్రారంభిస్తారు. ఉదయం లేవగానే.. ఈరోజు ఎలా ఉంటుందో ? ఏ పని చేస్తే ఎలా కలిసొస్తుందో ? అని చాలా మంది ఆలోచిస్తారు. కొత్తగా ఏ పని చేయాలన్నా మంచి, చెడులను చూస్తారు. మరి ఈ రోజు అనగా మార్చి 15 తేదీ ఆదివారంమీ రాశిఫలం ఎలా ఉంది ? ఏ పనులు చేయొచ్చు, ఏయే పనులు చేయకూడదు ? ఏ రంగు దుస్తులు ధరించకూడదు ? అన్న విషయాలను ఇక్కడ తెలుసుకోండి.

**మేషం :**

ఉద్యోగస్తులకు పని ఒత్తిడి పెరిగి విశ్రాంతి లభించదు. చేపట్టిన పనులలో అవరోధాలు ఉంటాయి. వృత్తి వ్యాపారాలు మరింత నిరాశ కలిగిస్తాయి. దూర ప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆర్ధిక పరిస్థితి అంతంత మాత్రంగానే ఉంటుంది.

**వృషభం :**

ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. కొన్ని ముఖ్యమైన విషయాలలో కుటుంబ సభ్యుల సలహాలు కలిసివస్తాయి. వృత్తి వ్యాపారాలలో నూతన ప్రోత్సాహకాలు అందుతాయి. ఉద్యోగమున వివాదాలు సర్దుమణుగుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. కుటుంబ వాతావరణం సందడిగా ఉంటుంది.

**మిథునం :**

గృహంలో వివాహ ప్రస్తావన వస్తుంది. ఆలోచనలు ఆచరణలో పెడతారు. బంధుమిత్రులు నుండి శుభవార్తలు అందుతాయి. నూతన వస్తు వాహన లాభాలు పొందుతారు. వృత్తి వ్యాపారాలలో ఆత్మవిశ్వాసంతో నిర్ణయాలు తీసుకుని లాభపడతారు. ఉద్యోగ వాతావరణం అనుకూలంగా ఉంటుంది. ఆధ్యాత్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**కర్కాటకం :**

సోదరులతో స్థిరాస్తి వివాదాలు కలుగుతాయి. ఆకస్మికంగా ప్రయాణాలు వాయిదా వేస్తారు. ధార్మిక సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా ఉంటాయి. ఉద్యోగస్తులకు పనిభారం పెరుగుతుంది. సంతాన విద్య ఉద్యోగ విషయాలలో కొంత నిరుత్సాహం తప్పదు.

**సింహం :**

చేపట్టిన వ్యవహారాలలో అవరోధాలు ఉంటాయి. బంధుమిత్రులతో మాట పట్టింపులుంటాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వృత్తి వ్యాపారాలలో మరింత ఒత్తిడి పెరుగుతుంది. ఉద్యోగస్తులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోవడం మంచిది కాదు. నిరుద్యోగులకు మరింత కష్టం తప్పదు.

**కన్య :**

సంతానానికి నూతన విద్యావకాశాలు లభిస్తాయి. కొన్ని వ్యవహారాలలో అవరోధాలు ఉన్నప్పటికీ నిదానంగా పూర్తిచేస్తారు. పాత మిత్రుల నుండి శుభకార్య ఆహ్వానాలను అందుకుంటారు. వృత్తి వ్యాపారాలలో నష్టాలు భర్తీ చేస్తారు. ఉద్యోగస్తులకు శుభవార్తలు అందుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

**తుల :**

ప్రయాణాలలో వాహన ఇబ్బందులుంటాయి. అనుకొన్న సమయానికి పనులు పూర్తి కావు. ఆదాయానికి మించి ఖర్చులు పెరుగుతాయి. బంధు మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండటం మంచిది. వ్యాపారస్తులకు వచ్చిన అవకాశాలు చేజారిపోకుండా చూసుకోవాలి. ఉద్యోగ విషయంలో ఉన్నతాధికారులతో ఊహించని సమస్యలు కలుగుతాయి.

**వృశ్చికం :**

కుటుంబ సభ్యులతో శుభకార్యాలకు హాజరవుతారు. దైవ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తారు. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి. వృత్తి వ్యాపారాలలో ఉన్నత ఫలితాలను పొందుతారు. ఉద్యోగస్తులకు శ్రమకు అధికారుల నుండి ప్రశంసలు అందుకుంటారు. నూతన వాహనం కొనుగోలు చేస్తారు.

**ధనస్సు :**

ఇంటా బయట ఊహించని సమస్యలు ఎదురవుతాయి. చేపట్టిన కార్యక్రమాలలో స్వల్ప వివాదాలు ఉంటాయి. దాయాదులు తో స్థిరాస్తి వివాదాలు తప్పవు. వృత్తి వ్యాపారాలు నత్తనడకన సాగుతాయి. ఉద్యోగ వాతావరణం నిరుత్సాహ పరుస్తుంది. దూర ప్రయాణాల వలన శారీరక శ్రమ పెరుగుతుంది. ధన పరంగా జాగ్రత్తగా వ్యవహరించాలి.

**మకరం :**

వృత్తి వ్యాపారాలలో మరింత పుంజుకుంటాయి. చేపట్టిన పనులు విజయవంతంగా పూర్తి అవుతాయి. బంధు మిత్రుల సహాయ సహకారాలు అందుతాయి. స్థిరాస్తి వివాదాలు రాజీ చేసుకుంటారు. ఉద్యోగస్తులకు సహోద్యోగుల సహాయంతో బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తారు. ఆర్థికంగా అనుకూల వాతావరణం ఉంటుంది.

**కుంభం :**

అనుకున్న పనులు వేగవంతంగా పూర్తి చేస్తారు. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెరుగుతాయి. మిత్రులతో సేవ కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు మరింత ఉత్సాహంగా సాగుతాయి. వృత్తి ఉద్యోగాలలో చాలా కాలంగా వేధిస్తున్న సమస్యల నుంచి బయటపడతారు. ఇంటా బయట మీ మాటకు విలువ పెరుగుతుంది.

**మీనం :**

కుటుంబ సభ్యుల ప్రవర్తన ఆశ్చర్యపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాలలో అవాంతరాలు ఉంటాయి. దీర్ఘ కాలిక రుణ ఒత్తిడి పెరగటం వలన శారీరక మానసిక అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు నత్తనడకగా సాగుతాయి. ఉద్యోగమున ఒడిదుడుకులు పెరుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు నిరాశ తప్పదు.

# శ్రీనివాసగిరి పై భక్తి పారవశ్యం.. మెట్ల దారిన మొక్కుల దేవుని చెంతకు!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఆధ్యాత్మిక క్షేత్రం శ్రీనివాసగిరి భక్తుల కోలాహలంతో నిండిపోయింది. కలియుగ దైవం శ్రీ వేంకటేశ్వర స్వామి వారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన తిరుకళ్యాణ మహోత్సవం కనుల పండువగా జరిగింది. కొండపై వేద పండితుల మంత్రాలు, మంగళ వాయిద్యాల నడుమ స్వామి వారి కళ్యాణ వేడుక అత్యంత వైభవంగా సాగింది. ఈ పుణ్యకార్యంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన భార్య మాధురితో కలిసి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.

**సామాన్య భక్తుడిలా..**

ఈ వేడుకలో అందరినీ ఆకట్టుకున్న ప్రధానాంశం మంత్రి పొంగులేటి దంపతుల రాక. . సామాన్యుడిలా భక్తుల 1,600 మెట్లను కాలినడకన ఎక్కుతూ గిరిశిఖరానికి చేరుకున్నారు. దారి పొడవునా గోవింద నామస్మరణ చేస్తూ, తనను పలకరించిన భక్తులకు చిరునవ్వుతో సమాధానమిస్తూ ముందుకు సాగారు. దేవుని దగ్గర అందరూ సమానమే అని ఆయన చాటిచెప్పారు.

**లోక కల్యాణం కోసం 'సిరి' కల్యాణం..**

ఆలయానికి చేరుకున్న మంత్రి దంపతులకు ఆలయ కమిటీ ఘన స్వాగతం పలికారు. స్వామివారికి మంత్రి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం జరిగిన కళ్యాణ వేడుకను భక్తిశ్రద్ధలతో వీక్షించారు. పండితులు వారికి ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

**పర్యాటక ప్రాంతంగా శ్రీనివాసగిరి..**

దర్శనం తర్వాత మంత్రి మాట్లాడుతూ.. "ప్రకృతి ఒడిలో ఉన్న శ్రీనివాసగిరిని దర్శించుకోవడం నా అదృష్టం. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో అటవీ శాఖ అధికారుల సహకారంతో ఈ క్షేత్రాన్ని గొప్ప 'ఎకో టూరిజం'(ప్రకృతి పర్యాటక) కేంద్రంగా తీర్చిదిద్దుతాం. భక్తులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పిస్తాం" అని చెప్పారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆ స్వామిని వేడుకున్నట్లు తెలిపారు.

# పీఎన్‌జీ ఉన్న వారికి LPG గ్యాస్ కనెక్షన్ రద్దు.. గెజిట్ విడుదల చేసిన కేంద్రం



**హైదరాబాద్ పెన్ పవర్:** పశ్చిమాసియాలో ముదురుతున్న యుద్ధం కారణంగా గ్యాస్ సరఫరాలో ఏర్పడిన అంతరాయం భారత్?లో ఎల్?పీజీ గ్యాస్ సిలిండర్ల కొరతకు దారి తీసింది. గ్యాస్ సిలిండర్లకు భారీగా డిమాండ్ పెరగడంతో అక్రమార్కులు దీనిని బ్లాక్ మార్కెట్ దందాకు అనుకూలంగా మార్చుకుంటున్నారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం తీసుకుంది. పైపుడ్ నేచురల్ గ్యాస్ (౧రచీ+) కనెక్షన్ కలిగి ఉన్నవారకి డొమెస్టిక్ ఎల్?పీజీ రద్దు చేసింది. పీఎన్జీ కలిగి ఉండి అదే సమయంలో డొమెస్టిక్ ఎల్‌పీజీ (౹రా+) కనెక్షన్ ఉన్నవారు ఇకపై ఎల్‌పీజీ కనెక్షన్‌ను ఉంచుకోవడానికి వీల్లేదని ఈ మేరకు తాజాగా కేంద్ర పెట్రోలియం మరియు సహజ వాయువు మంత్రిత్వ శాఖ కీలక మార్పులు చేస్తూ అధికారిక గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేసింది. పైప్డ్ గ్యాస్ ఉన్న వారు వెంటనే తమ ఎల్?పీజీ కనెక్షన్లు సరెండర్ చేయాలని ఆదేశించింది. పీఎన్డీ కనెక్షన్ ఉన్న ఇళ్లకు ప్రభుత్వ రంగ చమురు సంస్థలు కొత్తగా ఎల్?పీజీ కనెక్షన్లు ఇవ్వడం కానీ సరఫరా చేయడం కానీ నిషేధించింది.

**నిన్న ఒక్క రోజే 24 లక్షల సిలిండర్లు డెలివరీ:**

యుద్ధం కారణంగా దేశంలో గ్యాస్ విషయంలో ఆందోళనకర పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో పెద్ద ఎత్తున గ్యాస్ సిలిండర్ల బుకింగ్స్ పెరిగాయాయి. ఈ క్రమంలో నిన్న (శనివారం) ఒక్కరోజే దేశవ్యాప్తంగా 24 లక్షల ఎల్పీజీ సిలిండర్లు డెలివరీ చేసినట్లు కేంద్రం వెల్లడించింది. ఇందులో ఇండియన్ గ్యాస్ 93,826, హెచ్?పీ 79,974, భారత్ గ్యాస్ కు సంబంధించి 68,571 మొత్తం 2,42,371 సిలిండర్లు డెలివరీ చేయబడ్డాయని చమురు సంస్థలు వెల్లడించాయి.

# ఘోర రోడ్డు ప్రమాదం.. స్పాట్‌లో ముగ్గురు మృతి



**హైదరాబాద్ పెన్ పవర్:** నల్గొండ జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం జరింది. నాంపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం మధ్యాహ్నం ఇటుకల లోడుతో వెళ్తున్న లారీ ప్యాసింజర్ ఆటోను ఢీ కొట్టింది. ఈ ఘటనలో ముగ్గురు ప్రయాణికులు స్పాట్ లోనే ప్రాణాలు కాల్పోగా మరో ఎనిమిది మందికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం నాంపల్లి మండలం రేఖ్య తండా గ్రామ పంచాయతీలో వస్త్రం తండా వద్ద ఇటుక లోడుతో వెళ్తున్న లారీ మల్లె పెల్లికి ప్యాసింజర్?తో వెళ్తున్న ఆటోను ఎదురుగా ఢీకొంది. ఈ ఘటనలోని క్షతగాత్రులను దేవరకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

## పిలిచి అందలం ఎక్కిస్తే ..అడ్డంగా బుక్కయ్యారే




**హైదరాబాద్ పెన్ పవర్:** తెలుగుదేశం పార్టీకి ఏదో ఒక తలనొప్పి ఏదో ఒక రూపంలో వచ్చిపడుతుంది. అసలు గత ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికే కరెక్ట్ కాదన్నది సీనియర్ నేతల అభిప్రాయం. కేవలం సామాజిక కోణంలోనూ, మరొక రూపంలోనూ టిక్కెట్లు ఇచ్చుకుంటూ పోతే పార్టీ పరువు నడిబజార్లో నిలబెట్టడానికి కూడా ఎవరూ వెనకాడరు. వారికి రాజకీయం ఒక క్రీడ లాంటిది. అంతే.. తమ కుటుంబాన్ని, వారసత్వాన్ని కూడా మర్చిపోతారు. ఇటీవల మాజీ మంత్రి ఆదినారాయణ రెడ్డి కుమారుడి పేరు కూడా ఈ కేసులో బయటకు రావడం, తాజాగా ఏలూరు పార్లమెంటు సభ్యుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ పేరు వినిపించడం కూటమికి కోలుకోలేని దెబ్బ.

**ప్రజాప్రతినిధిగా ఉంటూ...**

ఒక ప్రజాప్రతినిధిగా ఉంటూ డ్రగ్స్ కు అలవాటు పడితే ఇక నియోజకవర్గ ప్రజలకు ఏం నీతులు చెబుతారన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ది రాజకీయ కుటుంబ నేపథ్యం ఉంది. ఏలూరు పార్లమెంటు సభ్యుడిగా ఉన్నారు.యువకుడు. ఎంతో వయసు ఉంది. అలాగే మరెన్నో పదవులు ఆయన దక్కించుకోవాల్సి ఉంది. ఆయన తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ ప్రస్తుతం టీడీపీ మైదుకూరు ఎమ్మెల్యేగా ఉన్నారు. మాజీ మంత్రి యనమల రామకృష్ణుడు అల్లుడు పుట్టా మహేష్ కుమార్ యాదవ్. ఇన్ని ట్యాగ్ లైన్ లు పుట్టా మహేష్ కుమార్ యాదవ్ వెనక ఉన్నాయి. ఎంత జాగ్రత్తగా ఉండాలి. తండ్రి, మామ రాజకీయ వారసత్వాన్ని ఎక్కువ కాలం కొనసాగించాల్సిన సమయంలో పుట్టా మహేష్ కుమార్ యాదవ్ ఈ బలహీనతకు అలవాటు పడి రాజకీయ జీవితాన్ని తనకు తానే ఇబ్బంది కొని తెచ్చుకున్నారంటున్నారు.

**లెగసీని తీసుకెళ్లాల్సిన నేత...**

ఇప్పటికే పుట్టా మహేష్ కుమార్ యాదవ్ మొయినా బాద్ డ్రగ్స్ కేసులో పేరు వినపడటంతో వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు. చంద్రబాబు ఏం సమాధానం చెబుతారని మాజీ మంత్రి కాకాణి గోవర్ధర్ రెడ్డి ప్రశ్నిస్తున్నారు. పార్టీ నుంచి సస్పెండ్ చేయాల్సిందేనంటూ కాకాణి డిమాండ్ చేశారు. తండ్రి పుట్టా సుధాకర్ యాదవ్ పేరుతో పాటు మామ యనమల రామకృష్ణుడి పేరు కూడా పుట్టా మహేష్ కుమార్ యాదవ్ తన బలహీననతతో బయటకు తెచ్చినట్లయింది. ఇప్పుడు టీడీపీ సమాధానం చెప్పుకోలేని పరిస్థితుల్లో ఉంది. అయితే దీనికి పార్టీ అధినేత చంద్రబాబు మరెవరో ఏం చేస్తారు? పిలిచి పదవి ఇచ్చి.. అందలం ఎక్కిస్తే పుట్టా మహేష్ ఇలా అడ్డంగా దొరికిపోయి ఇప్పుడు అందరి నోట్లో నానుతుండటం పార్టీతో పాటు కూటమికి కూడా ఇబ్బందికరంగా మారింది. మొయినాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీలో దొరికి రాజకీయ ఇబ్బందులను కొని తెచ్చుకున్నారు.

## మండే ఎండల్లో చిరు జల్లులట.. కూల్ న్యూస్




**హైదరాబాద్ పెన్ పవర్:** ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత ఎక్కువగా ఉంది. ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరుగుతున్నాయి. ఏప్రిల్, మే నెలలో నలభై ఐదు డిగ్రీలకు చేరుకున్నా ఆశ్చర్యం లేదని వాతావరణ శాఖ అధికారులు చెబుతున్నారు. ఉక్కపోతతో పాటు వేడిగాలుల తీవ్రత కూడా ఎక్కువగా రెండు తెలుగు రాష్ట్రాల్లో నెలకొని ఉంది. ఉపరి తల ద్రోణి కారణంగా నేడు కొన్ని చోట్ల తేలిక పాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. రానున్న కాలంలో మరింతగా ఉష్ణోగ్రతలు పెరుగుతాయని వాతావరణ శాఖ అధికారులు తెలిపారు.

**ఉరుములు, మెరుపులతో...**

అయితే ఆంధ్రప్రదేశ్ లో నేడు వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఈరోజు తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. కొన్ని చోట్ల ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. గంటకు ముప్ఫయి నుంచి నలభై కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని కూడా తెలిపింది. ప్రజలు విద్యుత్తు స్థంభాలు, చెట్ల కింద నిల్చోవద్దని కూడా వాతావరణ శాఖ అధికారులు సూచించారు. రాయలసీమలోనూ ఉరుములు, మెరుపులతో కూడిన జల్లులు పడే అవకాశముందని తెలిపింది.

**నేడు మోస్తరు వానలు...**


తెలంగాణలోనూ నేడు కొన్ని ప్రాంతాల్లో మోస్తరు నుంచి తేలికపాటి జల్లులు పడే అవకాశముందని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది. ఉత్తర, పశ్చిమ జిల్లాల్లోనే ఈ తేలికపాటి నుంచి మోస్తరు వానలు పడతాయని చెప్పింది. తెలంగాణలోనూ భారీ ఉష్ణోగ్రతలు ఇటీవల కాలంలో నమోదవుతున్నాయి. ఇప్పటికే 38 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న కాలంలో అంటే మే నాలుగో వారంలో మాత్రం ఉష్ణోగ్రతలు నలభై నుంచి నలభై డిగ్రీలకు చేరుకునే అవకాశముందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఇక ఏప్రిల్, మే నెలలో మాత్రం తెలంగాణ కూడా ఎండలు దంచి కొట్టే అవకాశముందని హెచ్చరించింది.

## మొయినాబాద్ డ్రగ్స్ కేసుపై ఈగల్ టీం కీలక ప్రకటన..



**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసు ఇరు తెలుగు రాష్ట్రాల్లో ప్రకంపనలు సృష్టిస్తోంది. మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ పై దాడి చేసిన ఈగల్ టీం పోలీసులు 11 మందిని అదుపులోకి తీసుకోగా... వారిలో ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ సహా ఆరుగురికి డ్రగ్స్ పాజిటివ్ వాచినట్లు తెలిపారు పోలీసులు. అయితే.. సోమవారం ( మార్చి 16 ) పార్లమెంటు సమావేశాలు ఉన్న క్రమంలో ఎంపీ పుట్టా మహేష్ కు స్టేషన్ బెయిల్ మంజూరు చేశారు పోలీసులు. ఈ క్రమంలో మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ కేసుకు సంబంధించి కీలక ప్రకటన చేసింది ఈగల్ టీం.డ్రగ్స్ పార్టీ సమాచారం మేరకు మొయినాబాద్ పోలీసులు, ఎస్ఓటీ పోలీసులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించామని తెలిపింది ఈగల్ టీం. ఫామ్ హౌస్‌లో 11 మందిని అదుపులోకి తీసుకున్నామని... దాడి సమయంలో ఫామ్ హౌస్ నుంచి కాల్పుల శబ్దం వినిపించిందని తెలిపారు పోలీసులు. నిందితుల నుంచి జర్మనీ తయారీ .32 రివాల్వర్, కార్ట్రిడ్జ్‌లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. శరత్ కుమార్ దగ్గర 0.26 గ్రాముల కొకైన్ స్వాధీనం చేసుకున్నామని.. డ్రగ్స్‌ను కౌశిక్ రవి ద్వారా తెప్పించినట్లు నిర్ధారణ అయినట్లు తెలిపారు పోలీసులు. ఈ కేసులో 11 మందికి డ్రగ్ టెస్ట్ నిర్వహించగా.. 5 మందికి పాజిటివ్ వచ్చిందని..భారీగా బీర్, విస్కీ, వోడ్కా బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు పోలీసులు. ఈ కేసుకి సంబంధించి దర్యాప్తు ముమ్మరం చేసినట్లు తెలిపారు పోలీసులు.

## జ్వరంతో ఆసుపత్రికి వచ్చిన యువతితో అనుచిత ప్రవర్తన... డాక్టర్ ను పొట్టు పొట్టు కొట్టిన్రు..




**హైదరాబాద్ పెన్ పవర్:** మహబూబాబాద్ జిల్లాలో దారుణం జరిగింది. జిల్లాలోని తొర్రూరు పట్టణంలో చికిత్స కోసం ఆసుపత్రికి వెళ్లిన యువతితో అనుచితంగా ప్రవర్తించిన డాక్టర్ పై దాడి చేశారు ఆమె కుటుంబసభ్యులు. ఆదివారం ( మార్చి 15 ) జరిగిన ఈ ఘటనకు సంబంధించి వివరాలిలా ఉన్నాయి.. తొర్రూరు పట్టణంలో డాక్టర్ కిరణ్ కుమార్ విజయలక్ష్మి హాస్పిటల్ నిర్వహిస్తున్నారు. హాస్పిటల్ కు జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం వచ్చింది ఓ యువతి.

చికిత్స కోసం వచ్చిన యువతితో అనుచితంగా ప్రవర్తించాడు కిరణ్ కుమార్. ఈ విషయం తెలుసుకున్న యువతి కుటుంబసభ్యులు ఆసుపత్రి దగ్గరికి చేరుకొని డాక్టర్ పై దాడి చేశారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని డాక్టర్ ను అదుపులోకి తీసుకున్నారు. చికిత్స కోసం వచ్చిన పేషెంట్స్ పట్ల అనుచితంగా ప్రవర్తించే ఇలాంటి డాక్టర్లు వైద్య వృత్తికే మాయని మచ్చ అని.. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు బాధితురాలి కుటుంబసభ్యులు.


03
ఇప్పుడు పెన్ పవర్ దిన పత్రికలో
కోర్టు పబ్లికేషన్ యాడ్స్
కేవలం
యాడ్ 500/-
'పొ. 12 సెం.మీ, వె. 8 సెం.మీ'
'మరిన్ని వివరాలకు సంప్రదించండి '
93948 55244
షరతులు వర్తిస్తాయి

## ఐదు రాష్ట్రాల ఎన్నికల షెడ్యూల్ వచ్చేస్తోందోచ్



**హైదరాబాద్ పెన్ పవర్:** దేశంలో మరో మినీ సంగ్రామానికి సమయం ఆసన్నమైంది. ఐదు రాష్ట్రాల ఎన్నికల ప్రకటన చేసేందుకు సర్వం సిద్ధమైంది. విశ్వసనీయ సమాచారం మేరకు సోమవారమే షెడ్యూల్ విడులయ్యే అవకాశాలు ఉన్నాయని అంటున్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, అస్సాం, కేరళ, పుదుచ్చేరి రాష్ట్రాలకు ఎన్నికలు జరగనున్నాయి. పుదుచ్చేరి మినహా మిగిలిన నాలుగు ప్రధాన రాష్ట్రాలు. దీంతో దేశవ్యాప్తంగా ఈ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. అదేసమయంలో అస్సాంలో తప్ప మిగిలిన మూడు రాష్ట్రాల్లో ప్రస్తుతం బీజేపీయేతర ప్రభుత్వాలు నడుస్తున్నాయి. ఈ రాష్ట్రాల్లో పాగా వేయాలని బీజేపీ నేతలు ఎప్పటి నుంచో ప్లాన్ చేస్తున్నారు. దీంతో త్వరలో జరిగే ఐదు రాష్ట్రాల ఎన్నికలు తీవ్ర ఉత్కంఠను రేకెత్తిస్తున్నాయి.ఐదు రాష్ట్రాల ఎన్నికలపై కేంద్ర హోంశాఖతో ఎన్నికల కమిషన్ చర్చలు జరుపుతోంది. ఈ చర్చలు కొలిక్కి వచ్చిన తర్వాత ఏ క్షణమైనా నోటిఫికేషన్ విడుదల అయ్యే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఆయా రాష్ట్రాల్లో రిటర్నింగ్ అధికారుల నియామకం పూర్తయిందని అంటున్నారు. ఎన్ని దశల్లో ఎన్నికలు నిర్వహించాలనే అంశంపైన తుది నిర్ణయానికి రావాల్సివుందని అంటున్నారు. గతంలో పశ్చిమబెంగాల్ లో 8 విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. దీంతో ఎన్నికల ప్రక్రియ సుదీర్ఘంగా సాగింది. అయితే ఇప్పుడు 6 విడతలకే పరిమితం చేయాలన్న ప్రతిపాదనను ఎన్నికల సంఘం పరిశీలిస్తోందని చెబుతున్నారు.అదేవిధంగా అస్సాంలో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించారు. తమిళనాడు, పుదుచ్చేరి, కేరళలో ఒకే విడతలో పూర్తయ్యాయి. ఈ సారి కూడా ఈ రాష్ట్రాల్లో మార్పులు ఉండకపోవచ్చని అంటున్నారు. బందోబస్తుకు సిబ్బంది అందుబాటులో ఉంటే తమిళనాడులో రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించే ఆలోచన చేస్తున్నారని చెబుతున్నారు. ఇక షెడ్యూల్ విడుదలకు అన్ని ఏర్పాట్లు పూర్తవడంతో ఆయా రాష్ట్రాల్లో ప్రభుత్వాలు అలర్ట్ అయ్యాయి. పెండింగ్ లో ఉన్న జీవోల విడుదలకు ఆదివారం కూడా పనిచేస్తున్నారు. షెడ్యూల్ విడుదలైన తర్వాత జీవోల విడుదలకు ఆంక్షలు అడ్డంకి అయ్యే పరిస్థితి ఉండటంతో ప్రభుత్వాలు ముందుజాగ్రత్తలు తీసుకుంటున్నాయని చెబుతున్నారు.ఎన్నికలు జరగనున్న ఐదు రాష్ట్రాల్లో మూడు చోట్ల బీజేపీయేతర ప్రభుత్వాలు ఉన్నాయి. ఆయా ప్రభుత్వాధినేతలు సైతం బలంగా పోరాడుతున్నారు. దీంతో ఆయా రాష్ట్రాలను గుప్పెట్లో పెట్టుకోడానికి బీజేపీ తీవ్రంగా ప్రయత్నిస్తోంది. పశ్చిమబెంగాల్ లో సీఎం మమతా బెనర్జీకి దీటుగా బీజేపీ రాజకీయాలు నడుపుతోంది. ఆ రాష్ట్రంలో కమ్యూనిస్టుల స్థానాన్ని ఐదేళ్ల క్రితం ఆక్రమించిన బీజేపీ ఇప్పుడు మమతను గద్దె దించే దిశగా పావులు కదుపుతోంది. అదేసమయంలో తమిళనాడులో కూడా తొలిసారిగా అన్నాడీఎంకేతో కలిసి ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కలలు కంటోంది. కేరళలో ఒంటరి పోరాటమే చేస్తున్నా, ఆ రాష్ట్రంలో ఎల్డీఎఫ్, యూడీఎఫ్ కూటముల మధ్యే పోటీ కనిపిస్తోందని అంటున్నారు. మొత్తానికి బీజేపీ వర్సెస్ ఇండి కూటమి రాజకీయాలు ఈ ఎన్నికలతో మరోసారి తారాస్థాయికి చేరే అవకాశం ఉందని అంటున్నారు.

## మొయినాబాద్ ఫామ్ హౌస్ డ్రగ్స్ పార్టీ లో కొత్త కోణం




**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్‌లోని మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్‌లో జరిగిన డ్రగ్స్ పార్టీ కలకలం రేపుతుంది. రెండు తెలుగు రాష్ట్రాల రాజకీయ నేతలు ఇందులో ఉండటం ఈ సంచలనానికి కారణమయింది. డ్రగ్స్ వినియోగం కానీ, అమ్మకం కాని నేరమని తెలిసినప్పటికీ ప్రజాప్రతినిధులు డ్రగ్స్ కు అలవాటుపడటంతో వారి వ్యక్తిగత ఇమేజ్ దెబ్బతినడంతో పాటు పార్టీ ప్రతిష్టను కూడా మంట గలిపే రకంగా ఉంది. రాజకీయంగా వారికి ఇది ఇబ్బందికరమైన పరిణామమే. రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రులు చంద్రబాబు, రేవంత్ రెడ్డి లు డ్రగ్స్ పై ఉక్కుపాదం మోపుతామని చెబుతున్నప్పటికీ ప్రజాప్రతినిధులు కూడా ఇందులో భాగస్వామ్యులు కావడంతో ప్రజల్లో మరింత పలుచనగా మారనుంది. ఎంపీ అయినా, మాజీ ఎమ్మెల్యే అయినా వదిలేది లేదని ఎస్పీ గిరిధర్ తెలిపారు.

**పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ కేసులో...**

పైలట్ రోహిత్ రెడ్డి ఫామ్ హౌస్ మొయినాబాద్ లో ఉంది. గతంలో ఎమ్మెల్యేల కొనుగోలు విషయంలోనూ ఈ ఫామ్ హౌస్ వేదికగా మారింది. అయితే నేడు అదే ఫామ్ హౌస్ లో డ్రగ్స్ పార్టీ జరుగుతుందన్న సమాచారం రావడంతో పోలీసులు రాత్రి ఏడున్నర గంటల ప్రాంతంలో ఈగల్ టీమ్‌తో కలిసి ఫామ్ హౌస్‌పై దాడి చేశారు. అక్కడ తొమ్మిది మంది పురుషులు, ఒక మహిళ కలిపి మొత్తం 10 మంది ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. ఇందులో ఏలూరు టిడిపి ఎంపీ పుట్ట మహేష్ కూడా అక్కడ ఉన్నారు. పోలీసులు అక్కడికి చేరుకున్న వెంటనే ఢిల్లీకి చెందిన రియల్టర్ నమిత్ శర్మ గాల్లోకి ఒక రౌండ్ ఫైర్ చేసినట్టు పోలీసులు చెబుతున్నారు. ఆ తుపాకీ రితేష్ రెడ్డి పేరుతో లైసెన్స్ ఉన్న గన్ అని గుర్తించారు. పోలీసులు ఒక లైవ్ రౌండ్, ఒక ఖాళీ కార్ట్రిడ్జ్‌తో పాటు ఆయుధాన్ని స్వాధీనం చేసుకున్నారు.

**సిమ్లా నుంచి తీసుకు వచ్చి...**

అక్కడి నుంచి వైట్ పౌడర్, అంటే కొకైన్ అనుమానిస్తున్న పదార్థాన్ని కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇన్‌స్టంట్ డ్రగ్ టెస్ట్ కిట్‌తో పరీక్షించగా రోహిత్ రెడ్డి, నమిత్ శర్మ, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, పుట్టా మహేష్, అర్జున్ రెడ్డి కలిపి ఆరుగురికి పాజిటివ్ వచ్చిందని పోలీసులు తెలిపారు. ఇప్పుడు వీరిని హాస్పిటల్‌కు తరలించి మరిన్ని పరీక్షలు చేస్తున్నారు. ఈ డ్రగ్స్ పార్టీ, కాల్పుల ఘటనపై పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సిమ్లా నుంచి బెంగళూరుకు చెందిన కౌశిక్ రవి అనే వ్యక్తి ఈ డ్రగ్స్ ను హైదరాబాద్ కు తెచ్చినట్లు అంగీకరించారు. కౌశిక్ రవి పైలట్ రోహిత్ రెడ్డికి అత్యంత సన్నిహితుడని పోలీసులు తెలిపారు. కొకైన్ తో పాటు మెత్ వాడినట్లు పోలీసులు కనుగొన్నారు. నిన్న మధ్యాహ్నం నుంచి ఈ పార్టీ ప్రారంభమయిందని పోలీసులు చెబుతున్నారు. తిరువీడుల అర్జున్ రెడ్డి, కౌశిక్ రవి, రితేష్ రెడ్డి, నమిత్ శర్మ, పంజుగుల రోహిత్ రెడ్డి, పుట్టా మహేష్ కుమార్ యాదవ్ లకు పాజిటివ్ వచ్చినట్లు పోలీసులు తెలిపారు.

## యుద్ధం ఎఫెక్ట్... పడిపోయిన బియ్యం ధరలు




**హైదరాబాద్ పెన్ పవర్:** బియ్యం ధరలు అందుబాటులోకి వస్తున్నాయి. ఇన్నాళ్లు ఎగుమతులు కావడంతో బియ్యం ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండటం లేదు. అంటే సన్న బియ్యం మార్కెట్ లో తక్కువగా లభించడం, ఎగుమతులు ఎక్కువగా జరుగుతుండటంతో బియ్యం ధరలు మన మార్కెట్ లో కొంత ఎక్కువగానే ఉన్నాయి. అయితే నేడు మాత్రం బియ్యం ధరలు పడిపోయినట్లు మార్కెట్ లో వ్యాపారులు చెబుతున్నారు. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ లో ఉత్పత్తి అయిన బియ్యం విదేశాల ఎగుమతి నిలిచిపోవడంతో తక్కువ ధరకే మార్కెట్ లో లభిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

**యుద్ధం ఎఫెక్ట్ తో...**

ఇరాన్, ఇజ్రాయెల్–అమెరికా మధ్య కొనసాగుతున్న యుద్ధం పలు రంగాలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. ఈ మేరకు భారత్ నుంచి బియ్యం ఎగుమతులు ఆగిపోయాయి. దీంతో రెండు తెలుగు రాష్ట్రాల్లో బియ్యం ధరలు తగ్గుముఖం పడుతున్నాయి. ఈ నెల 8న దొడ్డు ధాన్యం ధర క్వింటా రూ. 2,550 ఉండగా ప్రస్తుతం రూ. 2,450కి తగ్గింది. మరో రూ. 150 వరకు తగ్గే అవకాశం ఉందని మిల్లర్లు చెబుతున్నారు. ఈ సీజన్‌లో మరో 145 ఎల్ టన్నుల బియ్యం మార్కెట్లోకి రానుందని, ఎక్స్‌పోర్ట్ ఆగిపోయినందున కొనేందుకు వ్యాపారులు ఆసక్తి చూపరని పేర్కొంటున్నారు.

**రేక్స్ కొరత లేదు: కేంద్రం**

/.తెలంగాణలో ధాన్యం, పత్తి రవాణాకు అవసరమైన రైల్వే రేక్స్‌ను సమృద్ధిగా కేటాయిస్తామని కేంద్ర రైల్వే శాఖ ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం, భారత ఆహార సంస్థ అందించే రిపోర్టుల ఆధారంగానే రైల్వే బోగీల కేటాయింపు జరుగుతుందని కేంద్రం వివరించింది. ఎంపీ కడియం కావ్య లేవనెత్తిన సమస్యకు సమాధానమిస్తూ, 2026 జనవరి నాటికి సుమారు 3.59 మిలియన్ టన్నుల ధాన్యం లోడింగ్ పూర్తయిందని, దీని కోసం1,329 రైల్వే రేక్స్‌ను వినియోగించినట్టు కేంద్ర రైల్వే శాఖ సహాయమంత్రి రవనీత్ సింగ్ తెలిపారు. వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని పేర్కొన్నారు. మొత్తానికి యుద్ధం ప్రభావంతో బియ్యం ధరలు కొనుగోలు దారులకు అందుబాటులోకి వచ్చాయి. రైతులకు మాత్రం కన్నీరు తెప్పిస్తున్నాయి.

# ఇరాన్ లో రాజరికం పునరాగమనం? అగ్రరాజ్యం మద్దతుతో రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు!

**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్‌లో ప్రస్తుతం ఉన్న ఇస్లామిక్ రిపబ్లిక్ ప్రభుత్వం పశ్చిమ దేశాల దాడులతో పతనం అంచున ఉందన్న వార్తల నేపథ్యంలో, బహిష్కృత మాజీ యువరాజు రెజా పహ్లావీ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఒకవేళ ఇరాన్‌లో ప్రస్తుత పాలన ముగిస్తే, దేశ బాధ్యతలను స్వీకరించడానికి తాను సిద్ధంగా ఉన్నట్లు ఆయన ప్రకటించారు. 1979లో ఇస్లామిక్ విప్లవం తర్వాత తన కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించినప్పటికీ, ఇరాన్ ప్రజల సంక్షేమం కోసం తిరిగి రావాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. దశాబ్దాలుగా అమెరికాలో ఉంటున్న పహ్లావీ, ఇప్పుడు ఇరాన్ రాజకీయాల్లోకి అధికారికంగా రీ-ఎంట్రీ ఇవ్వడానికి పావులు కదుపుతున్నారు.



**అభివృద్ధికి మాస్టర్ ప్లాన్!**

కేవలం అధికారాన్ని ఆశించడమే కాదు.. ఇరాన్‌ను తిరిగి గాడిలో పెట్టడానికి పహ్లావీ ఒక సమగ్ర ప్రణాళికను సిద్ధం చేశారు. దీనికి 'ఇరాన్ ప్రోస్పెరిటీ ప్రాజెక్ట్' అని పేరు పెట్టారు. యుద్ధం, అంతర్జాతీయ ఆంక్షల వల్ల చిన్నాభిన్నమైన దేశ ఆర్థిక వ్యవస్థను పునర్నిర్మించడం, దేశంలో శాంతి నెలకొల్పడం, మౌలిక సదుపాయాల మెరుగు ఈ ప్రాజెక్ట్ ప్రధాన లక్ష్యం. ఇరాన్ వద్ద ఉన్న అపారమైన చమురు సంపదను ప్రజల శ్రేయస్సు కోసం వాడతామని, ఇస్లామిక్ పాలనలో కోల్పోయిన అంతర్జాతీయ గౌరవాన్ని తిరిగి తెస్తానని హామీ ఇస్తున్నారు.

**పహ్లావీ వంశం పతనం!**

రెజా పహ్లావీ ఇరాన్ చివరి రాజు మహ్మద్ రెజా షా పహ్లావీ కుమారుడు. 1979లో ఇరాన్‌లో ఇస్లామిక్ విప్లవం మొదలై.. భారీ ఎత్తున అల్లర్లు చెలరేగడంతో మహ్మద్ రెజా షా పహ్లావీ తన ప్రాణాలు కాపాడుకోవడానికి అమెరికాకు పారిపోయారు. ఆ తర్వాత అయతుల్లా ఖమేనీ నేతృత్వంలో ఇస్లామిక్ ప్రభుత్వం ఏర్పడి, రాజరికాన్ని పూర్తిగా రద్దు చేయడమే కాకుండా పహ్లావీ కుటుంబాన్ని దేశం నుంచి బహిష్కరించింది. అప్పటి నుంచి ఈ కుటుంబం విదేశాల్లో ఉంటూ ప్రభుత్వానికి వ్యతిరేకంగా గళం విప్పుతోంది. ఇప్పుడు యుద్ధ పరిస్థితులు మళ్లీ ఈ రాజవంశానికి కొత్త ఆశలు చిగురింపజేస్తున్నాయి.

**యువత ఆలోచన**

ఇరాన్‌లో పెరుగుతున్న నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, కఠినమైన మతపరమైన నిబంధనల వల్ల విసిగిపోయిన ఒక వర్గం పహ్లావీ కాలం నాటి స్వేచ్ఛాయుత జీవనాన్ని కోరుకుంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ముఖ్యంగా మహిళా హక్కుల కోసం పోరాడుతున్న వారు, పాత రాజరికం కాలంలో ఉన్న సామాజిక స్వేచ్ఛను గుర్తు చేసుకుంటున్నారు. అయితే, మెజారిటీ ప్రజలు మళ్లీ రాజరికానికి మొగ్గు చూపుతారా? లేదా ప్రజాస్వామ్య వ్యవస్థను కోరుకుంటారా? అనేది సందేహమే. పహ్లావీ మాత్రం తాను కేవలం దేశాన్ని మార్పు వైపు నడిపించే ఒక సంధానకర్తగా ఉంటానని, భవిష్యత్తును ప్రజలే నిర్ణయిస్తారని చెబుతున్నారు. రెజా పహ్లావీ రాక ఇరాన్‌లో పెను మార్పులకు దారితీయవచ్చు లేదా మరింత అంతర్యుద్ధానికి దారితీయవచ్చు. అమెరికా మద్దతు ఉన్న పహ్లావీ

అధికారంలోకి వస్తే పశ్చిమ దేశాలతో ఇరాన్ సంబంధాలు మెరుగుపడే అవకాశం ఉంది. కానీ, 45 ఏళ్ల పాటు ఇరాన్ రాజకీయాల్లో లేని వ్యక్తిని ప్రజలు ఎంత వరకు నమ్ముతారనేది పెద్ద ప్రశ్న. యుద్ధం ముగిసిన తర్వాత ఇరాన్ ఒక కొత్త ప్రజాస్వామ్య దేశంగా మారుతుందా? లేక పహ్లావీ సారథ్యంలో మళ్లీ రాజరికం వైపు వెళ్తుందా? అన్నది కాలమే నిర్ణయించాలి. ఏది ఏమైనా, ఇరాన్ రాజకీయ చదరంగంలో పహ్లావీ ఇప్పుడు ఒక బలమైన పావుగా మారారు.

# సీబీఐపై వైఎస్ సునీత అసంతృప్తి, వివేకా హత్య కేసుపై సంచలన వ్యాఖ్యలు



**హైదరాబాద్ పెన్ పవర్:** మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసు దర్యాప్తుపై వైఎస్ సునీత్ మరోసారి తీవ్ర ఆరోపణలు చేశారు. దర్యాప్తు సంస్థ సీబీఐ బాధ్యతగా వ్యవహరించలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. వివేకా ఏడో వర్ధంతి సందర్భంగా సునీత పులివెందుల వెళ్లారు. ఈ సమయంలో మీడియాతో మాట్లాడుతూ సునీత తీవ్ర ఆరోపణలు చేశారు. హత్యపై ఇప్పటికీ తన అనుమానాలను నివృత్తి చేయలేదని సునీత వ్యాఖ్యానించారు. వివేకా హత్య కేసుపై దర్యాప్తు ముగిసిందని సీబీఐ సుప్రీంకోర్టుకు తెలిపింది. ఈ నేపథ్యంలో సునీత వ్యాఖ్యలు చర్చనీయాంశంగా మారాయి. హత్య కేసు దర్యాప్తు చేసిన సీబీఐ నిందితులు చెప్పిన అంశాలనే చెబుతోందని, వారు చెప్పినట్లు నడుచుకుంటోందని సునీత ఆరోపించారు. సీబీఐ లోతుగా దర్యాప్తు చేయలేదని విమర్శించారు. తన తండ్రి హత్య తర్వాత నిందితుల మధ్య జరిగిన ఫోన్ సంభాషణలు, మెసేజెస్ పై సీబీఐ దృష్టి పెట్టలేదని సునీత పెదవి విరిచారు. ఇంకా ఏమైనా ఆధారాలు ఉంటే ఇవ్వండని అడిగితే, తన వద్ద ఉన్న అదనపు ఆధారాలను సైతం కోర్టుతోపాటు సీబీఐకి సమర్పించినట్లు సునీత తెలిపారు. వివేకా హత్యపై తన సోదరుడు, మాజీ ముఖ్యమంత్రి జగన్మోహనరెడ్డి, ఆయన భార్య భారతీరెడ్డిని విచారించాలని సునీత డిమాండ్ చేశారు.తన తండ్రి హత్య కేసుపై తీవ్రస్థాయిలో పోరాటం చేస్తున్నానని, అయినా తనకు న్యాయం జరగడం లేదని వైఎస్ సునీత ఆవేదన వ్యక్తం చేశారు. చాలా బాధగా ఉందని, తన పోరాటం ఇంతటితో ఆగదని సునీత వెల్లడించారు. చివరి వరకు పోరాటం కొనసాగిస్తానని స్పష్టం చేశారు. మన దేశంలో వ్యవస్థలన్నీ ఇలానే ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సుప్రీం తీర్పు తర్వాత సునీత వ్యాఖ్యలు తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. వివేకా హత్య సమాచారం మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డికి ఎలా తెలిసింది? అన్న అంశంపై సునీత స్పష్టత కోరుతున్నారు.అయితే దర్యాప్తు సంస్థ ఆ అంశాన్ని మాత్రం పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికే మూడు చార్జిషీట్లు దాఖలు చేశామని, దర్యాప్తు ముగిసినట్లేనని సీబీఐ తేల్చిచెబుతోంది. కానీ, సునీత మాత్రం ఇంకా కొందరు నిందితులను గుర్తించాలని, అసలు సూత్రధారులు తప్పించుకున్నారని అంటున్నారు. దీంతో హత్య కేసు విచారణ కూడా ముందుకు సాగడం లేదు. వివేకా హత్య జరిగి నేటి ఏడేళ్లు పూర్తవుతోంది. 2019 మార్చి 15న మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగింది. రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర సంచలనం రేపిన హత్య కేసు ఇప్పటికీ అనేక మలుపులు తిరుగుతోంది.

# రప్పా.. రప్పా మాటకు మెగా బ్రదర్ డైరెక్ట్ పంచ్

**హైదరాబాద్ పెన్ పవర్:** ఓటమి నుంచి తప్పుల్ని పాఠాలుగా నేర్చుకోవటం అందరూ చేసేదే. కానీ.. తమకు ఎదురైంది ఘోర ఓటమి కాదు.. అందరూ కలిసి కుట్ర పన్నారన్న మైండ్ సెట్ తో ఉంటే..? వైసీపీ అధినేత మొదలు వైసీపీ కార్యకర్త వరకు అందరూ అలాంటి మైండ్ సెట్ లో ఉండటమే ఆసక్తికర అంశం. తమను ఓడించేందుకు మూడు పార్టీలు కలిసి కూటమిగా బరిలోకి దిగటం వల్లే ఓడామని.. అలా జట్టు కట్టిన తర్వాత కూడా ఏదేదో చేశారన్న సందేహాలతో తమ ఓటమికి జస్టిఫికేషన్ ఇచచ్చుకోవటం చూసినప్పుడు వైసీపీ వారి మైండ్ సెట్ కు విస్మయం చెందాల్సిందే.

సాధారణంగా ఎదురుదెబ్బలు తగిలినప్పుడు.. వాటి నుంచి పాఠాలు నేర్చుకొని.. ఆ తప్పులు మళ్లీ జరగకుండా జాగ్రత్తలు తీసుకోవటం కనిపిస్తుంది. కానీ.. వైసీపీ వారి నుంచి అలాంటివి ఆశించలేం. అందుకే.. సినిమాల్లోనే వెగటు కలిగించే రప్పా..రప్పా నరికేస్తామనే హింసాత్మక డైలాగ్ ను మరింత సినిమాటిక్ గా రియల్ లైఫ్ లో పార్టీ నినాదంగా మార్చటానికి మించిన తెగింపు ఇంకేం ఉంటుంది? కార్యకర్త మొదలు చిన్నపాటి నేత అత్యుత్సాహంతో అడుగులు వేస్తున్నప్పుడు.. అతడ్ని సరిదిద్దాల్సిన బాధ్యత పార్టీ ముఖ్యుల మీద ఉంటుంది. వారేమో రప్పా రప్పా నరుకుతామంటే.. అదేం సరిపోతుంది? మరింత మోతాదు పెంచడన్న రీతిలో వైసీపీలోని కొందరు తీరు..ఆ పార్టీపై వ్యతిరేకత భావాన్ని కలిగిస్తుంది. అలాంటి మాటలతో మైలేజీ కంటే డ్యామేజే కలుగుతుందన్న మాట రాజకీయ పార్టీలే కాదు..వివిధ పార్టీ నేతలు మొత్తుకుంటున్నా.. పట్టించుకోకపోవటం కనిపిస్తుంది.



తాజాగా మెగా బ్రదర్ కం జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కం ఎమ్మెల్సీ నాగబాబు మాట్లాడుతూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల నియోజకవర్గంలోని లావేరు మండల కేంద్రంలో జనసేన పార్టీ ఆవిర్భావ వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వైసీపీకి చెందిన వారు చేస్తున్న రప్పా రప్పా నరుకుతామనే నినాదాలపై స్పందించారు. "రప్పా రప్పా నరుకుతామంటే ఇప్పుడున్న సీట్లు కూడా రావు. 2024 ఎన్నికల్లో జనసేన ఒంటరిగా పోటీ చేసేలా వైసీపీ ఎన్నో కుట్రలు చేసింది. మళ్లీ జగన్ కు అవకాశం ఇవ్వకూడదని.. రాష్ట్ర ప్రయోజనాల కోసమే మేం కూటమితో పొత్తు పెట్టుకొని పోటీ చేశాం. మరోసారి వైసీపీకి అవకాశం ఇస్తే.. ప్రజలు ఏపీని విడిచి పెట్టి వెళ్లిపోవాల్సిన పరిస్థితి వస్తుంది" అని పేర్కొన్నారు.రాష్ట్రంలో మరో పదిహేనేళ్లు జనసేన. టీడీపీ.. బీజేపీ ఐక్యత సాగుతుందన్న నాగబాబు.. కూటమి కలిసి ఉన్నంతవరకు వైసీపీ ఆటలు సాగవన్నారు. వైసీపీ బెదిరింపులకు కార్యకర్తలు ఎవరూ భయపడాల్సిన అవసరం లేదన్నారు. త్వరలో జరిగే స్థానిక ఎన్నికల్లో ప్రతి కార్యకర్త కష్టపడి పని చేయాలన్న నాగబాబు.. వైసీపీ కార్యకర్తలు.. రప్పా రప్పా నరుకుతామన్న మాటలపై చేసిన తాజా వ్యాఖ్యలు ఆసక్తికరంగా మారాయి. మెగా బ్రదర్ చేసిన ఈ వ్యాఖ్యల్ని వైసీపీ అండ్ కో కాస్తంత సీరియస్ గా తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. వైసీపీ అధినాయకత్వం మరేం చేస్తుందో చూడాలి.

# టీడీపీ ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కు డ్రగ్ పాజిటివ్ : ఈగల్ ఎస్పీ గిరిధర్



**హైదరాబాద్ పెన్ పవర్:** తెలంగాణలో సంచలనంగా మారిన మొయినాబాద్ ఫాం హౌస్ డ్రగ్స్ కేసులో కీలక మలుపు చోటుచేసుకుంది. ఈ కేసులో ఇప్పటికే పలువురు ప్రముఖులకు డ్రగ్స్ పరీక్షల్లో పాజిటివ్ వచ్చిన నేపథ్యంలో తాజాగా తెలుగుదేశం పార్టీకి చెందిన ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్‌కు కూడా డ్రగ్స్ పాజిటివ్ అని నిర్ధారణ కావడం రెండు తెలుగు రాష్ట్రాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఈ విషయాన్ని ఈగల్ విభాగం ఎస్పీ గిరిధర్ అధికారికంగా వెల్లడించారు. పోలీసుల వివరాల ప్రకారం.. రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలంలోని అజీజ్‌నగర్ ప్రాంతంలో ఉన్న మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డికి చెందిన ఫాం హౌస్‌లో శనివారం రాత్రి అనుమతి లేకుండా భారీ స్థాయిలో డ్రగ్స్ పార్టీ జరుగుతున్నట్లు సమాచారం అందింది. దీంతో రాత్రి సుమారు 9.30 గంటల సమయంలో ఈగల్ టీమ్, ఎస్‌వోటీ సిబ్బంది, స్థానిక పోలీసులు కలిసి ఫాం హౌస్‌పై ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. పోలీసులు అక్కడికి చేరుకున్న వెంటనే అక్కడ ఉన్నవారు భయంతో గందరగోళానికి గురయ్యారు. ఈ సమయంలో ఢిల్లీకి చెందిన వ్యాపారవేత్త నమీద్ మిశ్రా గాల్లోకి ఒక రౌండ్ కాల్పులు జరిపినట్లు పోలీసులు తెలిపారు. ఆ తుపాకీ మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి సోదరుడు రితేష్ రెడ్డిదిగా పోలీసులు గుర్తించారు. ఈ సంఘటనతో అక్కడ పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారింది. ఆ సమయంలో ఫాం హౌస్‌లో మొత్తం 11 మంది ఉన్నట్లు పోలీసులు తెలిపారు. వీరిలో మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్ రెడ్డి, ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్, ఢిల్లీ వ్యాపారి నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డి సహా పలువురు వ్యాపారవేత్తలు మరియు ఒక మహిళ కూడా ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు నిర్వహించిన ప్రాథమిక డ్రగ్స్ పరీక్షల్లో మొదటగా పైలట్ రోహిత్ రెడ్డి, నమీద్ మిశ్రా, రితేష్ రెడ్డి, కౌశిక్ రవి, అర్జున్ రెడ్డిలకు డ్రగ్స్ పాజిటివ్‌గా తేలింది. అయితే శనివారం రాత్రి నిర్వహించిన తొలి పరీక్షల్లో ఎంపీ పుట్టా మహేష్‌కు నెగిటివ్ వచ్చినప్పటికీ ఆదివారం ఉదయం నిర్వహించిన తదుపరి పరీక్షల్లో డ్రగ్స్ పాజిటివ్‌గా నిర్ధారణ అయ్యింది. శరీరంలోని మెటబాలిజం ప్రభావం కారణంగా ఈ మార్పు వచ్చినట్లు ఈగల్ ఎస్పీ గిరిధర్ వివరించారు.

దర్యాప్తులో భాగంగా నిందితులు ఇటీవల సిమ్లా , గోవా పర్యటనలకు వెళ్లిన సమయంలో డ్రగ్స్‌ను సేకరించి తీసుకువచ్చి ఈ పార్టీలో వినియోగించినట్లు పోలీసులు గుర్తించారు. ఫాం హౌస్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో సుమారు 2 గ్రాముల కొకైన్ పౌడర్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్స్ నమూనాలను మరింత పరీక్షల కోసం ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్ కు పంపించారు. ఈ ఘటనలో పాల్గొన్న వారిపై పోలీసులు పలు చట్టాల కింద కేసులు నమోదు చేసి దర్యాప్తును కొనసాగిస్తున్నారు. ఈ కేసులో ఎంతటి పెద్దవారు ఉన్నా సరే ఎంపీలు అయినా మాజీ ఎమ్మెల్యేలు అయినా చట్టం ముందు అందరూ సమానమేనని ఎస్పీ గిరిధర్ స్పష్టం చేశారు. చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే, సిట్టింగ్ ఎంపీ డ్రగ్స్ కేసులో పట్టుబడటం రెండు తెలుగు రాష్ట్రాల్లో రాజకీయంగా పెద్ద దుమారం రేపుతోంది. ఒకవైపు ప్రభుత్వాలు డ్రగ్స్ నిర్మూలన కోసం ప్రత్యేక చర్యలు చేపడుతుంటే ప్రజాప్రతినిధులే డ్రగ్స్ వినియోగిస్తున్నారన్న వార్తలు బయటకు రావడంతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం వ్యక్తమవుతోంది. ఈ కేసు రాజకీయ వర్గాల్లోనే కాకుండా సామాజికంగా కూడా పెద్ద చర్చకు దారి తీసింది.

# ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ.. డ్రగ్స్ కేసులో పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ బిగుస్తున్న ఉచ్చు..

**హైదరాబాద్ పెన్ పవర్:** మొయినాబాద్ ఫాంహౌస్ డ్రగ్స్ కేసు రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ కేసులో వెలుగుచూస్తున్న పరిణామాలు, పోలీసుల దర్యాప్తు తీరు ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారాయి.



**మొయినాబాద్ ఫాంహౌస్‌లో ఏం జరిగింది?**

హైదరాబాద్ శివార్లలోని మొయినాబాద్‌లోని ఒక ఫాంహౌస్‌లో ఇటీవల జరిగిన వీకెండ్ పార్టీపై 'ఈగల్ టీమ్' పోలీసులు మెరుపు దాడులు చేశారు. విలాసవంతమైన పార్టీ జరుగుతుండగా పోలీసులు రంగప్రవేశం చేయడంతో అక్కడ ఉన్న వారంతా ఒక్కసారిగా షాక్‌కు గురయ్యారు. ఈ దాడుల్లో పోలీసులు మొత్తం 11 మందిని అదుపులోకి తీసుకున్నారు. వైద్య పరీక్షలు నిర్వహించగా వారిలో ఆరుగురు డ్రగ్స్ తీసుకున్నట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయ్యింది.

**పైలెట్ రోహిత్ రెడ్డి చుట్టూ తిరుగుతున్న విచారణ**

ఈ కేసులో ప్రధానంగా బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి పేరు ప్రముఖంగా వినిపిస్తోంది. ఈ పార్టీలో ఆయనతో పాటు ఆయన సోదరుడు రితేష్ రెడ్డి, ఏపీలోని ఏలూరు టీడీపీ ఎంపీ పుట్టా మహేష్ కుమార్ యాదవ్ కూడా ఉన్నట్లు తేలింది. వీరంతా డ్రగ్స్ తీసుకున్నట్లు బయటపడటంతో రాజకీయ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది.

**ధ్వంసమైన ఐఫోన్‌ల మిస్టరీ**

పోలీసుల దర్యాప్తులో అత్యంత కీలకమైన అంశం ఏమిటంటే దాడుల సమయంలో ఫాంహౌస్‌లో రెండు ఐఫోన్‌లను ధ్వంసం చేయడం. విచారణలో భాగంగా ఆ ఫోన్‌లు పైలెట్ రోహిత్ రెడ్డి , అతని పీఏ శ్రవణ్‌కు చెందినవని పోలీసులు గుర్తించారు. ఆ ఫోన్‌లను రోహిత్ రెడ్డే స్వయంగా ధ్వంసం చేసినట్లు ప్రాథమిక విచారణలో తేలింది. ప్రస్తుతం ఈ ఫోన్‌లలో ఉన్న డేటా, వాట్సాప్ చాట్స్ మరియు డ్రగ్స్ సరఫరాదారుల వివరాలను రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. దీనికోసం పీఏ శ్రవణ్‌ను పోలీసులు విచారిస్తున్నారు. అతను వెల్లడించే వివరాలు ఈ కేసులో కీలక మలుపు తిరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు.

**జీవో నంబర్.4 ప్రాధాన్యత.. కౌన్సిలింగ్ వైపు మొగ్గు?**

ఈ కేసులో మరో ముఖ్యమైన అంశం 'జీవో నంబర్.4'. డ్రగ్స్ కేసుల్లో తొలిసారి పట్టుబడిన వారికి కఠిన చర్యల కంటే కౌన్సిలింగ్‌కు ప్రాధాన్యతనివ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ జీవోను జారీ చేసింది. డ్రగ్స్‌కు బానిసలైన వారిని సంస్కరించే క్రమంలో నేర ప్రవృత్తి లేని వారిని సాధారణ వ్యక్తులుగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశ్యం. అయితే ఈ కేసులో నిందితులు బాధ్యతాయుతమైన పదవుల్లో ఉన్న వ్యక్తులు కావడంతో పోలీసులు చట్టప్రకారం కఠినంగా వ్యవహరిస్తారా లేదా జీవో ప్రకారం కౌన్సిలింగ్‌కు పరిమితం చేస్తారా అనేది ఉత్కంఠగా మారింది.

ప్రస్తుతం ఈ 11 మంది నిందితులను కోర్టులో హాజరుపరిచేందుకు పోలీసులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేస్తున్నారు. డ్రగ్స్ సరఫరా వెనుక ఉన్న నెట్‌వర్క్ ఎంత పెద్దది? దీని వెనుక ఉన్న సూత్రధారులెవరు? అనే కోణంలో దర్యాప్తు కొనసాగుతోంది. ఈగల్ టీమ్ చేపట్టిన ఈ ఆపరేషన్ రాష్ట్రంలో డ్రగ్స్ రహిత సమాజం కోసం తీసుకుంటున్న చర్యలకు నిదర్శనమని పోలీసులు చెబుతున్నారు. విచారణలో వెలుగులోకి వచ్చే మరిన్ని నిజాలు ఎవరెవరి మెడకు చుట్టుకుంటాయో వేచి చూడాలి.

Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001 and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965

# బంపర్ ఆఫర్లతో విజయ్ పార్టీ ఉక్కిరి బిక్కిరి



**హైదరాబాద్ పెన్ పవర్:** తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో ఈసారి అతి పెద్ద ఆకర్షణ దళపతి విజయ్ కి చెందిన టీవీకే పార్టీ. ఈ కొత్త పార్టీ ఇంకా ఎన్నికల కురుక్షేత్రంలోకి దిగలేదు, తన సామర్థ్యం ఏమిటి అన్నది నిరూపించుకోలేదు, కానీ టీవీకే పవర్ ఏంటో ప్రత్యర్థులకు అపుడే తెలిసి వచ్చినట్లుంది. అందుకే విజయ్ పార్టీ చుట్టూనే తమిళ రాజకీయాలు చక్కర్లు కొడుతున్నాయి.

**అడగకుండానే ఆఫర్లు :**
మాకు ఎవరితో పొత్తు లేదు మేము ఒంటరిగానే పోటీ చేస్తామని విజయ్ పార్టీ ఎంతగా చెప్పుకుంటున్నా బీజేపీ నుంచి వరసబెట్టి ఆఫర్లు వచ్చి పడుతున్నాయని అంటున్నారు. లేటెస్ట్ గా చూస్తే అదిరిపోయే ఒక ఆఫర్ బీజేపీ విజయ్ పార్టీకి ఇచ్చినట్లుగా ప్రచారం సాగుతోంది. ఈ ఆఫర్ ప్రకారం చూస్తే మొత్తం తమిళనాడు అసెంబ్లీ సీట్లలో మూడవ వంతు సీట్లను పొత్తులో భాగంగా విజయ్ పార్టీకి ఇచ్చేందుకు బీజేపీ రెడీ అయింది అని అంటున్నారు. అంటే ఒక బ్రహ్మాండమైన ఆఫర్ గా బీజేపీ టీవీకే ముందు పెట్టినట్లుగా చెబుతున్నారు. 80 సీట్లతో పాటు ఉప ముఖ్యమంత్రి పదవిని కూడా విజయ్ కి ఇవ్వాలని బీజేపీ డిసైడ్ అయింది అని అంటున్నారు.

**తెర వెనక ఒక ఉప ముఖ్యమంత్రి :**
ఇక బీజేపీ ప్రతిపాదనలు విజయ్ పార్టీకి చేరవేసేందుకు ఈ మొత్తం రాయబారం వెనక ఒక రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి ఉన్నారని కూడా ప్రచారం సాగుతోంది. ఆ ఉప ముఖ్యమంత్రి కూడా సినీ హీరో కావడంతో పాటు విజయ్ తో సన్నిహిత సంబంధాలు ఉండడంతో ఆయన విజయ్ ని ఎన్డీయేలోకి తీసుకుని వచ్చేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లుగా చెబుతున్నారు. తన రాష్ట్రంలో తాను ఎదుర్కొన్న అనుభవాలు తాను సాధించిన విజయాలు అన్నీ ముందు పెట్టి త్రిముఖ పోరులో కొత్త పార్టీ ఎదుర్కొనే కష్టాలు సవాళ్ళు వివరించే ప్రయత్నం చేస్తున్నారు అని అంటున్నారు.

**సీఎం సీటుకే గురి :**
అయితే విజయ్ పార్టీ వైపు నుంచి చూస్తే బీజేపీతో పొత్తుకు విముఖంగానే ఉన్నట్లుగా చెబుతున్నారు. పైపెచ్చు తమిళనాడులో దళపతిగా జనాలలో సూపర్ స్టార్ ఇమేజ్ ని సాధించిన విజయ్ గురి ఏకంగా సీఎం సీటు మీదనే ఉంది అని అంటున్నారు. దాంతో ఒంటరిగానే పోటీకి దిగి తమకంటూ కీలకమైన సంఖ్యా బలంతో సీట్లను సాధిస్తే ఎన్నికల అనంతరం హంగ్ ఏర్పడుతుందని వస్తున్న వారతల నేపథ్యంలో కింగ్ మేకర్ కాకుండా ఏకంగా కింగ్ అయ్యే చాన్స్ ఉంటుందని విజయ్ పార్టీ తరఫున వారు ఆలోచిస్తున్నారు అని చెబుతున్నారు. ఈ తరహా ఎత్తుగడలతోనే తమ ఆప్షన్లు అన్నీ ఓపెన్ గా చేసి పెట్టుకున్నారని చెబుతున్నారు.

**తమిళనాడుకు కొత్త సీఎం గా :**
ఎన్నికల అనంతరం రాజకీయ ముఖ చిత్రం క్లియర్ గా ఉంటుందని ఏ పార్టీకి మెజారిటీ రాకపోతే విజయ్ పార్టీ సీట్లే అతి ముఖ్యమవుతాయని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న అంచనాలు సర్వేల బట్టి చూస్తే ముప్పయి సీట్లకు తక్కువ కాకుండా విజయ్ పార్టీ గెలుస్తుంది అని అంటున్నారు. ఎన్నికలు దగ్గర పడే కొద్దీ ఈ నంబర్ పెరిగి ఒక యాభై సీట్లు తెచ్చుకుంటే చాలు తమిళనాడుకు కొత్త సీఎం గా విజయ్ అవుతారు అని ఆ పార్టీ నేతలు వ్యూహరచన చేస్తున్నారు అని అంటున్నారు. మొత్తం మీద చూస్తే విజయ్ పార్టీ ఆలోచనలు ఏ విధంగా ఉన్నా విపక్షంలో ఉన్న బీజేపీ అన్నా డీఎంకేకి మాత్రం ఓట్ల చీలిక వ్యవహారం అతి పెద్ద సమస్యగా మారుతుంది అన్న కంగారు అయితే పట్టుకుంది అని అంటున్నారు. చూడాలి మరి ఈ ప్రచారాలు ఊహాగానాలు వ్యూహాలలో ఏవి నిజం అవుతాయో.

# స్కూల్ లో విద్యార్థినుల అర్థనగ్న కార్యక్రమాలు.. సభ్యసమాజం నివ్వెర!



**హైదరాబాద్ పెన్ పవర్:** కోల్‌కతాలోని ఒక పాఠశాలలో జరిగిన సాంస్కృతిక కార్యక్రమం దేశ వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. సాధారణంగా స్కూల్ ఈవెంట్లలో దేశభక్తి గీతాలు, జానపద నృత్యాలు లేదా సామాజిక సందేశాన్నిచ్చే నాటికలు ప్రదర్శిస్తారు. కానీ, ఇక్కడ అందుకు భిన్నంగా స్కూల్ విద్యార్థినులు కేవలం టవల్ చుట్టుకొని, అర్ధనగ్నంగా కనిపించేలా నృత్యం చేయడం అందరినీ షాక్‌కు గురిచేసింది. ఈ ప్రదర్శనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో ప్రత్యక్షం కావడంతో, అసలు అది స్కూల్ ఈవెంటేనా లేక మరేదైనా ప్రైవేట్ ప్రోగ్రామా అని నెటిజన్లు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. విద్యాబుద్ధులు నేర్పించాల్సిన చోట ఇలాంటి ప్రదర్శనలు ఏంటి? అంటూ తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది.

**యాజమాన్యం, తల్లిదండ్రుల పట్టించుకోరా?**
ఈ ఘటనపై నెటిజన్లు ప్రధానంగా స్కూల్ యాజమాన్యాన్ని, విద్యార్థినుల తల్లిదండ్రులను నిలదీస్తున్నారు. చిన్నపిల్లలు చేసే పనులకు పెద్దల పర్యవేక్షణ ఉండాలి. స్కూల్ స్టేజీపై ప్రదర్శన ఇచ్చే ముందు రిహార్సల్స్ జరుగుతాయి, దుస్తులను ఎంపిక చేస్తారు. మరి ఇవన్నీ జరుగుతున్నప్పుడు ఉపాధ్యాయులు లేదా ప్రిన్సిపాల్ ఏం చేస్తున్నారని నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'తమ పిల్లలు అశ్లీలతకు దగ్గరగా ఉండే ఇలాంటి డాన్సులు చేస్తుంటే తల్లిదండ్రులు ఎలా అనుమతించారు? అసలు వారికి బుద్ధి ఉందా?' అంటూ సామాజిక మాధ్యమాల్లో ఘాటుగా ప్రశ్నలు వెల్లువెత్తుతున్నాయి.

**దారి తప్పుతున్న బాల్యం!**
ప్రస్తుత రోజుల్లో రీల్స్, షార్ట్ వీడియోల పిచ్చి విద్యార్థులను ఏ స్థాయికి తీసుకెళ్తోందో ఈ ఘటన అద్దం పడుతుందని చెప్పవచ్చు. సోషల్ మీడియాలో వైరల్ కావాలనే కోరికతో లేదంటే అక్కడ ట్రెండ్ అవుతున్న అసభ్యకర పాటలకు స్టెప్పులు వేయాలనే ఉత్సాహంతో విద్యార్థులు హద్దులు దాటుతున్నారు. స్కూల్ యాజమాన్యాలు కూడా వినోదం పేరుతో ఇలాంటి వాటిని ప్రోత్సహించడం వల్ల విద్యాసంస్థల పవిత్రత దెబ్బతింటోంది. విద్యార్థుల మానసిక వికాసానికి తోడ్పడాల్సిన కార్యక్రమాలు, వారిని తప్పుడు మార్గంలో నడిపించేలా ఉండడం ఆందోళన కలిగించే అంశం.

**పెరుగుతున్న ఆందోళన!**
ఈ ఘటన జరిగి వీడియో వైరల్ అవుతున్నప్పటికీ, అటు పాఠశాల యాజమాన్యం నుంచి గానీ, ఇటు విద్యాశాఖ అధికారుల నుంచి గానీ ఎలాంటి అధికారిక స్పందన రాలేదు. ఇటువంటి ఉదంతాలపై కఠినమైన చర్యలు తీసుకోకపోతే, భవిష్యత్తులో మరిన్ని పాఠశాలల్లో ఇవే సంప్రదాయాలు మొదలయ్యే ప్రమాదం ఉంది. పశ్చిమ బెంగాల్ విద్యాశాఖ దీనిపై విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని నెటిజన్లు డిమాండ్ చేస్తున్నారు. కేవలం వినోదం కోసం విలువలని బలిపీఠం ఎక్కించడం సరైంది కాదని అందరూ అభిప్రాయపడుతున్నారు.

# దీదీకే బెంగాలీలు జై.. ఓట్ వైబ్ సర్వే నిజం కాదా?



**హైదరాబాద్ పెన్ పవర్:** రాజకీయం ఎంత కఠినంగా ఉంటుందో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. తమకు ప్రయోజనం కలిగించే అంశాల విషయంలో ఎంతటి కరకు నిర్ణయాలకైనా వెనుకాడవు. గతానికి భిన్నంగా అత్యాధునిక టెక్నాలజీ అందుబాటులోకి వచ్చిన వేళ..తిమ్మిని బమ్మిని చేయటం ఒక ఆర్ట్. ఇటీవల కాలంలో పోల్ మేనేజ్ మెంట్ రూపురేఖలు పూర్తిగా మారింది. విటమిన్ ఎంను ప్రయోగించాలే కానీ..అబద్ధాల్ని అక్షర సత్యాలుగా ప్రచారం చేసే ప్లాట్ ఫాలకు కొదవలేదు. ఇదంతా ఎందుకంటే.. తాజాగా పశ్చిమ బెంగాల్ లో త్వరలో జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో బెంగాలీలు ఎటువైపు ఉన్నారు? అన్న అంశంపై తాము సర్వే చేశామని.. దాని ఫలితాలు ఇలా ఉన్నాయంటూ "ఓట్ వైబ్" అనే సర్వే సంస్థ తాజాగా వెల్లడించింది. అందులో మమతా బెనర్జీకి సానుకూలత ఉందని.. ఆమెను బెంగాలీ ఓటర్లు ఇప్పటికి ఆదరిస్తున్నట్లుగా పేర్కొంది. ఈ సర్వే రిపోర్టును చదివినప్పుడు.. జాగ్రత్తగా పరిశీలించినప్పుడు కొత్త సందేహాలు వ్యక్తమయ్యాయి. అందులో ముఖ్యమైనది.. ఈ సర్వే ఎప్పుడు విడుదల చేశారు? ఏ సంస్థ దీన్ని తొలుత పబ్లిష్ చేసింది? ఆ తర్వాత ఇదెన్ని మీడియా వేదికల మీద ఫోకస్ అయ్యిందన్నది మర్చిపోకూడదు. ఈ సందేహాన్ని రివర్స్ ఇంజినీరింగ్ ద్వారా వెతకటం చూస్తే.. సర్వేలో పేర్కొన్న అంశాల కంటే కూడా.. ఈ సర్వే సంస్థ.. ముక్కలు ముక్కలుగా పలు మీడియా సంస్థల్లో వార్తల రూపంలో జొప్పించే తీరు ఇప్పుడు హాట్ టాపిక్ గా మారింది.

పలు వేదికలను షేర్ చేసుకోవటానికి ముందు విస్మయానికి గురయ్యే మొదటి అంశం.. ఈ సర్వే తొలిసారి జనవరిలో విడుదలైంది. మరింత వివరంగా చెప్పాలంటే.. 2026 జనవరి ఆరున డిజిటల్ ఫ్లాట్ ఫారమ్స్ మీద మొదటిసారి బయటకు వచ్చింది. న్యూస్ టాక్ అనే యూట్యూబ్ చానల్ లో జనవరి ఆరు, మధ్యాహ్నం ఒంటి గంటన్నర ప్రాంతంలో ఈ సర్వే మీద విశ్లేషణ మొదలైంది. ఆ తర్వాత జనవరి 30న న్యూస్ 24 హిందీ చానల్ తన ప్రైమ్ టైమ్ డిబేట్ లో మొదటి సర్వేగా ప్రసారం చేసింది.ఫిబ్రవరి 2026లో బెంగాల్ ఓటర్ల జాబితా సవరణ జరుగుతున్న వేళ.. ఈ సర్వే వివరాల్నిమరోసారి రీ ప్యాకేజీ చేసి మార్చి మొదటి వారంలో వైరల్ చేయటం కనిపిస్తుంది. అలా దఫదఫాలుగా విడుదల కావటం.. ఎప్పటికప్పుడు కొత్త సంస్థ అన్నట్లు వేర్వేరు మీడియా సంస్థల్లో పబ్లిష్ కావటం కనిపిస్తుంది. ఇంతకూ ఈ సర్వే సంస్థ వెనుక ఉన్నది ఎవరు? అతడేం చేస్తుంటారు? లాంటివి చూస్తే.. తాజా సర్వే అంటూ జరుగుతున్న ప్రచారం వెనుక అమితాబ్ తివారీ ఉన్నారు. గతంలో ఆయన వివిధ జాతీయ ఛానళ్లకు తన సొంత సంస్థ ద్వారా విడుదల చేస్తుంటారన్న మాట బలంగా వినిపిస్తోంది.కొన్ని డిజిటల్ మీడియా సంస్థల్లో వెల్లడైన ఫలితాలు.. మిగిలిన అంశాలను చూస్తే..కొన్ని తక్కువ పాపులార్టీ

ఉన్న న్యూస్ వెబ్ సైట్స్ లో స్పాన్సర్డ్ ట్యాగ్ తో రిపోర్టులు కనిపించటం గమనార్హం. జనవరిలో వచ్చిన సర్వేను.. తాజాగా విడుదలైన సర్వేగా కొన్ని మీడియాసంస్థల్లో వార్తా కథనాలుగా కనిపించటం విశేషం. కొత్త సీసాలో పాతసారా పేరుతో వ్యవహారం నడుస్తుందని చెప్పక తప్పదు. ఇక్కడే మరో అంశాన్ని గమనించాలి. పశ్చిమ బెంగాల్ ఎన్నికల షెడ్యూల్ వెలువడటానికి కౌంట్ డౌన్ మొదలైన వేళ.. ఈ సర్వేను పెద్దగా పట్టలేదు. ఇప్పుడు మరోసారి సర్వే పేరుతో వెలుగు చూడటం.. ప్రస్తుత ముఖ్యమంత్రి సేఫ్ పొజిషన్ లో ఉన్నట్లుగా ఈ సర్వే సారాంశాన్ని చెప్పొచ్చు. అప్పుడెప్పుడో జనవరిలో విడుదల చేయించిన సర్వే.. సరికొత్త ఓపినియన్ పోల్ ఫలితాల మాదిరి విడుదల చేయటం విశేషంగా చెప్పాలి. పాత సర్వే రిపోర్టును లేటెస్ట్ ఓపీనియన్ పోల్.. రౌండ్ 2 థీమాటిక్ సర్వే పేరుతో సరికొత్తగా పబ్లిష్ చేయటం గమనార్హం. ఇదంతా చూస్తే.. ఎంతో నమ్మకమైన సంస్థలు సైతం ఈ తప్పుడు సంప్రదాయానికి తెర తీయటం ద్వారా విశ్వసనీయతకు భంగం వాటిల్లదని చెప్పాలి.

# రాబోయే 48 గంటలు అత్యంత కీలకం.. ఖమేనీ ఆరోగ్యంపై భారత ఏజెన్సీల నివేదిక..



**హైదరాబాద్ పెన్ పవర్:** మొజ్తబా ఖమేనీ మరణించారనే ఊహాగానాలు ప్రపంచ వ్యాప్తంగా జోరందుకున్న సమయంలో, భారత ఇంటెలిజెన్స్ బ్యూరో కీలక సమాచారాన్ని వెలుగులోకి తెచ్చింది. ఇరాన్ కొత్త సుప్రీం లీడర్ ప్రాణాలతో ఉన్నాడని, అయితే ఆయన పరిస్థితి అత్యంత విషమంగా ఉందని భారత నిఘా వర్గాలు ధృవీకరించాయి. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ఆయన తండ్రి అయతొల్లా అలీ ఖమేనీ మరణించగా, మొజ్తబా గాయపడి కదలలేని స్థితిలో ఉన్నారని సమాచారం. ప్రాణాపాయం నుంచి బయటపడినప్పటికీ, ఆయన శారీరక సామర్థ్యంపై భారత నిఘా వర్గాలు నిరంతరం నిఘా ఉంచాయి.

**'ది సన్' సంచలన కథనం!**
బ్రిటిష్ వార్తాపత్రిక 'ది సన్' ప్రచురించిన కథనం ప్రకారం, మొజ్తబా ఖమేనీ ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. ఆయన ప్రస్తుతం కోమాలో ఉన్నారని, దాడుల వల్ల కలిగిన తీవ్ర గాయాల కారణంగా ఆయన ఒక కాలును (లేదా రెండు కాళ్లను) వైద్యులు తొలగించాల్సి వచ్చిందని విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పత్రిక పేర్కొంది. మొజ్తబా కాలేయం లేదా జీర్ణాశయం కూడా దెబ్బతిన్నాయని, ప్రస్తుతం సీనా యూనివర్సిటీ ఆసుపత్రిలోని రహస్య విభాగంలో భద్రత మధ్య చికిత్స అందిస్తున్నారని సమాచారం. ఈ వార్తలు ఇరాన్ ప్రభుత్వ వర్గాల్లో కలకలం రేపుతున్నాయి.

**కఠిన ఆంక్షలు!**
మొజ్తబా ఖమేనీకి సంబంధించిన ప్రతి చిన్న విషయాన్ని ఇరాన్ రివాల్యూషనరీ గార్డ్స్ తన నియంత్రణలో ఉంచుకుంది. ఆయన చికిత్స తీసుకుంటున్న ప్రాంతాన్ని తన ఆధీనంలోకి తీసుకున్న ఐఆర్జీసీ, కమ్యూనికేషన్లపై కఠినమైన ఆంక్షలు విధించింది. సుప్రీం లీడర్ ఆరోగ్యం గురించిన నెగటివ్ సమాచారం బయటకు వస్తే దేశంలో అస్థిరత ఏర్పడే ప్రమాదం ఉందని, లేదా శత్రు దేశాలు ఈ బలహీనతను ఆసరాగా చేసుకొని మరిన్ని దాడులు చేస్తాయని ఐఆర్జీసీ భావిస్తోంది. అందుకే ఆయనకు సంబంధించిన సమాచారాన్ని కేవలం పరిమితంగా, అది కూడా కేవలం రాతపూర్వక సందేశాల రూపంలోనే విడుదల చేస్తోంది.

**కనపడని నేత**
సుప్రీం లీడర్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా మొజ్తబా ఖమేనీ ఎక్కడా బహిరంగంగా కనిపించకపోవడం లేదంటే వీడియో సందేశం ఇవ్వకపోవడం పలు అనుమానాలను బలపరుస్తోంది. ఇటీవల ఆయన పేరుతో విడుదలైన మొదటి సందేశం కూడా ఒక న్యూస్ రీడర్ ద్వారా చదవడమే తప్ప, ఆయన ప్రత్యక్షంగా మాట్లాడలేదు. మార్చి 9న జరిగిన పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో ఆయన కనపడలేదు. ఇరాన్ స్టేట్ మీడియా ఆయనను 'జన్బాజ్' (యుద్ధంలో గాయపడిన వీరుడు) అని సంబోధించడం గమనార్హం. ఇది ఆయన తీవ్రంగా గాయపడ్డారనే విషయాన్ని పరోక్షంగా అంగీకరించడమేనని విశ్లేషకులు భావిస్తున్నారు. మొజ్తబా ఖమేనీ ప్రాణాలతో ఉన్నారనే భారత నిఘా వర్గాల రిపోర్ట్ ఇరాన్ కు కొంత ఊరటనిచ్చినప్పటికీ, ఆయన కదలలేని స్థితిలో ఉండడం పాలనపై ప్రభావం చూపుతోంది. సుప్రీం లీడర్ బలహీనంగా ఉన్నారనే వార్త ప్రజల్లో లేదంటే సైన్యంలో అసంతృప్తికి దారితీయకుండా ఐఆర్జీసీ జాగ్రత్త పడుతోంది. ఒక అదృశ్య నేత ఎంతకాలం దేశాన్ని నడిపించగలరనేది ప్రధాన ప్రశ్న. యుద్ధం తీవ్రమవుతున్న వేళ, ఖమేనీ ఆరోగ్య స్థితిని గోప్యంగా ఉంచడం ద్వారా ఇరాన్ తన పట్టు కాపాడుకోగలదా లేక ఇది మరింత గందరగోళానికి దారితీస్తుందా అనేది కాలమే నిర్ణయించాలి.

# హౌతీల ముప్పు.. మరో జలసంధి క్లోజ్!!



**హైదరాబాద్ పెన్ పవర్:** ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం తీవ్రరూపం దాల్చుతోంది. ఇరు దేశాలు వెనక్కి తగ్గడంలేదు. దీంతో ప్రపంచ వ్యాప్తంగా చమురు సంక్షోభం నెలకొనే పరిస్థితి భయపెడుతోంది. ఇప్పటికే హోర్ముజ్ జలసంధిని ఇరాన్ మూసివేసింది. దీంతో చమురు, గ్యాస్ సరఫరా అస్తవ్యస్తమైంది. ఇలాంటి సమయంలో బాబ్ ఎల్ - మండేబ్ జల సంధిని మూసివేస్తామని ఇరాన్ మద్దతుదారులైన హౌతీ తీవ్రవాదులు హెచ్చరించడం ఆందోళనకరంగా మారింది. ఆఫ్రికా ఖండానికి అరేబియా ద్వీపకల్పానికి మధ్య ఉన్న బాబ్ ఎల్ - మండేబ్ జల సంధి ప్రపంచ వాణిజ్యానికి అత్యంత కీలకం. ఈ జల సంధిపై హౌతీ తిరుగుబాటుదారులు ఫోకస్ చేయడం గ్లోబల్ ట్రేడ్ ను తీవ్రంగా ప్రభావితం చేస్తుందని అంటున్నారు.

ప్రపంచ వాణిజ్యంలో బాబ్ ఎల్ - మండేబ్ జల సంధి ఒక "చోక్ పాయింట్" గా చెబుతారు. అంటే, ఇక్కడ రవాణా ఆగిపోతే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడుతుందని అంటున్నారు. ఆసియా నుండి యూరప్‌కు వెళ్లే నౌకలు సూయజ్ కాలువను చేరుకోవాలంటే తప్పనిసరిగా బాబ్ ఎల్-మండేబ్ దాటాల్సిందే. ప్రపంచవ్యాప్తంగా జరిగే సముద్ర వాణిజ్యంలో సుమారు 10 నుంచి 12 శాతం వరకు ఈ చిన్న జలసంధి గుండానే జరుగుతుంది. ఏటా వేల సంఖ్యలో వాణిజ్య నౌకలు దీని గుండా ప్రయాణిస్తాయి. ముడి చమురు, సహజ వాయువు రవాణాకు ఇది అత్యంత కీలకమైన మార్గం. పర్షియన్ గల్ఫ్ దేశాలు అయిన సౌదీ అరేబియా, యూఏఈ, కువైట్ నుండి యూరప్, అమెరికాకు వెళ్లే చమురు ట్యాంకర్లు ఈ మార్గం ద్వారానే వెళ్తాయి. యెమెన్‌లోని హౌతీ తిరుగుబాటుదారులు ఈ జలసంధికి సమీపంలోనే ఉంటారు. వారు క్షిపణులు లేదా డ్రోన్లతో నౌకలపై దాడులు చేస్తే ఈ జలసంధి మూతపడే అవకాశం ఉందనే సమాచారం ప్రపంచాన్ని భయపెడుతోంది. అయితే ప్రస్తుతం అమెరికా ఈ జలసంధిపై పూర్తి నిఘా ఉంచింది.

ఒకవేళ హౌతీలు ఈ మార్గాన్ని మూసివేస్తే, నౌకలు ఆఫ్రికా ఖండం చుట్టూ తిరిగి వెళ్లాల్సి ఉంటుంది. దీనివల్ల ప్రయాణ దూరం పెరిగిపోనుంది. సుమారు 6,000 నుంచి 9,000 కిలోమీటర్లు దూరం పెరగడం వల్ల ఖర్చులు మోయలేని భారంగా మారుతాయని అంటున్నారు. అంతేకాకుండా చమురు సరఫరా ఆలస్యమై ప్రపంచవ్యాప్తంగా పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని విధంగా పెరిగిపోయే ప్రమాదం ఉందని అంటున్నారు. అదేవిధంగా షిప్పింగ్ ఛార్జీలు పెరుగుతాయని చెబుతున్నారు. బీమా ఖర్చులు, రవాణా ఖర్చులు పెరిగి వస్తువుల ధరలు ఆకాశాన్ని తాకే అవకాశం ఉందని అంటున్నారు.హోర్ముజ్ తోపాటు బాబ్ ఎల్ - మండేబ్ జలసంధి మూతపడితే ప్రపంచం ఊహించని ఆర్థిక విలయాన్ని ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరిస్తున్నారు. ఈ రెండు జలసంధులు మూతపడితే ముడిచమురు రవాణా దాదాపు మూతపడినట్లుగానే వ్యాఖ్యానిస్తున్నారు. అయితే కొన్ని ప్రత్యామ్నాయాలు ఉన్నప్పటికీ అవి ఖర్చుతో కూడుకున్నవి కావడంతో బాబ్ ఎల్ మండేబ్ మూతపడకుండా జాగ్రత్తలు తీసుకోవాలని నిపుణులు కోరుతున్నారు. ఇక భారత్ విషయానికి వస్తే ఈ రెండు జలసంధులు మూతపడితే దేశంలో ఊహించని ఆర్థిక విలయం రావొచ్చని నిపుణులు హెచ్చరిస్తున్నారు. మనకు వచ్చే చమురులో ఎక్కువ భాగం ఇరాక్, సౌదీ అరేబియా, కువైట్, రష్యా (కొంత భాగం) నుంచి వస్తుంది. ఇవన్నీ హోర్ముజ్ లేదా బాబ్ ఎల్-మండేబ్ మీదుగానే రావాలి. ఈ మార్గాలు మూతపడితే భారత్‌లో పెట్రోల్, డీజిల్ ధరలు ఊహించని స్థాయికి పెరిగే అవకాశం ఉందని అంటున్నారు. ప్రస్తుతం ఉన్న ధరలు రెట్టింపు అయ్యే ప్రమాదం ఉందని భయపడుతున్నారు.

# వార్మ్ సోక్ బాత్, ఐస్ బాత్ కోసం.. బాత్‌టబ్



ఎండలు మండిపోతున్నాయి. అందుకే ఉపశమనం కోసం చాలామంది ఐస్‌బాత్ చేస్తుంటారు. మరి ఇంట్లో బాత్ టబ్ లేనివాళ్ల పరిస్థితి ఏంటి? అలాంటివాళ్ల కోసమే ఈ టబ్. దీన్ని న్యూకర్చర్ అనే కంపెనీ తీసుకొచ్చింది. వార్మ్ సోక్ బాత్, ఐస్ బాత్ లాంటివి చేయడానికి ఇది బాగా సరిపోతుంది. వాటర్ టెంపరేచర్‌ని చాలాసేపు వరకు లాక్ చేసి ఉంచుతుంది. హై--సెన్సిటివ్ టెంపరేచర్ సెన్సర్ ప్రోబ్ బాత్ టబ్‌లోని వాటర్ టెంపరేచర్?ని ఎప్పటికప్పుడు మానిటర్ చేస్తుంటుంది. ఇది 0 నుంచి 99 డిగ్రీల సెల్సియస్ వరకు గుర్తించగలదు. ఈ బాత్‌టబ్‌ని మడతపెట్టుకోవచ్చు. దీని బరువు కూడా చాలా తక్కువ. కాబట్టి ఎక్కడికైనా తీసుకెళ్లొచ్చు. స్నానం చేసిన తర్వాత నీళ్లు వదిలేందుకు రెండు రంధ్రాలు ఉంటాయి. దీన్ని పూర్తిగా ప్లాస్టిక్?తో తయారుచేశారు. టెంపరేచర్ మారకుండా సాయపడే క్విల్టెడ్ ఇన్సులేటెడ్ మూతతో వస్తుంది. దీని ఆర్మ్‌రెస్ట్‌ని రబ్బరుతో తయారుచేయడం వల్ల చాలా సౌకర్యవంతంగా ఉంటుంది.

# యూట్యూబ్ షార్ట్స్‌లో..కొత్త ఏఐ ఫీచర్లు




యూట్యూబ్ షార్ట్స్‌లో కొత్త ఏఐ ఫీచర్లలో మొదటిది యాడ్ ఆబ్జెక్ట్ టూల్. ఈ టూల్ ద్వారా క్రియేటర్లు ఇతరుల షార్ట్ వీడియోల నుంచి తీసుకున్న సీన్‌లో (8 సెకన్ల వరకు) ఏఐ రూపొందించిన అంశాలను (ఆబ్జెక్ట్‌లు, ప్రాప్స్ లేదా ఎఫెక్ట్‌లు) జోడించవచ్చు. వినియోగదారులు సూచించిన ప్రాంప్ట్‌లను ఎంచుకోవచ్చు లేదా స్వయంగా కస్టమ్ ప్రాంప్ట్ టైప్ చేస్తే సరిపోతుంది. ఏఐ మిగతా పనిని స్వయంగా పూర్తి చేస్తుంది. దీంతో సంక్లిష్టమైన ఎడిటింగ్ అవసరం తగ్గుతుంది.రీ ఇమాజిన్ టూల్ మరింత ప్రత్యేకమైనది. ఇది ఒక షార్ట్ వీడియోలోని ఒకే ఫ్రేమ్‌ను తీసుకుని, దాన్ని పూర్తిగా కొత్త ఏఐ జనరేటెడ్ వీడియోగా మారుస్తుంది. వినియోగదారులు ప్రాంప్ట్‌లతో పాటు గరిష్టంగా రెండు రిఫరెన్స్ ఫొటోలను అప్‌లోడ్ చేయొచ్చు.

**క్రెడిట్ అండ్ కంట్రోల్**

యూట్యూబ్ ఏఐ రీమిక్స్‌పై ట్రాన్స్?పరెన్సీకి ప్రాధాన్యం ఇస్తోంది. ప్రతి ఏఐ రీమిక్స్ యాడ్ ఆబ్జెక్ట్ లేదా రీఇమాజిన్ ద్వారా సృష్టించినది. అసలు షార్ట్ వీడియోకు ఆటోమెటిక్‌గా లింక్ అవుతుంది. దీంతో ఒరిజినల్? క్రియేటర్‌కు తగిన క్రెడిట్ లభిస్తుంది. తమ వీడియోలను ఇతరులు ఏఐ రీమిక్స్‌లో ఉపయోగించకూడదనుకునే క్రియేటర్లు సెట్టింగ్స్‌లో ఆ ఆప్షన్‌ను ఆఫ్ చేసుకునే వీలుంది.

# టాటా మోటార్స్‌కు 5 వేల బస్సుల ఆర్డర్..

## తెలంగాణ సహా పలు రాష్ట్ర రవాణా సంస్థల నుంచి దక్కించుకున్న కంపెనీ



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ కంపెనీ టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ పలు రాష్ట్ర రవాణా సంస్థల నుంచి ఐదు వేలకి పైగా బస్సులు, బస్ చాసిస్‌ల ఆర్డర్లు దక్కించుకుంది. ఈ ఆర్డర్లను ప్రభుత్వ ఈ-బిడ్డింగ్ ప్రక్రియ ద్వారా పొందింది. ఒప్పందాల ప్రకారం దశలవారీగా బస్సులను సరఫరా చేయనుంది. మహారాష్ట్ర, గుజరాత్, కర్ణాటక, తెలంగాణ, బీహార్, రాజస్థాన్, కేరళ, హర్యానా, చండీగఢ్ వంటి రాష్ట్ర రవాణా సంస్థల నుంచి కంపెనీ ఆర్డర్లు దక్కించుకుంది. టాటా మాగ్నా, సిటీ రైడ్, స్టార్‌బస్, స్టార్‌బస్ ప్రైమ్ వంటి మోడళ్లతో పాటు ఎల్‌పీఓ 1618, ఎల్‌పీఓ 1622, ఎల్‌పీఓ 1822 వంటి చాసిస్‌లను కూడా ఈ ఆర్డర్లు కవర్ చేస్తున్నాయి.ఈ ఆర్డర్లు టాటా మోటార్స్‌పై ఉన్న విశ్వాసాన్ని ప్రతిబింబిస్తున్నాయని, సేఫ్టీ, సౌకర్యం అందించేలా బస్సులను రూపొందించామని టాటా మోటార్స్ కమర్షియల్ వెహికల్స్ వైస్ ప్రెసిడెంట్ ఆనంద్ అన్నారు.

# నిఫ్టీ 500 కంపెనీల లాభాలు 16% జంప్..11 శాతం పెరిగిన అమ్మకాలు:బజాజ్ ఫిన్సర్వ్ రిపోర్ట్




భారతీయ స్టాక్ మార్కెట్లు గత 18 నెలలుగా ఒడిదుడుకులను ఎదుర్కొంటున్నా, నిఫ్టీ-500 సంస్థల లాభాలు ఈ ఆర్థిక సంవత్సరం మూడో క్వార్టర్‌లో 16 శాతం పెరిగాయని బజాజ్ ఫిన్సర్వ్ అసెట్ మేనేజ్‌మెంట్ లిమిటెడ్ తెలిపింది. దీని రిపోర్ట్ ?ప్రకారం.. ఈ సంస్థల మొత్తం అమ్మకాలు ఏడాది ప్రాతిపదికన 11 శాతం పెరిగి సుమారు రూ.36 లక్షల కోట్లుగా నమోదయ్యాయి. నికర లాభం సుమారు రూ.నాలుగు లక్షల కోట్లుగా ఉంది. ఎబిటా విలువ సుమారు రూ.ఎనిమిది లక్షల కోట్లుగా నమోదైంది. దాదాపు 17 రంగాల్లో రెండంకెల వృద్ధి కనిపించింది. క్రెడిట్ గ్రోత్ సైతం రెండంకెల స్థాయికి చేరింది.అయితే ఏఐ టెక్నాలజీల వల్ల ఐటీ రంగంలో ఆందోళనలు నెలకొన్నాయి. పశ్చిమాసియాలో యుద్ధం కారణంగా ముడి చమురు ధరలు పెరుగుతున్నాయి. ప్రస్తుత పరిస్థితుల్లో మూడు నుంచి ఏడేళ్ల బాండ్లలో పెట్టుబడులు అనుకూలంగా ఉన్నాయని బజాజ్ ఫిన్సర్వ్ రిపోర్ట్ పేర్కొంది.

# భవిష్యత్తులో ఐటీ ఉద్యోగాలే ఉండవట.. 1ట్రిలియన్ డాలర్ల కంపెనీ కూడా ఐదుగురితోనే!




ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ తో రాబోయే రోజుల్లో ఐటీ ఉద్యోగాలకు మరింత ముప్పు ఉందా..? భవిష్యత్తులో ఐటీ ఐద్యోగాలే ఉండవా..? ప్రస్తుతం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ప్రపంచాన్ని ఏలుతున్న క్రమంలో ప్రముఖ టెక్?కంపెనీూజూవఅజుఇూ ఫౌండర్ CEO ?సలీం ఇస్మాయిల్ సంచలన విషయాలు వెల్లడించారు. కంపెనీలు ఎలా నిర్మించబడుతున్నాయో,ఎలా నడుస్తాయో వాటి స్వరూపాన్ని పూర్తిగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ మారుస్తుందంటున్నరు ప్రముఖ టెక్ కంపెనీూజూవఅజుఇూ ఫౌండర్ జజుూ సలీం ఇస్మాయిల్ . ఏఐ ప్రభావంతో రాబోయే రోజుల్లో $1 ట్రిలియన్ కంపెనీ కేవలం ఐదుగురికి మాత్రమే ఉపాధి కల్పించగలదన్నారు. ఏఐ వంటి టెక్నాలజీ కొత్త కంపెనీలు వాటి ఆర్థిక స్థితిగతులను సమూలంగా మార్చివేస్తాయని, పెద్ద కంపెనీలకు పోటీగా చిన్న కంపెనీల పెట్టే చిన్న టీంలకు అనుకూలంగా మారుస్తాయని ఇస్మాయిల్ అన్నారు.

ఇండియా టుడే కాంక్లేవ్ 2026లో మాట్లాడిన ఇస్మాయిల్?.. రాబోయే 1 ట్రిలియన్ డాలర్? కంపెనీలో కూడా బహుశా ఐదుగురు ఉద్యోగులు మాత్రమే ఉంటారన్నారు. బిలియన్ డాలర్ల విలువైన సంస్థలను నిర్మించడానికి అవసరమయ్యే వ్యక్తుల సంఖ్య, కాలక్రమేణా క్రమంగా తగ్గుతూ వస్తోందని ఆయన పేర్కొన్నారు.వంద సంవత్సరాల క్రితం ఒక బిలియన్ డాలర్ల సంస్థను స్థాపించాలంటే సాధారణంగా సుమారు లక్ష మంది ఉద్యోగులు అవసరమయ్యేవారు. తరువాతి దశాబ్దాలలో ఆ సంఖ్య దాదాపు 10వేల మంది ఉద్యోగులకు పడిపోయింది. అప్పటి నుంచి టెక్నాలజీ సంస్థలు మరింత తగ్గించేశాయన్నారు. Google సుమారు వెయ్యిమంది ఉద్యోగులతో ఈ మైలురాయిని చేరుకోగా OpenAI కేవలం కొన్ని వందల మందితోనే చేరుకుంది.ఇది ఆర్టిఫిషియల్? ఇంటెలిజెన్స్ ఇతర టెక్నాలజీల వేగవంతమైన అభివృద్ధి ద్వారా జరుగుతోందని అన్నారు. ఇది చిన్న టీంలు కూడా అత్యంత తక్కువ వనరులతో శక్తివంతమైన ప్రొడక్టులను రూపొందించేందుకు వీలు కల్పిస్తుందన్నారు.

ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కేవలం ఒక టూల్ మాత్రమే కాదు.. ఇది సంస్థల నిర్వహణ రూపాన్ని క్రమంగా మార్చుతుంది. AI వ్యవస్థలతో పనిచేసే విధంగా కంపెనీలు తమ పని విధానాలను రూపకల్పన చేయడం ప్రారంభిస్తున్నాయి. ఇప్పటికే అనేక పనులలో మానవ జోక్యం అవసరాన్ని తగ్గించడం ద్వారా కంపెనీలు లేఆఫ్స్? ప్రకటించాయి. భవిష్యత్తులో ఇంకా చాలామంది ఉద్యోగులను ఏఐ తో ఆటోమేట చేయనున్నారు. డాష్‌బోర్డ్‌లు, పర్యవేక్షణ వ్యవస్థలు,మినహాయింపులలో మాత్రమే మ్యాన్ పవర్?ను వినియోగిస్తారని చెప్పడం భవిష్యత్తులో ఐటీ కంపెనీల్లో ఐటీ ఉద్యోగాలపై దొరకడం కష్టమే అనిపిస్తోంది.

# యుద్ధంలో వృద్ధ విమానం




ఇరాక్‌లో కుప్పకూలిన కేసీ-135 ట్యాంకర్ విమానం.. రెక్కలుచాచి గాల్లో ఎగిరితేనే అమెరికన్ ఫైటర్ యుద్ధవిమానాలకు అదనపు జవసత్వాలు అందుతాయి. సైనిక విమానాలకు గాల్లో ఇంధనాన్ని నింపే ఈ భారీ లోహవిహంగం.. ఇరాక్‌లో కుప్పకూలిన ఘటన దాని 'వార్ధక్యాన్ని' కళ్లకు కడుతోంది. ప్రచ్ఛన్న యుద్ధకాలం నాటి ఈ విమానాలు ఇంకా పెద్దసంఖ్యలో సర్వీసులో ఉన్నాయి. గతమెంతో ఘనకీర్తి కలిగిన ఈ ట్యాంకర్ల విశ్వసనీయత, మన్నికపై ప్రస్తుతం ఆందోళన వ్యక్తమవుతోంది.

విమానాలకు గాల్లోనే ఇంధనం నింపడం వల్ల అవి ల్యాండింగ్ అవసరం లేకుండానే సుదీర్ఘ దూరం ప్రయాణం చేయగలుగుతాయి. మరింత ఎక్కువ సమయం గాల్లో కార్యకలాపాలు సాగించగలుగుతాయి.

కేసీ-135 విమానం.. బోయింగ్-707 ప్రయాణికుల విమాన డిజైన్ ఆధారంగా రూపొందింది. ఇది 60 ఏళ్లుగా సర్వీసులో ఉంది. అమెరికా వైమానిక దళం, నౌకాదళం, మెరీన్ కోర్‌లకు సేవలు అందిస్తోంది. గత కొన్నేళ్లలో వీటికి అనేక అదనపు సొబగులు అద్దారు. అయినా ఈ ట్యాంకర్లు పాతబడిపోవడంతో వాటి విశ్వసనీయత ప్రశ్నార్థకంగా ఉంది. ఈ విమానాల ఉత్పత్తి చివరిసారిగా 1960లలో జరిగింది. ఇప్పటికీ అమెరికా వైమానిక దళం వద్ద 376 కేసీ-135 ట్యాంకర్లు ఉన్నాయి.

యుద్ధంలో గాయపడినవారిని తరలించడానికి, నిఘా ఆపరేషన్లకూ ఈ కేసీ-135 ట్యాంకర్ విమానాలు ఉపయోగపడతాయి.

ఈ విమానం పొడవు 136 అడుగులు. రెక్కల వెడల్పు 130 అడుగులు. ఇది గంటకు గరిష్ఠంగా 530 మైళ్ల వేగంతో పయనించగలదు. 50వేల అడుగుల ఎత్తు వరకూ వెళ్లగలదు.

**ఇంధనం నింపేది ఇలా..**

కేసీ-135లో ఒక పైలట్, కోపైలట్, బూమ్ ఆపరేటర్ ఉంటారు. వైద్యపరమైన మిషన్ల కోసం వెళ్లినప్పుడు నర్సులు, మెడికల్ టెక్నీషియన్లు కూడా ఇందులో పయనమవుతారు.

ఇంధనాన్ని నింపే వ్యవస్థ.. ఈ విమానం వెనుకభాగంలో ఉంటుంది. బూమ్ ఆపరేటర్ కూడా అక్కడే ఉంటారు.

తొలుత ఫ్యూయెల్ బూమ్‌ను కిందకి దించి.. వెనుక వస్తున్న యుద్ధవిమానాలు, బాంబర్లతో అనుసంధానిస్తారు. ఆ తర్వాత దాని ద్వారా వేగంగా ఇంధనాన్ని బట్వాడా చేస్తారు.

ఇది చాలా సున్నితమైన ఆపరేషన్. ఇందులో రెండు విమానాలు నిర్దిష్ట వేగంతో కొనసాగాలి. ఈ ప్రక్రియను బూమ్ ఆపరేటర్.. కిటికీ గుండా పర్యవేక్షిస్తుంటారు.

కొన్ని కేసీ-135లు తమ రెక్కల్లోని పాడ్‌ల ద్వారా కూడా ఇతర విమానాలకు గాల్లో ఇంధనం నింపుతాయి.

కేసీ-135 విమానం 90వేల లీటర్ల ఇంధనాన్ని ఇతర యుద్ధవిమానాలకు నింపగలదు.

అవసరమైతే సరకులు లేదా ప్రయాణికులను చేరవేయడానికి ఈ విమానాల్లోని ఇంధన ట్యాంకుల ఎగువన ప్రత్యేక చోటు కూడా ఉంటుంది.

**గతంలోనూ ప్రమాదాలు..**

2013 మే 3: అఫ్గానిస్థాన్ యుద్ధంలో పాల్గొంటున్న కేసీ-135ఆర్ విమానం కిర్గిజిస్థాన్‌లోని చాల్దోవర్‌కు సమీపంలో టేకాఫ్ తర్వాత కూలిపోయింది. ఈ లోహవిహంగం.. రడ్డర్‌లో సమస్యలు తలెత్తాయి. దీంతో గాల్లోకి లేచాక విమానాన్ని స్థిరంగా ఉంచడానికి సిబ్బంది ఎంతో శ్రమించారు. అయినా విమాన తోకభాగం విరిగిపోయింది. అనంతరం ఆ లోహవిహంగం గాల్లోనే పేలిపోయింది. ఆ ప్రమాదంలో ముగ్గురు సిబ్బంది చనిపోయారు.

1966 జనవరి 17: కేసీ-135 ట్యాంకర్ల చరిత్రలో ఇదే అత్యంత పెద్ద దుర్ఘటన. నాడు స్పెయిన్‌లోని పాలోమెరెస్‌లో హైడ్రోజన్ బాంబులు మోసుకెళుతున్న ఒక బి-52 బాంబర్.. కేసీ-135 ట్యాంకర్‌ను ఢీ కొట్టింది. ఫలితంగా ట్యాంకర్ విమానం కూలిపోయింది. అందులోని నలుగురు సిబ్బంది చనిపోయారు. బాంబరు విమానం కూడా ధ్వంసమై, అందులోని ముగ్గురు ప్రాణాలు కోల్పోయారు. ఈ బి-52లోని నాలుగు హైడ్రోజన్ బాంబుల్లో మూడు.. నేలపై పడ్డాయి. ఈ క్రమంలో వాటిలోని సంప్రదాయ పేలుడు పదార్థాలు విస్ఫోటం చెందాయి. దీనివల్ల రేడియోధార్మిక పదార్థమైన ప్లుటోనియం ఆ ప్రాంతంలో చెల్లాచెదురుగా పడింది. ఫలితంగా 2 చదరపు కిలోమీటర్ల ప్రాంతంలో రేడియోధార్మికత వ్యాపించింది. దీంతో అక్కడి నుంచి 1,750 టన్నుల రేడియోధార్మిక మట్టిను తొలగించి, అమెరికాకు తరలించారు. అయినా అక్కడ రేడియోధార్మికత కొనసాగింది. నాలుగో బాంబు మధ్యధరా సముద్రంలో పడింది. 80 రోజుల గాలింపు తర్వాత దాన్ని చెక్కుచెదరని స్థితిలో అమెరికా నౌకాదళ సిబ్బంది స్వాధీనం చేసుకోగలిగారు.

# ఐపీఓ రూల్స్‌కు కేంద్రం సవరణలు.. జియో ఐపీఓకు లైన్ క్లియర్




ఢిల్లీ: స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్ట్ అయ్యే కంపెనీలు ప్రవేశపెట్టే కనీస పబ్లిక్ ఆఫర్‌కు సంబంధించిన నిబంధనలను కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సవరించింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువ ఆధారంగా వాటిని వర్గీకరించింది. సెబీ ప్రతిపాదనల మేరకు సెక్యూరిటీస్ కాంట్రాక్ట్స్ (రెగ్యులేషన్) అమెండ్‌మెంట్ రూల్స్, 2026ను ఆర్థిక శాఖ తాజాగా నోటిఫై చేసింది. ఇష్యూ అనంతరం మార్కెట్ విలువతో సంబంధం లేకుండా కనీసం 2.5 శాతం వాటాను విక్రయించాలని సూచించింది. తాజా నిబంధనల సవరణతో జియో, ఎన్ఎస్ఈ వంటి ఐపీఓలకు మార్గం సుగమం అయినట్లు విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇష్యూ అనంతరం రూ.1600 కోట్ల నుంచి రూ.5 వేల కోట్ల మార్కెట్ విలువ ఉంటే ఆ కంపెనీలు 25 శాతం పబ్లిక్ వాటాను మూడేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది. అదే రూ.1600 కోట్లలోపు ఉంటే 25 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లను గానీ, డిబెంచర్లను గానీ పబ్లిక్ ఇష్యూ సమయంలోనే విక్రయించాల్సి ఉంటుంది. ఒకవేళ మార్కెట్ విలువ రూ.4 వేల కోట్లలోపు ఉంటే కనీసం రూ.400 కోట్ల విలువైన షేర్లను విక్రయించాల్సి ఉంటుంది.

రూ.4,000- 5000 కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు 10 శాతం వాటాకు సమానమైన ఈక్విటీ షేర్లు లేదా కన్వర్టబుల్ డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. లిస్టింగ్ అనంతరం మార్కెట్ విలువ రూ.5 వేల కోట్ల నుంచి రూ.1 లక్ష కోట్లు ఉంటే.. రూ.1000 కోట్లకు సమానమైన (కనీసం 8 శాతం) ఈక్విటీ షేర్లను లేదా డిబెంచర్లను జారీ చేయాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధనను ఐదేళ్లలో చేరుకోవాల్సి ఉంటుంది.

రూ.1 లక్ష కోట్ల నుంచి రూ.5 లక్షల కోట్ల మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు 2.75 శాతం వాటాకు సమానమైన రూ.6250 కోట్ల వాటాను పబ్లిక్ ఆఫర్‌లో విక్రయించాలి. రూ.5 లక్షల కోట్ల కంటే ఎక్కువ మార్కెట్ విలువ కలిగిన కంపెనీలు కనీసం రూ.15 వేల కోట్ల విలువైన ఈక్విటీ షేర్లు, కన్వర్టబుల్ డిబెంచర్లను విక్రయించాలి.

లిస్టింగ్ సమయంలో 15 శాతం కంటే తక్కువ వాటాను విక్రయించిన కంపెనీలు తొలి ఐదేళ్లలో 15 శాతం వాటాను విక్రయించాల్సి ఉంటుంది. 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్ నిబంధన చేరుకోవడానికి 10 ఏళ్లు గడువు ఇచ్చారు. అదే లిస్టింగ్ సమయంలో 15 శాతం ఉంటే ఐదేళ్లలో 25 శాతం పబ్లిక్ షేర్ హోల్డింగ్‌ను చేరుకోవాల్సి ఉంటుంది.

జియో ఐపీఓకు గ్రీన్ సిగ్నల్ ఇలా: పబ్లిక్ ఇష్యూ అనంతరం సంస్థ మార్కెట్ విలువ రూ.5 లక్షల కోట్లను మించేటట్లయితే.. ఐపీఓలో 2.5% వాటా మాత్రమే విక్రయించేందుకు కంపెనీలకు అనుమతి ఇవ్వాలని గత సెప్టెంబరులో మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ నిర్ణయించింది. అంతకుముందు నిబంధన ప్రకారం కనీసం 5% వాటాను కంపెనీలు విక్రయించాల్సి ఉంది. ఈ నిబంధన సవరణకు సంబంధించిన నోటిఫికేషన్ ఆలస్యం కావడంతో జియో ఐపీఓ ఆలస్యమవుతూ వచ్చింది. తాజాగా నిబంధనల సవరణతో జియోకు లైన్ క్లియర్ అయ్యింది. జియో కంపెనీ విలువను ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్లు 170 బిలియన్ డాలర్లు (సుమారు రూ.15.50 లక్షల కోట్లు)గా ప్రతిపాదించారు. ఐపీఓ ద్వారా జియోలో 2.5% వాటా విక్రయించినా 4.3 బిలియన్ డాలర్లు (సుమారు రూ.40,000 కోట్లు) సమీకరించొచ్చని అంచనా వేస్తున్నారు.

# మట్టికుండ నీళ్లు... వడదెబ్బకు నో ఛాన్స్!



ఇప్పుడు అందరూ ఫ్రిజ్ నీళ్లు తాగుతుండటంతో మట్టికుండలపై పెద్దగా ఎవ్వరూ దృష్టి పెట్టడం లేదు. కానీ ఫ్రిజ్ నీళ్లు శరీరానికి అంత మంచిది కాదు. కాబట్టి ఈ వేసవిలో శరీరాన్ని చల్లబరచడానికి మట్టి కుండ నీటిని తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఇప్పుడంటే ప్రతి ఇంట్లోకి ఫ్రిజ్‌లు వచ్చాయిగానీ గతంలో మన పూర్వికులు మట్టి కుండలలో నీటిని నిల్వ చేసుకుని తాగేవారు. వేసవిలో కూడా వేడి తాపం నుంచి బయటపడటానికి వారు ఈ కుండల్లో నీటినే తాగేవారు. ఇప్పుడు అందరూ ఫ్రిజ్ నీళ్లు తాగుతుండటంతో మట్టికుండలపై పెద్దగా దృష్టి పెట్టడం లేదు. కానీ ఫ్రిజ్ నీళ్లు శరీరానికి అంత మంచిది కాదు. కాబట్టి ఈ వేసవిలో శరీరాన్ని చల్లబరచడానికి మట్టి కుండ నీటిని తాగడం మంచిదని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ఈ మట్టి కుండలు నీటిని చల్లబరచడమే కాకుండా నీటిని సహజంగా శుద్ధి చేయడంలో కూడా సహాయపడతాయి. ఇలాంటి నీటిని తాగడం వల్ల అనేక ఆరోగ్య ప్రయోజనాలు లభిస్తాయి. మనం తినే ఆహారంలో ఎక్కువ భాగం శరీరంలో ఆమ్లంగా మారి, తరువాత విషాన్ని ఉత్పత్తి చేస్తుంది. బంకమట్టి స్వభావరీత్యా క్షారంగా ఉంటుంది. ఈ మట్టి కుండలోని నీటి జూఊ స్థాయి స్థిరంగా ఉంటుంది. ఇది ఆమ్ల ఆహార పదార్థాలతో చర్య జరిపి జూఊ సమతుల్యతను సృష్టిస్తుంది. అందువల్ల మట్టి కుండలోని నీరు తాగడం వల్ల ఆమ్లత్వం, మలబద్ధకం, గ్యాస్ట్రిక్ సమస్యలు దూరంగా ఉంటాయి.మట్టి పాత్రలలో నిల్వ చేసిన నీళ్లు తాగటం వల్ల శరీరానికి చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. పరిశోధన ప్రకారం మట్టి పాత్రలలో నిల్వ చేసిన నీరు శరీరం నుంచి మలినాలను బయటకు పంపడంలో సహాయపడుతుంది.మట్టి కుండలో నిల్వ చేసిన నీటిలో ఎటువంటి రసాయనాలు ఉండవు. అందువల్ల ప్రతిరోజూ మట్టి కుండ లేదా కుండ నీరు తాగడం వల్ల జీవక్రియ పెరుగుతుంది. అలాగే ఈ నీటిలో ఉండే ఖనిజాలు జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి. వేసవిలో తీవ్రమైన వేడి కారణంగా వడదెబ్బ తగులుతుంది. దీని నుంచి మిమ్మల్ని మీరు రక్షించుకోవడానికి మట్టి కుండల్లోని నీటిని తాగడం మంచిది. ఈ మట్టి పాత్రల్లోని నీటిలో ఖనిజాలు, పోషకాలు ఉంటాయి. ఇవి త్వరగా శరీర హైడ్రేషన్‌కు సహాయపడతాయి. మట్టి కుండలు ఆహ్లాదకరమైన మట్టి వాసన కలిగి ఉంటుంది. ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం మట్టి కుండలోని నీరు గొంతు, ప్రేగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. అంతేకాకుండా కుండ మట్టితో తయారు చేస్తారు. కాబట్టి ఇందులో అనేక పోషకాలు ఉంటాయి. మట్టి కుండలోని నీళ్లు మలినాలను తొలగిస్తుంది. ఈ నీరు శరీరంలోని విష పదార్థాలను శుభ్రపరుస్తుంది. రోగనిరోధక శక్తిని మెరుగుపరుస్తుంది. అదే రిఫ్రిజిరేటర్ నీళ్లు గొంతు నొప్పితో సహా ఇతర సమస్యలను కలిగిస్తుంది. కానీ మట్టి కుండలోని నీళ్లు తాగడం వల్ల ఈ సమస్యలు ఏవీ రావు. ఇది ఆరోగ్యానికి ఎంతో మంచిది.


# తీపి చక్కెరతో మతిమరుపు !



చక్కెర అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరానికి తీవ్ర నష్టం జరుగుతుంది. అందుకే రోజు వారీ ఆహారంలో చక్కెర తీసుకోవడం మానేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. చక్కెర అనేక వ్యాధులకు కారణమవుతుంది. శరీరానికి అవసరమైన దానికంటే ఎక్కువ చక్కెర తినడం వల్ల శరీరానికి తీవ్ర నష్టం జరుగుతుంది. అందుకే రోజు వారీ ఆహారంలో చక్కెర తీసుకోవడం మానేయాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. మీరు వరుసగా పది రోజులు మీ ఆహారంలో చక్కెరను తొలగిస్తే మీ శరీరంలో అనేక మార్పులను గమనించవచ్చు. చక్కెర తినడం వల్ల మెదడులో డోపమైన్ విడుదల అవుతుంది. కాబట్టి చక్కెరను తగ్గించడం వల్ల మొదట్లో మీరు అంతగా ఉత్సాహంగా ఉండకపోవచ్చు. చక్కెర మరీ ఎక్కువగా తింటే మెదడులో అనుసంధాన వ్యవస్థ క్షీణిస్తుంది.

నాడీకణాలను అదుపులో పెట్టే రసాయనాలు అస్తవ్యస్తం కావటం వల్ల ప్రవర్తన, నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం సన్నగిల్లుతాయి. జ్ఞాపకశక్తికి కీలక కేంద్రమైన హిప్పోక్యాంపస్ కూడా దెబ్బతిని మతిమరుపు (అల్జీమర్స్) తలెత్తుతుంది. మెదడులో రక్త ప్రసరణ తగ్గుతుంది. విషయగ్రహణ సమస్యలు, మెదడుకు త్వరగా వృద్ధాప్యం రావటం, కుంగుబాటు, ఆందోళన, మెదడులో వాపు తలెత్తుతాయి. అందుకే చక్కెరకు దూరంగా ఉండాలి. అయినప్పటికీ మీరు చక్కెర లేని ఆహారాన్ని తినడం అలవాటు చేసుకోవాలి. తద్వారా శరీరంపై అనేక సానుకూల ప్రభావాలను మీరు గమనిస్తారు. ఆహారంలో చక్కెర తీసుకోవడం మానేస్తే మీరు మరింత తాజాగా, ఉత్సాహంగా ఉంటారు. మీ చర్మం ప్రకాశవంతంగా కనిపిస్తుంది. చక్కెరను తగ్గించడం వల్ల ఉబ్బరం కూడా తగ్గుతుంది. రోజంతా ఉత్సాహంగా అనిపిస్తుంది. దీనితో పాటు ఒకటి నుండి రెండు కిలోల బరువు తగ్గొచ్చు. రక్తంలో చక్కెర స్థాయిలు సైతం నియంత్రణలో ఉంటాయి.

# దంతాలు తెల్లగా మెరవాలంటే..




రాత్రి బ్రష్ చేయకపోతే డిన్నర్‌లో తిన్న మటన్, చికెన్, పాలకూర వగైరా పళ్ల సంధుల్లో ఇరుక్కుపోయి, పళ్లు పాడైపోవడానికి కారణమవుతాయి. అంతేకాదు.. సరైన పద్ధతిలో బ్రష్ చేయకపోతే, పళ్ళు పసుపుగా మారడం, దంత సమస్యలు, మలినజలుపు సమస్యలు రావచ్చు. అందుకే తెల్లదనాన్ని కాపాడుకోవడానికి, పళ్ళను తొముకోవటానికి కొన్ని ముఖ్యమైన చిట్కాలు తెలుసుకోవడం ముఖ్యం.డిప్రెషన్, జుట్టు రాలిపోవడం లాగానే పంటి నొప్పి సమస్య కూడా నేటి తరం ఎదుర్కొంటున్న చాలా కామన్ సమస్యగా మారింది. కానీ, కొన్ని ఈజీ టిప్స్ ఫాలో అయితే మీ దంతాలను ఎక్కువ కాలం పాటు సురక్షితంగా కాపాడుకోవచ్చు. ఉదయాన్నే నిద్ర లేవగానే బ్రష్ చేసుకోవడం ఎంత ముఖ్యమో, రాత్రి పడుకునే ముందు కూడా పళ్లు మరోసారి క్లీన్ చేసుకోవడం అంతే ముఖ్యం. రాత్రి బ్రష్ చేయకపోతే డిన్నర్‌లో తిన్న మటన్, చికెన్, పాలకూర వగైరా పళ్ల సంధుల్లో ఇరుక్కుపోయి, పళ్లు పాడైపోవడానికి కారణమవుతాయి. అంతేకాదు.. సరైన పద్ధతిలో బ్రష్ చేయకపోతే, పళ్ళు పసుపుగా మారడం, దంత సమస్యలు, మలినజలుపు సమస్యలు రావచ్చు. అందుకే తెల్లదనాన్ని కాపాడుకోవడానికి, పళ్ళను తొముకోవటానికి కొన్ని ముఖ్యమైన చిట్కాలు తెలుసుకోవడం ముఖ్యం. తెల్లగా తళతళ మెరిసే దంతాలు కావాలని కోరుకునేవారు.. సరైన బ్రష్ ఎంచుకోవడం ముఖ్యం. మృదువైన బ్రిసిల్స్ ఉన్న బ్రష్ ఉపయోగించాలి. దాంతో దంత కవచానికి హాని కాకుండా, పళ్ళ పొరలోని ప్లాక్ ను తొలగించవచ్చు. హార్డ్ బ్రష్ ఎక్కువగా ఉపయోగిస్తే గమ్ సమస్యలు వచ్చి రక్తస్రావం కూడా రావచ్చు. పళ్ళను 45 డిగ్రీల కోణంలో ఉంచి, చిన్న, సర్క్యులర్ మోషన్స్‌లో బ్రష్ చేయాలి. ముందువైపుకు, వెనకవైపుకు, అలాగే దవడల పై భాగానీ శుభ్రం చేయాలి. ప్రతి పల్లును కనీసం 10?15 సెకన్లు బ్రష్ చేయడం మంచిది. ఇక బ్రష్ చేయడం కోసం ఫ్లోరైడ్ కలిగిన టూత్‌పేస్ట్ ఉపయోగించండి. ఇది కేవలం తెల్లదనాన్ని పెంచడమే కాకుండా, కాడ్‌ను మేన్‌టైన్ చేస్తుంది. అతి ఎక్కువ వైట్‌నింగ్ టూత్‌పేస్ట్ ఎక్కువగా వాడడం దంతానికి హాని చేస్తుంది. పంటి నొప్పితో బాధపడుతున్నవారు, మధ్యాహ్నం భోజనం చేసిన తర్వాత కూడా ఓసారి బ్రష్ చేసుకుంటే? మంచి రిజల్ట్స్ కనిపిస్తాయి. అందుకే బ్రషింగ్ విషయంలో సరైన పేస్ట్‌ను ఎంచుకోవడం చాలా బెటర్. తక్కువలో దొరుకుతుందని నాసిరకం టూత్ పేస్ట్ వాడితే పళ్లు, నోరు పాడవుతాయి. ప్రతిరోజు ఫ్లోస్ చేసి, మౌత్‌వాష్ తో కుల్చుకుంటే, దంత మలినం తగ్గి, శ్వాస తాజాగా ఉంటుంది. అదనంగా, ఆహారం, అలవాట్లు. కాఫీ, టీ, టొమాటో సాస్, సిగరెట్ ఎక్కువ వాడకండి. ఫ్రూట్స్, వెజిటబుల్స్ ఎక్కువగా తినడం, నీరు ఎక్కువగా తాగడం మీ దంతాలను తెల్లగా ఉండేలా చేస్తుంది. టూత్ బ్రష్ మీద పెట్టుకునే పేస్ట్ ఎంత ఉండాలనేది కూడా చాలా ముఖ్యం. కనీసం పల్లీ గింజ పరిమాణంలో పేస్ట్ పెట్టుకుని బ్రష్ చేసుకుంటే మంచి ఫలితాలు కనిపిస్తాయి. పళ్లు తోమేటప్పుడు ఆత్రుత, వేగం, కంగారు అస్సలు పనికి రాదు.

# పొరపాటున కూడా వీటిని ఫేస్‌కు పూయకండి



ఈ మధ్య కాలంలో జనాలపై సోషల్ మీడియా ప్రభావం పెరిగిపోయింది. సోషల్ మీడియాలో ఇన్ఫ్లుయెన్సర్లు ఏది చెబితే జనాలు దాన్ని గుడ్డిగా ఫాలో అవుతున్నారు. కొంతమంది చెప్పే బ్యూటీ టిప్స్ ఫాలో అవుతూ ఫేస్ కరాబ్ చేసుకుంటున్నారు. మన మొత్తం శరీరంలో ముఖ చర్మం చాలా సున్నితమైనది. దానికి ఏవి పడితే అవి రాడం వల్ల చికాకు, మచ్చలు, మొటిమలు వంటి దీర్ఘకాలిక చర్మ సమస్యలు వస్తాయి. మొటిమలకు టూత్‌పేస్ట్‌ను పూయడం: ఈ మధ్య చాలా వైరల్ అవుతున్న హ్యాక్ ఏమిటంటే మొటిమలకు టూత్‌పేస్ట్ పూస్తే అవి త్వరగా ఎండిపోతాయని చెప్పడం. కాని ఇది అస్సు నిజం కాదు. పేస్ట్‌లో చర్మానికి హాని కలిగించే అనేక రసాయనాలు ఉంటాయి. ఇలా ఫేస్‌కు పేస్ట్‌లు పూయడం వల్ల మొదట్లో మొటిమ ఎండిపోయినట్లు అనిపించవచ్చు, కానీ వాస్తవానికి ఇది చర్మాన్ని మరింత పొడిగా చేస్తుంది. ఇది ఎరుపు, చికాకు, చర్మాన్ని పొడిబారేలా చేస్తుంది. నిమ్మరసం: నిమ్మరసాన్ని సహజమైన బ్లీచ్ అని భావించి ప్రజలు తరచుగా తమ ముఖానికి నేరుగా రాసుకుంటారు. నిమ్మకాయలో విటమిన్ సి ఉంటుందనేది నిజమే అయినప్పటికీ, ఇది అధిక ఆమ్లత్వాన్ని కలిగి ఉంటుంది. దీన్ని నేరుగా ముఖానికి పూయడం వల్ల చర్మం చికాకు కలిగిస్తుంది. మీరు దీన్ని అప్లై చేసిన తర్వాత ఎండలోకి వెళితే, మీ చర్మం మరింత సున్నితంగా మారుతుంది, మచ్చలు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. కొంతమందికి అలెర్జీ ప్రతిచర్యలు లేదా దద్దుర్లు కూడా రావచ్చు. బేకింగ్ సోడా: కొంతమంది చర్మాన్ని క్లియర్‌గా, మెరిసేలా చేయడానికి బేకింగ్ సోడాతో స్క్రబ్ చేస్తారు. అయితే, బేకింగ్ సోడా చర్మం కంటే భిన్నమైన జూఊ స్థాయిని కలిగి ఉంటుంది. ముఖానికి అప్లై చేసినప్పుడు, ఇది చర్మంలోని సహజ నూనెలను తొలగిస్తుంది, ఇది పొడిగా, గరుకుగా, సున్నితంగా ఉంటుంది. దీన్ని క్రమం తప్పకుండా ఉపయోగించడం వల్ల మొటిమలు, చికాకు వచ్చే ప్రమాదం పెరుగుతుంది. బాడీ లోషన్: బాడీ లోషన్ అనేది మందపాటి చర్మాన్ని తేమగా ఉంచడానికి రూపొందించబడింది. ఇందులో సువాసనలు, వివిధ రసాయనాలు ఉంటాయి. ముఖ చర్మం చాలా సున్నితంగా ఉంటుంది. కాబట్టి మీ ముఖానికి బాడీ లోషన్ పూయడం వల్ల రంధ్రాలు మూసుకుపోతాయి, ఇది మొటిమలు, జిడ్డుగల చర్మానికి దారితీస్తుంది. అందువల్ల, ఎల్లప్పుడూ ముఖం కోసం ప్రత్యేకంగా రూపొందించిన మాయిశ్చరైజర్‌ను ఉపయోగించండి.

# ఉత్సాహంగా ఉండాలంటే ఈ అలవాట్లు తప్పనిసరి!



ఉదయం నిద్రలేవగానే మీరు చేసే మొదటి పని మీ రోజంతటినీ శాసిస్తుందని మీకు తెలుసా? చాలామంది లేవగానే మొబైల్ చూడటం లేదా హడావిడిగా పనుల్లో పడిపోవడం చేస్తుంటారు. కానీ, మానసిక ఆరోగ్య నిపుణుల అభిప్రాయం ప్రకారం.. ఉదయం పూట మనం పాటించే కొన్ని చిన్న అలవాట్లు మన మెదడు పనితీరును, రోజంతా ఉండే ఉత్సాహాన్ని అద్భుతంగా మార్చేస్తాయి.ప్రముఖ సైకియాట్రిస్ట్ డాక్టర్ డానియల్ గ్రెగొరీ అమెన్ తన ఇన్‌స్టాగ్రామ్ వేదికగా పంచుకున్న మార్నింగ్ రూటీన్ సూత్రాలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. ప్రతిరోజూ ఉదయం మీరు కళ్లు తెరవగానే మీ మనసులో వచ్చే మొదటి ఆలోచన ఏంటి? “ఈరోజు కూడా ఆఫీసు ఉందా?” లేదా “మళ్ళీ పనుల ఒత్తిడి మొదలైందా?” అని అనుకుంటున్నారా? అయితే మీరు మీ రోజును ఓటమితో మొదలుపెడుతున్నట్లే. మన మానసిక స్థితిని, ఏకాగ్రతను మెరుగుపరిచే ఒక అద్భుతమైన మార్నింగ్ రూటీన్ ను ప్రపంచ ప్రఖ్యాత సైకియాట్రిస్ట్ ఒకరు పరిచయం చేశారు. కేవలం కొన్ని నిమిషాల శారీరక శ్రమ, ఒక గ్లాసు నీరు మీ మెదడును ఎలా రీఛార్జ్ చేస్తాయో తెలిస్తే మీరు ఆశ్చర్యపోతారు. డాక్టర్ అమెన్ చెప్పే మొదటి సూత్రం మన ఆలోచనా సరళికి సంబంధించింది. “ఈరోజు అద్భుతంగా ఉండబోతోంది” అని మీకు మీరు చెప్పుకుంటూ రోజును ప్రారంభించాలని ఆయన సూచిస్తున్నారు. ఈ పాజిటివ్ మైండ్‌సెట్ మీ మెదడును పనుల పట్ల ఉత్సాహంగా ఉండేలా సిద్ధం చేస్తుంది.నిద్రలేవగానే బయటకు వెళ్లి ప్రకృతి సిద్ధమైన సూర్యరశ్మి తగిలేలా చూసుకోవాలి. ఇది మెటబాలిజంను పెంచడమే కాకుండా, శరీరానికి అవసరమైన విటమిన్ డిని అందించి మూడ్‌ను మెరుగుపరుస్తుంది. గడ్డకట్టే చలి ఉంటే తప్ప, ఉదయాన్నే చిన్నపాటి నడకను అలవాటు చేసుకోవడం వల్ల శరీరంతో పాటు మెదడు కూడా యాక్టివ్ అవుతుంది.శరీరాన్ని డీటాక్సిఫై చేయడానికి ఉదయాన్నే ఒక పెద్ద గ్లాసు నీటిలో సగం నిమ్మకాయ పిండుకుని తాగాలని డాక్టర్ అమెన్ సలహా ఇస్తున్నారు. ఇది శరీరంలోని వ్యర్థాలను తొలగించి, రోజంతా హైడ్రేటెడ్ గా ఉండేలా చేస్తుంది. ఆహారం విషయంలో కూడా ఆయన కఠినమైన నియమాలు పాటిస్తారు. ఎనర్జీ స్థిరంగా ఉండటం కోసం తన రోజును ప్రోటీన్ మరియు హెల్తీ ఫ్యాట్స్‌తో ప్రారంభిస్తారు. మూడు గుడ్లు లేదా ప్రోటీన్ షేక్ తీసుకోవడం ఆయనకు ఇష్టం. అంతేకాకుండా, ఇంటర్మిటెంట్ ఫాస్టింగ్ చేసేవారు 12 నుండి 16 గంటల విరామం తర్వాత ఆలస్యంగా అల్పాహారం తీసుకోవడం కూడా మంచిదేనని ఆయన పేర్కొన్నారు. మనం చేసే ప్రతి పనిలోనూ, తినే ప్రతి ఆహారం విషయంలోనూ ఒక ప్రశ్న వేసుకోవాలని ఆయన కోరుతున్నారు.

# క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించిన పాక్ ప్లేయర్ సర్ఫరాజ్ అహ్మద్



**హైదరాబాద్ పెన్ పవర్:** పాకిస్థాన్ మాజీ కెప్టెన్ సర్ఫరాజ్ అహ్మద్ అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించారు. (మార్చి 15) ఈ విషయాన్ని అధికారికంగా అతడు వెల్లడించారు. గత రెండు సంవత్సరాలుగా అంతర్జాతీయ క్రికెట్‌కు దూరంగా ఉన్న సర్ఫరాజ్ చివరిసారిగా 2023లో టెస్టు మ్యాచ్ ఆడగా, 2021లో వైట్ బాల్ క్రికెట్‌లో చివరి మ్యాచ్ ఆడారు. తన రిటైర్మెంట్ ప్రకటన సందర్భంగా అతడు మాట్లాడుతూ.. పాకిస్థాన్ తరఫున ఆడటం తన జీవితంలో గొప్ప గౌరవమని పేర్కొన్నారు. 2006లో అండర్---19 జట్టును ప్రపంచ ఛాంపియన్‌గా నిలిపినప్పటి నుంచి 2017లో ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీని గెలుచుకున్న క్షణం వరకు పాక్ జెర్సీలో గడిపిన ప్రతి క్షణం ప్రత్యేకమైనదే అన్నారు.

నా కెరీర్ మొత్తంలో అండగా నిలిచిన సహచర ఆటగాళ్లు, కోచ్‌లు, కుటుంబ సభ్యులు, అభిమానులకు కృతజ్ఞతలు అని సర్ఫరాజ్ అహ్మద్ తెలిపారు. అలాగే అన్ని ఫార్మాట్లలో పాకిస్థాన్ జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించడంతో తన కల నెరవేరినట్టే అన్నారు. ఎప్పుడూ నిర్భయంగా క్రికెట్ ఆడాలని, ఐక్యంగా ఉండే జట్టును నిర్మించాలని ప్రయత్నించాను.. నా కెప్టెన్సీలో బాబర్ ఆజం, ఫఖర్ జమాన్, హసన్ అలీ, షాహీన్ షా అఫ్రిది, షాదాబ్ ఖాన్ వంటి ఆటగాళ్లు మ్యాచ్ విన్నర్లుగా ఎదగడం నాకు గర్వకారణంగా ఉందని ఆయన వెల్లడించారు. 2006లో దేశీయ క్రికెట్‌లో అడుగు పెట్టిన సర్ఫరాజ్ అహ్మద్, 2007 నవంబర్‌లో జైపూర్ వేదికగా భారత జట్టుతో జరిగిన మ్యాచ్‌లో వన్డేల్లో అరంగేట్రం చేశారు. అనంతరం 2010లో టెస్టు, టీ20 అంతర్జాతీయ మ్యాచ్‌ల్లో కూడా తొలి మ్యాచ్ ఆడారు. తన టెస్టు కెరీర్‌లో సర్ఫరాజ్ మొత్తం 3031 పరుగులు చేయగా, వన్డేల్లో 2315 పరుగులు చేశాడు. టీ20ల్లో 42 ఇన్నింగ్స్‌లలో 818 పరుగులు చేశారు. ముఖ్యంగా 2017లో జరిగిన ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపి చరిత్రలో నిలిచిపోయారు. ఫైనల్లో పాకిస్థాన్ జట్టు భారత్ ని ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. అయితే 2019లో

ఇంగ్లాండ్‌లో జరిగిన ప్రపంచకప్ తర్వాత పాకిస్థాన్ జట్టు ప్రదర్శన ఆశించిన స్థాయిలో లేకపోవడంతో సర్ఫరాజ్ స్థానం జట్టులో స్థిరంగా తన స్థానాన్ని నిలుపుకోలేకపోయాడు. ఆ టోర్నమెంట్ తర్వాత ఆయన కేవలం మూడు వన్డే మ్యాచ్‌లు మాత్రమే ఆడారు. అయితే జూనియర్ క్రికెట్ ఆడే స్థాయిలో కూడా సర్ఫరాజ్ అహ్మద్ అనేక విజయాలు సాధించారు. 2006లో జరిగిన అండర్-19 ప్రపంచకప్‌లో పాకిస్థాన్ జట్టును విజేతగా నిలిపారు. ఆ ఫైనల్లో భారత్‌పై విజయం సాధించారు. ఆ భారత జట్టులో రోహిత్ శర్మ, ఛతేశ్వర్ పుజారా, రవీంద్ర జడేజా, పీయూష్ చావ్లా వంటి ఆటగాళ్లు సభ్యులుగా ఉన్నారు. కాగా ఇటీవల వచ్చిన నివేదికల ప్రకారం సర్ఫరాజ్ అహ్మద్ త్వరలో పాకిస్థాన్ జట్టు ప్రధాన కోచ్‌గా బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉందని సమాచారం. ఇప్పటికే ఆయనను ఎంపిక కమిటీలో మిస్బా-ఉల్-హక్ తో పాటు సభ్యుడిగా నియమించారు.

# ఆ ఇద్దరినీ వదిలిపెట్టి కేకేఆర్ పెద్ద తప్పు చేసింది.. ఐపీఎల్ ట్రోఫీ గెలవదని కుంబ్లే జోస్యం



**హైదరాబాద్ పెన్ పవర్:** మరికొద్దీ రోజుల్లో ఐపీఎల్ 2026 ప్రారంభం కానుంది. మార్చి 28వ తేదీన ఆర్సీబీ వర్సెస్ -ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌తో ఈ మెగా టోర్నీ స్టార్ట్ అవుతుంది. ఇప్పటికే కేకేఆర్ టీమ్ కెప్టెన్ గా ఎవరు ఉంటారనే అంశం వార్తల్లో నిలిచింది. బంగ్లాదేశ్ ఆటగాడు ముస్తాఫిజుర్ రెహమాన్‌ను బీసీసీఐ ఆదేశాలతో జట్టు నుంచి తప్పించి.. అతడి ప్లేస్ లో జింబాబ్వే పేసర్ ముజరబానీని తీసుకుంది. జట్టులోని కీలక ప్లేయర్స్ వేలానికి ముందు రిటైన్ చేసుకోకుండా వదిలి పెట్టింది. కేకేఆర్ తీరుపై భారత మాజీ స్పిన్నర్ అనిల్ కుంబ్లే రియాక్ట్ అయ్యాడు. శ్రేయస్ అయ్యర్, ఫిల్ సాల్ట్ లని విడిచి పెట్టి కోల్‌కతా నైట్‌రైడర్స్ పెద్ద తప్పు చేసిందని అనిల్ కుంబ్లే అభిప్రాయపడ్డాడు. కీలక ప్లేయర్స్ ని అట్టిపెట్టుకోవడం ఎంత ముఖ్యమన్నది వాళ్లు అర్థం చేసుకుంటే తప్ప ఐపీఎల్ టైటిల్ కి కేకేఆర్ అర్హత సాధించలేదని హెచ్చరించాడు. 2024లో శ్రేయస్ ఆధ్వర్యంలో కోల్‌కతా ట్రోఫీ గెలుచుకుంది. అనంతరం అతడు, సాల్ట్ ఆ జట్టును వదిలి పెట్టారు.. శ్రేయస్ పంజాబ్ జట్టులో జాయిన్ కాగా.. సాల్ట్ ఆర్సీబీలో చేరాడు. దాదాపు దశాబ్దం విరామం తర్వాత గత ఏడాది పంజాబ్ కింగ్స్ ఫైనల్ చేరగా.. ఆర్సీబీ తొలిసారి టైటిల్ ని కైవసం చేసుకుంది.. రెండేళ్ల కింద కేకేఆర్ ఐపీఎల్ కప్ విన్నర్ గా నిలిచింది.. మూడోసారి టైటిల్ ని దక్కించుకున్న కేకేఆర్.. విజయంలో శ్రేయస్, సాల్ట్ కీ రోల్ పోషించారని వెల్లడించారు.కోల్‌కతా నైట్‌రైడర్స్ యాజమాన్యం ఆ ఇద్దరినీ వదిలి పెట్టుకుంది.. సీనియర్ ఆటగాళ్లను అట్టిపెట్టుకునే విషయంలో కోల్‌కతాకి నిలకడ లేదని మాజీ ఆటగాడు అనిల్ కుంబ్లే పేర్కొన్నారు. శ్రేయస్, సాల్ట్ ను వదులుకోవాలిని కేకేఆర్ నిర్ణయం తప్పని చెప్పారు. అజింక్యా రహానె రూపంలో అనుభవజ్ఞుడైన కెప్టెన్ కేకేఆర్ కి ఉన్నప్పటికీ.. కెప్టెన్ గా అతడు ఇంకా టైటిల్ ని దక్కించుకోలేదని తెలిపాడు. శ్రేయస్ అయ్యర్ నాయకత్వ పటిమపై కుంబ్లే ప్రశంసలు కురిపించాడు.

# న్యూజిలాండ్‌పై అదరగొట్టిన సౌతాఫ్రికా.. ఏడు వికెట్ల తేడాతో ఘన విజయం




**హైదరాబాద్ పెన్ పవర్:** న్యూజిలాండ్ టూర్ ని సౌతాఫ్రికా ఘనంగా ప్రారంభించింది. మౌంట్ మంగునూయ్ వేదికగా జరిగిన తొలి టీ20లో కివీస్ పై ఏకంగా 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికా గ్రాండ్ విక్టరీ సాధించింది. దీంతో ఐదు మ్యాచుల సిరీస్ లో ప్రోటీస్ 1---0 ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఐడెన్ మార్క్రమ్, క్వింటన్ డికాక్, కగిసో రబాడ, లుంగి ఎంగిడి లాంటి సీనియర్లు లేనిప్పటికి.. కేశవ్ మహారాజ్ కెప్టెన్సీలో సఫారీ యంగ్ టీమ్ అద్భుతంగా రాణించింది. ఈ మ్యాచులో మొదట బ్యాటింగ్ చేసిన న్యూజిలాండ్ 14.3 ఓవర్లలో కేవలం 91 రన్స్ చేసి ఆలౌట్ అయింది. ప్రోటీస్ బౌలర్ల ధాటికి కివీస్ బ్యాటర్లు విలవిల్లాడారు.

న్యూజిలాండ్ బ్యాటర్లలో నీషమ్(26) ఒక్కడే టాప్ స్కోరర్ గా నిలిచాడు. మిగితా బ్యాటర్లు అందరూ ఘోరంగా విఫలం అయ్యారు. ప్రోటీస్ బౌలర్లలో న్కోబాని మోకోనా 3 వికెట్లు తీసుకోగా, కోయిట్జ్, బార్ట్మన్, కేశవ్ మహారాజ్ తలా రెండు వికెట్ల చొప్పున పడగొట్టారు. అనంతరం 92 పరుగుల లక్ష్య చేధన కోసం బరిలోకి దిగిన సౌతాఫ్రికా కూడా తీవ్రంగా కష్టపడింది. కివీస్ కెప్టెన్ మిచెల్ శాంట్నర్ కట్టుదిట్టంగా బౌలింగ్ చేయడంతో.. సఫారీలను ముప్పు తిప్పలు పెట్టాడు.ఇక సౌతాఫ్రికా ఓపెనర్ కానర్ ఎస్టర్‌హైజెన్(45) అజేయంగా నిలిచి మ్యాచ్ ని కంప్లీంట్ చేశాడు. ఫలితంగా ప్రోటీస్ లక్ష్యాన్ని 16.4 ఓవర్లలో 3 వికెట్లు మాత్రమే కోల్పోయి టార్గెట్ ని చేధించింది. దీంతో రెండు జట్ల మధ్య రెండో టీ20 హామిల్టన్ వేదికగా మార్చి 17వ తేదీన జరగనుంది.




# ప్రభాస్- హోంబలే డీల్.. ఆ ఇద్దరు డైరెక్టర్స్ ఎవరు?




పాన్ ఇండియా స్టార్ ప్రభాస్, ప్రముఖ నిర్మాణ సంస్థ హోంబలే ఫిల్మ్స్ మధ్య ఇటీవల కుదిరిన భారీ డీల్.. ఇప్పటికే సినీ ఇండస్ట్రీలో హాట్ టాపిక్ గా మారిన సంగతి తెలిసిందే. ఇప్పటికే వీరి కాంబినేషన్ లో వచ్చిన సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్ భారీ విజయాన్ని సాధించింది. ఆ సక్సెస్ తో ప్రభాస్- హోంబలే ఫిల్మ్స్ కాంబోపై మంచి అంచనాలు ఏర్పడ్డాయి. అంతే కాదు ఆ మూడు సినిమాల డీల్ అందరి దృష్టిని ఆకర్షించింది.అయితే ఆ డీల్ లో భాగంగా ఇప్పటికే ఒక సినిమా ఫిక్స్ అయింది. అదే సలార్: పార్ట్ 2 శౌర్యంగ పర్వం. స్టార్ డైరెక్టర్ ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందిన సలార్ ఫస్ట్ పార్ట్.. పాన్ ఇండియా లెవెల్ లో సూపర్ రెస్పాన్స్ అందుకుంది. యాక్షన్ ఎలిమెంట్స్, స్టోరీ, ప్రభాస్ స్క్రీన్ ప్రెజెన్స్, ఎలివేషన్స్ ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో సీక్వెల్ కోసం అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.ప్రస్తుతం ప్రభాస్ ఇతర ప్రాజెక్టులతో బిజీగా ఉన్నప్పటికీ, సలార్ 2 త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశాలు ఉన్నాయని సమాచారం. ఆ సినిమాను హోంబలే ఫిల్మ్స్ భారీ స్థాయిలో నిర్మించనుంది. అయితే ప్రభాస్ తో చేసుకున్న ఒప్పందంలో భాగంగా మిగిలిన రెండు సినిమాలు ఏమిటన్నది ఇప్పటికీ అధికారికంగా ప్రకటించలేదు. దీంతో ఆ మూవీలు.. ప్రభాస్ ఏ డైరెక్టర్స్ తో చేయనున్నారోనని ఇప్పటికీ క్వశ్చన్ మార్క్.అయితే ఆ రెండు ప్రాజెక్టులు ఇద్దరు యువ దర్శకులతో ఉండొచ్చనే వార్తలు ఇప్పుడు వినిపిస్తున్నాయి. ఆ దర్శకుల్లో ఒకరు మలయాళ డైరెక్టర్ దింజిత్ అయ్యథాన్ అని టాక్ వినిపిస్తోంది. ఆయన కిష్కింధ కాండ, ఏకో సినిమాలతో ఇండస్ట్రీలో ప్రత్యేక గుర్తింపు పొందారు. ఇటీవల దింజిత్ ప్రభాస్ ను కలిసి కథ వినిపించినట్లు తెలుస్తోంది. డార్లింగ్ ఇమేజ్ కు తగ్గట్లు దింజిత్ ఆ స్టోరీ రాసుకున్నారని టాక్. అదే సమయంలో మరో దర్శకుడు కూడా డార్లింగ్ కు ఇటీవల ఓ కథ వినిపించినట్లు సమాచారం. కోలీవుడ్ దర్శకుడు రాజ్ కుమార్ పెరియస్వామి ఇటీవల ప్రభాస్ ను కలిసి న ట్లు వార్తలు వినిపిస్తున్నా యి. రాజ్ కుమార్ దర్శకత్వంలో వచ్చిన అమరన్ మంచి విజయాన్ని అందుకోవడంతో ఆయన కథపై కూడా ఆసక్తి నెలకొంది. అయితే ఆ రెండు కథలు విన్న ప్రభాస్.. ఇంకా ఫైనల్ డెసిషన్ తీసుకోలేదని తెలుస్తోంది.ప్రస్తుతం ప్రభాస్ చేతిలో పలు భారీ ప్రాజెక్టులు ఉన్నాయి. వాటి మధ్య హోంబలే ఫిల్మ్స్ తో ఉన్న మూడు చిత్రాల ఒప్పందం స్పెషల్ ఇంపార్టెన్స్ దక్కించుకుంది. ముఖ్యంగా సలార్ 2 ఇప్పటికే ఖరారవ్వడంతో మిగిలిన రెండు సినిమాలు ఏవో అన్న ఆసక్తి అభిమానుల్లో పెరుగుతోంది. దింజిత్ అయ్యథాన్, రాజ్ కుమార్ పెరియస్వామి చెప్పిన కథలలో ఏది ఫైనల్ అవుతుందో లేదా మరో కొత్త దర్శకుడితో సినిమా ప్రకటిస్తారా అన్నది త్వరలోనే క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. అప్పటివరకు ఆ ప్రాజెక్టులపై చర్చ కొనసాగుతూనే ఉంటుంది.




Printed by Published by GANTYADA APPARAO on behalf of GANTYADA APPARAO, printed at SRI SAI GANGA PRINTERS AND PUBLICATIONS D.NO: 49-1-35, MIRIYALAPALEM CENTER, RAILWAY STATION ROAD, PRAKASAM, ANDHRA PRADESH - 523001
and published at Plot No: 29, H.NO: 1-24-725, Sri Gayatri Nilayam, Dwaraka Nagar, Tirumalagiri, Secundrabad, Telangana. Editor : GANTYADA APPARAO. PRGI Registration No. "TGTEL/25/A3106". e-mail : editorpenpower@gmail.com, Mobile: 9059465965